ప్రతి అక్షరం ప్రజల కోసం
www.prajapaksham.in
# ప్రజాపక్షం
PRAJAPAKSHAM ★

సంపుటి 09, సంచిక: 313 | మంగళవారం | 13-10-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




ఎసిబి వలలో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్, మండల సర్వేయర్ 10

ఆర్‌టిసి – మెట్రో కామన్ పాస్ చార్జీల పునఃపరిశీలన


ర్యాలీలో డి.రాజా, ఎం.ఎ.బేబీ



# సుప్రీంకోర్టుకు ప్రజాస్వామ్య యాత్ర

**సిఇసి అక్రమాలపై ఇండియా కూటమి పిటిషన్**

**సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది వీరే..**

రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే (కాంగ్రెస్) సౌగతరాయ్(టిఎంసి), అఖిలేశ్ యాదవ్ (ఎస్‌పి), తేజస్వీ ప్రసాద్ యాదవ్(ఆర్‌జెడి), సుప్రియా సూలే (ఎన్‌సిపి– పవార్) సంజయ్ రౌత్(శివసేన– యుబిటి), డి.రాజా (సిపిఐ), ఎం.ఎ.బేబీ (సిపిఐ(ఎం)), మహువా మొయిత్రా (జెఎంఎం), ఇ.టి.మహ్మద్ బషీర్ (ఐయుఎంఎల్)

- వేలాదిగా ఇండియా కూటమి నేతలు, కార్యకర్తలు కదం
- కన్నాట్ ప్లేస్ బరఖాంబా జంక్షన్ నుండి సుప్రీంకోర్టుకు వెలుతుండగా భగవాన్ దాస్ రోడ్ వద్ద పోలీసులు అడ్డగింత

**న్యూఢిల్లీ:** ఓట్‌చోరీకి,కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అక్రమాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు కాంగ్రెస్,సిపిఐ,ఇతర ఇండియా కూటమికి చెందిన ప్రతిపక్ష నాయకులు,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పలువురు ముఖ్యమంత్రులు సహా వేలాదిమంది కార్యకర్తలు సామూహికంగా సోమవారం ఢిల్లీలో ''ప్రజాస్వామ్య యాత్ర'' చేశారు. కన్నాట్ ప్లేస్ బరఖాంబా జంక్షన్ నుండి సుప్రీంకోర్టు వరకూ తలపెట్టిన ఈ యాత్రను పోలీసులు భగవాన్ దాస్ రోడ్ వద్ద అడ్డుకున్నారు. ముందుకు కదలనివ్వలేదు.సుప్రీంకోర్టుకు ప్రదర్శనగా వెళ్ళి ఓట్‌చోరీపై పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించుకుని ప్రతిపక్ష నాయకులు ఈ ప్రజాస్వామ్య యాత్ర ప్రారంభించారు. కానీ పోలీసులు ఈ యాత్రను అడ్డుకోవడంతో ఇక ఆలస్యం లేకుండా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు,కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ,కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే,ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా,భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఇతర ప్రతిపక్షాల నాయకులు ఈ ప్రజాస్వామ్య యాత్రకు నాయకత్వం వహించారు. ఐతే పోలీసులు వారిని అడ్డుకోవడంతో వారి తరపున సుప్రీంకోర్టు సమయం ముగిసిపోకముందే సోమవారం సాయంత్రం పిటిషన్ దాఖలు చేశారు. వారితోపాటు ఈ పిటిషన్ దాఖలు చేసినవారిలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపి సౌగతరాయ్,సమాజ్‌వాదీపార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్,రాష్ట్రీయ జనతాదళ్ నాయకుడు తేజస్వీ ప్రసాద్ యాదవ్,నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీ(పవార్) తరువాయి 8లో







నిరసనల వేదికగా

# జంతర్ మంతర్ రద్దు

- డీ నోటిఫై చేస్తూ హోంశాఖ ప్రకటన విడుదల
- కొత్త నిరసన ప్రదేశాలుగా రామ్‌లీలా మైదాన్, బురారీ గ్రౌండ్, సిబిడి గ్రౌండ్
- కేంద్ర చర్యపై మండిపడ్డ ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు

**న్యూఢిల్లీ :** సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు, యువజన, విద్యార్థి సంఘాలు జంతర్ మంతర్ వద్ద గత కొంత కాలంగా కొనసాగిస్తున్న ఆందోళనలు, నిరసన ప్రదర్శలను ఏదో ఒక రకంగా అణచివేసేందుకు కుట్ర చేస్తున్న కేంద్రం తాజాగా మరో భారీ కుట్రకు తెర లేపింది. వరుస ఆందోళనల కారణంగా ప్రభుత్వ పరిపాలనా కేంద్రమైన న్యూఢిల్లీ జిల్లా స్తంభించిపోయిన నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు జంతర్ మంతర్‌ను నిరసనలకు నిర్దేశించిన ప్రదేశం జాబితా నుండి తొలగించారు. ఈ మేరకు డీ నోటిఫై చేస్తూ సోమవారం ఒక తరువాయి 8లో

# నీరు... పొదుపు

**రానున్న 10 నెలలు తాగునీటికే ప్రాధాన్యం**

- యాసంగిలో వరి, పత్తి సాగుకు దూరంగా ఉండాలి
- ఆరుతడి పంటల వైపు మొగ్గుచూపాలి
- ఎల్‌నినో పరిస్థితుల సమీక్షకు రాష్ట, జిల్లా స్థాయిలో వార్‌రూంలు
- రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రి తుమ్మల సూచనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నీటి సంక్షోభం తీవ్రతరం అయ్యే అవకాశాల నేపథ్యంలో యాసంగిలో వరి, పత్తి సాగుకు దూరంగా ఉండాలని ప్రభుత్వం రైతులకు సూచించింది. రానున్న 10 నెలలు తాగునీటి అవసరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సోమవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రంలోని నీటి లభ్యత, వ్యవసాయ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే చర్యలపై వారు జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, రైతులతో చర్చించారు. ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం ఎల్‌నినో ప్రభావం డిసెంబర్ నాటికి గరిష్ఠ స్థాయికి చేరి, 2027 వరకు కొనసాగే అవకాశముందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. వచ్చే ఏడాది జూన్, జులై వరకు వర్షాలు కురిసే పరిస్థితులు ఆశాజనకంగా లేవని పేర్కొన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీరు, పశువుల అవసరాలకే వినియోగించాలని సూచించారు. తాగునీటి ఎద్దడి, ఆహార ధాన్యాల కొరత తలెత్తకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. వ్యవసాయ తరువాయి 8లో



## మాతో టచ్‌లో 200 మంది అధికారులు 07

- జ్ఞానేశ్ కుమార్ నుంచి నాకు మెసేజ్‌లు వస్తున్నాయ్
- ఇక అప్రూవర్‌గా మారు
- ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కీలక వ్యాఖ్యలు

## ఓటు హక్కు పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమం 08

**మోదీ, షా, జ్ఞానేశ్ ఓటు చోరీకి కుట్ర**

- 'సైమన్ గో బ్యాక్' స్ఫూర్తితో 'జ్ఞానేశ్ గో బ్యాక్' ఉద్యమం
- ఢిల్లీలో మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# పెరిగిన దుర్భర దారిద్ర్యం

- ప్రపంచ వ్యాప్తంగా భారత ఉపఖండంలోనే ఎక్కువ
- 16 ఏళ్ళలో 120 కోట్లకు పెరుగుదల
- ఆకలి, అవిద్య, నీరు, విద్యుత్ లభ్యత ప్రధాన సమస్యలు
- యుఎన్‌డిపి నివేదిక వెల్లడి

**న్యూయార్క్:** ప్రపంచవ్యాప్తంగా 120 కోట్లమంది ప్రజలు దుర్భర దారిద్ర్యంలో జీవనం సాగిస్తున్నారని ఐక్యరాజ్యసమితి యుఎన్‌డిపి(యునైటెడ్ నేషన్స్ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్) నివేదిక స్పష్టం చేసింది.గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాదినాటికి దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోయే ప్రజల సంఖ్య 5.15 కోట్లు అదనంగా పెరిగిందని నివేదిక పేర్కొంది. భారత ఉపఖండంలోని దేశాలలోనే ఈఘోర పేదరికం అనుభవించేవారు ఎక్కువ మంది ఉన్నారు. బాధితులలో ఎక్కువ మంది పిల్లలే ఉన్నారు. ఐతే పేదరికం, బహుముఖ పేదరికం అనుభవించేవారి సంఖ్య తరువాయి 12లో





## ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

స్థూల ఆర్థిక స్థిరత్వంపై పరిశోధనకు గుర్తింపుగా రాబర్ట్ ఇ.హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌ను వరించిన పురస్కారం

**న్యూఢిల్లీ :** ఆర్థిక శాస్త్రంలో 2026 సంవత్సరానికి గాను ఇద్దరికి నోబెల్ బహుమతి వరించింది. స్థూల ఆర్థిక స్థిరీకరణకు సంబంధించి సూక్ష్మ ఆర్థిక పునాదులపై చేసిన కృషికి గాను అమెరికాలో జన్మించిన ఆర్థికవేత్తలు రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్ తరువాయి 12లో

**సిఇసి తొలగింపుపై**

## కేరళం అసెంబ్లీ తీర్మానం ఆమోదం



**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై చెలరేగుతున్న వివాదం నేపథ్యంలో, కేరళ శాసనసభ సోమవారం సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. దేశంలోనే బహుశా మొట్టమొదటిదైన ఈ తీర్మానాన్ని ముఖ్యమంత్రి వి.డి. సతీసన్ ప్రవేశపెట్టారు. ఓటర్ల జాబితా సవరణలు, అర్హులైన ఓటర్ల ఓటు హక్కును హరించడం, ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై తీవ్రమైన ఆందోళనలు ఉన్నాయని, వీటన్నింటినీ తరువాయి 12లో

# రిటైల్ ద్రవ్యోల్బణం పైపైకి

- 5.54 శాతానికి చేరిక
- సెప్టెంబర్‌లో గణనీయంగా పెరిగిన ఉల్లిపాయలు, ఇతర ఆహార పదార్థాల ధరలు



**న్యూఢిల్లీ:** వినియోగ వస్తువుల ధరలు గత నెల భారీగా పెరిగాయని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తాజా వివరాలను అనుసరించి, సెప్టెంబర్ మాసంలో ఉల్లిపాయలు, ఇతర ఆహార పదార్థాల ధరలు గణనీయంగా పెరగడంతో రిటైల్ ద్రవ్యోల్బణం కూడా పెరిగి, 5.54 శాతానికి చేరుకుంది. వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారిత ప్రధాన ద్రవ్యోల్బణం ఆగస్టులో 4.83 శాతంగా నమోదైంది. జాతీయ గణాంక కార్యాలయం (ఎన్‌ఎస్‌ఒ) ప్రకటన ప్రకారం, ఆహార ద్రవ్యోల్బణం ఆగస్టులో 5.97 శాతంగా ఉండగా, సెప్టెంబర్‌లో 7.74 శాతానికి పెరిగింది. అత్యధిక ద్రవ్యోల్బణం నమోదైన వస్తువుల్లో ఉల్లిపాయలు (108.09 శాతం), వెండి ఆభరణాలు (87.8 శాతం), అల్లం (62.85 శాతం), వెల్లుల్లి (54.62 శాతం), నిమ్మకాయలు (36.41 శాతం) మొదటి ఐదు స్థానాలను ఆక్రమించాయి. గ్రామీణ ప్రాంతాల్లో సిపిఐ ద్రవ్యోల్బణం 6.08 శాతంగా, పట్టణ ప్రాంతాల్లో 4.88 శాతంగా నమోదైంది. 2024ను ఆధార సంవత్సరంగా చూస్తే, ఆ ఏడాది సెప్టెంబర్‌లో ద్రవ్యోల్బణం 5.54 శాతంగా నమోదైంది. తిరిగి అంత గరిష్టస్థాయికి ద్రవ్యోల్బణం చేయడం ఇదే మొదటిసారి. గత వారం, భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బిఐ) తన కీలక రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50శాతానికి తరువాయి 12లో



కొత్త ఫారం-6ను

# సుప్రీంకోర్టు ఆమోదించలేదు

- ఇసి ప్రకటనపై సిజెఐ ఆగ్రహం
- దరఖాస్తులో మార్పులు ఎవరు చేశారో రికార్డులు పరిశీలించి తేలుస్తామని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** బిహార్ ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)కు అంశంలో కొత్త ఫామ్–6పై ఎలాంటి తీర్పు ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తీర్పు వెలువరించినప్పుడు కొత్త ఫారం–6 అంశమే లేదని తెలిపింది. వివిధ రాష్ట్రాల్లో ఎస్‌ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఉపయోగిస్తున్న ఫామ్–6లో చేసిన మార్పులను అత్యున్నత న్యాయస్థానం ఆమోదించిందన్న ఇసి చేసిన ప్రకటనపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దరఖాస్తులో మార్పులు ఎవరు చేశారో రికార్డులు పరిశీలించి తేలుస్తామని పేర్కొంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం సోమవారం బిహార్ ఎస్‌ఐఆర్‌కు సంబంధించిన పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తరువాయి 8లో

# ఆరు రాష్ట్రాలకు గవర్నర్ల నియామకం..

తమిళనాడుకు రాజేంద్రవిశ్వనాథ్ అర్లేకర్



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం ఆరు రాష్ట్రాలకు గవర్నర్లను నియమించింది. కేరళం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను తమిళనాడుకు బదిలీ చేసింది. ఇప్పటివరకు ఆయన తమిళనాడు గవర్నర్‌గానూ అదనపు బాధ్యతలు నిర్వర్తించగా.. తాజాగా పూర్తి బాధ్యతలు అప్పగించింది. సిక్కిం గవర్నర్ ఓం ప్రకాశ్ మాథూర్.. కేరళానికి బదిలీ అయ్యారు. ఒడిశాకు బ్రజ్‌మోహన్ రామ్‌ను నూతన గవర్నర్‌గా నియమించింది. కర్ణాటకకు డా.సుధా యాదవ్, ఉత్తరాఖండ్‌కు డా.ధాల్ సింగ్ బైసెన్, సిక్కింకు దుశ్యంత్ గౌతమ్ గవర్నర్లుగా నియమితులైనట్లు రాష్ట్రపతి భవన్ ప్రకటన చేసింది.

# సుప్రీంకోర్టుకు రాహుల్ పీపుల్స్ పిటిషన్

కొన్ని తరగతుల ఓటర్లపై గురిపెట్టి వారిని తొలగించేందుకై 'ప్రత్యేక ముమ్మర రివిజన్' ప్రక్రియను దుర్వినియోగం చేస్తూ పాలక బిజెపి ఎన్నికల అవకాశాలను మెరుగుపరుస్తున్న పక్షపాత రిఫరీ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి లేదా ప్రభుత్వం బర్తరఫ్ చేయాలన్న ప్రతిపక్ష ఇండియా కూటమి, పౌరసమాజ సంస్థలు, విద్యార్థి – యువజన సంఘాల గొంతుకను బలమైన ప్రజావాణిగా మార్చిన కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధి సోమవారం ఆ వాణిని సుప్రీంకోర్టుకు చేర్చారు. అక్టోబర్ 2న, గాంధీ జయంతినాడు ప్రారంభమైన ఈ ప్రతిపక్ష ఆందోళన వివిధ రూపాల్లో వ్యాప్తి చెందుతూ, ఇండియా కూటమి వెలుపలనున్న రాజకీయ, సామాజిక సంస్థలను, ప్రముఖ వ్యక్తులను కలుపుకుంటూ బిజెపిని 'ఓట్–చోరీ' నేరస్థురాలిగా, అక్రమంగా అధికారాన్ని గుంజుకుంటున్న పార్టీగా ప్రజల ముందు నిలిపింది. ఓటర్ల జాబితాల్లో తారుమార్లుకు సహకరించటం ద్వారా అనేక నియోజకవర్గాల్లో బిజెపి మైనారిటీ స్థితిని మెజారిటీగా మార్చటానికి విధేయత పూర్వకంగా దోహదం చేసిన వ్యక్తిగా జ్ఞానేశ్ కుమార్ ఆరోపణలకు గురైనాడు. ఈ కుతంత్రాన్ని పసిగట్టి ఆధారపూర్వకంగా బట్టబయలు చేసిన వ్యక్తి రాహుల్‌గాంధి. 2025లో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ఆరేడు మాసాలముందు హడావిడిగా సర్ ప్రక్రియను ప్రారంభించటంలోనే కుత్సితం ఉంది. నింపాదిగా నిర్వహించవలసిన కార్యక్రమాన్ని అంత ఆకస్మికంగా ఆ రాష్ట్రంలోనే ఎందుకు మొదలుపెట్టారు అన్న ప్రశ్నకు జవాబులేదు. హర్యానా, మహారాష్ట్రల్లో ఎన్నికల కమిషన్ దొంగనాటకాన్ని రాహుల్‌గాంధి బహిరంగంచేసి, ఇసి నుంచి సంజాయిషీ కోరినప్పుడు జ్ఞానేశ్ కుమార్ రాజకీయ నాయకుడిలా పత్రికాగోష్టిపెట్టి రాహుల్ నుంచి క్షమాపణ డిమాండ్ చేశాడు తప్ప, ఆయన ఆరోపణల్లోని వాస్తవం పరీక్షించేందుకు దర్యాప్తు ఆదేశించలేదు. పశ్చిమ బెంగాల్‌లో బిజెపిని అధికారంలోకి తేవటానికి ఓట్ల తొలగింపుకోసం ఎన్ని అక్రమాలకు ఒడిగట్టారో దేశం ముందు పరిచిన తెల్లకాగితంలా ఉండనే ఉంది. ఓట్ల తొలగింపు అనేది మూడవ దశతో 13కోట్లు దాటింది. తొలగింపుకు గురైన వారిలో అత్యధికులు ముస్లింలు, దళితులు, ఆదివాసీలు, బలహీనవర్గాలు. సర్ ప్రక్రియ క్రమంలోనే కొత్త ఓటర్ల చేర్పు ప్రక్రియను కూడా చేర్చి, తొలగించిన సంఖ్యలో ఈ సంఖ్యను తీసివేయటంవల్ల వాస్తవంగా తొలగించబడిన వారి సంఖ్య తక్కువగా కనిపిస్తున్నది. మొత్తం 30రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కొత్తగా చేరిన లేదా చేర్చిన ఓటర్ల సంఖ్యను మినహాయించి చూస్తే తొలగించబడిన ఓటర్ల సంఖ్య మరో రెండు–మూడు కోట్లు ఉంటుంది. ఢిల్లీ ఓటర్లలో మూడవవంతు, అలాగే కర్నాటక, తెంగాణల్లో 20 శాతానికి పైగా ముసాయిదా జాబితానుంచి తొలగించబడిన తర్వాత బిజెపియేతర రాజకీయ పార్టీలు ఉలిక్కిపడ్డాయి, మేల్కొన్నాయి. ఉద్యమానికి శ్రీకారం చుట్టాయి.

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, సర్ రద్దు, పాత ఓటర్ల జాబితాల పునరుద్ధరణ, బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు డిమాండ్ చేస్తూ గాంధేయ సత్యాగ్రహం పద్ధతిలో ఆందోళన చేస్తుండగా, ఢిల్లీలో 20వేలమందికిపైగా పోలీసు, ఇతర భద్రతా దళాలను సమీకరించి దాన్నొక దుర్గంగా మార్చిన మోదీ–షా ప్రభుత్వం ప్రదర్శకుల పట్ల క్రూరంగా వ్యవహరిస్తున్నది. 60కిపైగా మెట్రో స్టేషన్‌లు మూసివేసి, ఢిల్లీకి వచ్చే రైళ్లను ముందు స్టేషన్‌లలో ఆపుచేసి, రవాణాను స్తంభింపజేసి చుట్టుపక్కల రాష్ట్రాలనుంచి ప్రదర్శకులెవరూ ఢిల్లీ చేరుకోకుండా ఎమర్జెన్సీని తలపించారు. ఇంకా చిత్రమేమంటే జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలో పాల్గొనేందుకు బొంబాయి నుంచి ఢిల్లీకి విమానంలో వచ్చిన కాక్రోచ్ జనతాపార్టీ ముఖ్యనాయకులు ముగ్గుర్నీ విమానంలోనే అరెస్టు చేసిన పోలీసులు అజ్ఞాత ప్రదేశానికి తీసుకెళ్లారు. వాళ్లేమైనా టెర్రరిస్టులా, వాళ్ల దగ్గర ఆయుధాలున్నాయా? రాజకీయ పార్టీల ఆందోళనకు సిజెపి సహా అరడజను విద్యార్థి సంఘాల ఆందోళన తోడు కావటంతో ప్రభుత్వం ఎంతగా జడిసిపోయిందో ఈ ఘటన తెలియజేస్తున్నది.

ఇప్పటికే ప్రతిపక్షాలు–జ్ఞానేశ్ కుమార్, మోదీ, షా వ్యతిరేక ఆందోళనను ఓటు హక్కు రక్షణకై సాగిస్తున్న 'ప్రజాస్వామ్య పరిరక్షణ' ఉద్యమంగా ప్రజల్లోకి తీసుకెళ్లటంలో సఫలీకృతమైనాయి. ఈలోపు, ఎన్నికల కమిషన్ వ్యవహారాలపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌లు, ప్రారంభ విచారణలో సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు ప్రతిపక్షాల పోరాటంలోని నిజాయితీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాయి. ఆదివారం కూడా పోలీసులు ఊపిరి సలుపుకోకుండా ఢిల్లీలో ఆందోళనలు–పోలీసుల అణచివేతలు కొనసాగాయి. ఈలోపు ఇండియా కూటమి సోమవారం అసాధారణంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌కు మెమొరాండం ఇచ్చేందుకు కాన్‌స్టిట్యూషన్ క్లబ్ నుంచి సుప్రీంకోర్టుకు ర్యాలీ తలపెట్టాయి. కాంగ్రెస్ ముఖ్యనాయకులంతా ఢిల్లీ చేరారు. కాని ర్యాలీకి పోలీసు అనుమతి ఇవ్వలేదు. రెండోవైపున సిజెపి పార్టీ జంతర్‌మంతర్‌వద్ద ఆందోళనకు మళ్లీ ఢిల్లీ పోలీసులకు దరఖాస్తు చేసింది. కాగా ముగ్గురు యువనాయకుల విడుదలను కోర్టు ఆదేశించింది. ఇండియా కూటమి ప్రతినిధి వర్గాన్ని కలుసుకునేందుకు సిజెఐ నిరాకరిస్తూ, కోర్టులో కేసులు ఉన్నందున మీరు కూడా కేసు వేసి విచారణలో చేరండి అని సలహా ఇచ్చారు. తమది రాజకీయ పోరాటం లేదా పార్టీ కార్యక్రమం కాదని, దేశ ప్రజల ఓటుహక్కును, తద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఉద్యమమని, ఇందులో రాజకీయాలకు అతీతంగా అందరూ చేరాలని రాహుల్ గాంధి విజ్ఞప్తి చేశారు. ప్రజల కు రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కు హరించే కుట్రకు పాల్పడిన నరేంద్రమోదీ, అమిత్ షా, మోహన్ భాగవత్, అజిత్ దోవల్, జ్ఞానేశ్ కుమార్ – ఈ ఐదుగురి కీ చట్టం ప్రకారం శిక్ష పడేవరకు విడిచిపెట్టబోమని హెచ్చరిక చేశారు. ఊహించినట్లే ఇండియా కూటమి ఎంపిలతోపాటు సమాజ్‌వాది, ఆర్‌జెడి నేతలు, కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, మంత్రులు, వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులతో పాటు అసంఖ్యాకంగా ప్రజలు చేరటంతో సుప్రీంకోర్టుకు ప్రజాస్వామ్య రక్షణ ర్యాలీ సాయంత్రం ఘనంగా సాగింది. అక్కడికి చేరుకున్నాక రాహుల్‌గాంధీ, అఖిలేశ్ యాదవ్ (ఎస్‌పి), తేజస్వీ యాదవ్(ఆర్‌జెడి), కాంగ్రెస్ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, డి.కె.శివకుమార్ తదితరులతో కూడిన బృందం కోర్టువద్దకు వెళ్లగా, మొత్తం 10పార్టీల తరఫున కాంగ్రెస్ న్యాయవాదులు తమ కేసును సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి అందజేశారు. ఇక ఒకవైపు న్యాయపోరాటం, రెండోవైపున ప్రజాపోరాటం జమిలిగా సాగుతాయి. ఈ ఉద్యమం మరింత శక్తిమంతమైన జాతీయోద్యమంగా బలం పుంజుకోవాలంటే స్థానిక రాజకీయ వైరుధ్యాలతో ఇండియా కూటమి వెలుపల ఉండి, విడిగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆప్, డిఎంకె వగైరా పార్టీలు, తూతూ మంత్రంగా అడపాదడపా ప్రకటనలు చేస్తున్న బిఆర్ఎస్, వైసిపి పార్టీలు, తమిళనాడు పాలక కూటమి పార్టీలు, వాటి ప్రజాసంఘాలు, ఇండియా కూటమి కార్యక్రమాలతో ఆందోళనను సమన్వయం చేసుకుంటూనే ఒకడుగు దూరం పాటిస్తున్న సిజెపి ఇతర విద్యార్థి యువజన సంఘాలతోపాటు ఓటుహక్కు పరిరక్షణకై సాగుతున్న ఈ ప్రజాస్వామిక ఉద్యమంలో చురుకుగా భాగస్వాములు కావాలి. ●



## జంతర్ మంతర్ ప్రజాస్వామిక ఆస్తి

మీరు నిరసన ప్రదేశం హోదాను రద్దు చేయవచ్చు, కానీ అసమ్మతిని రద్దు చేయలేరు. అంతకంటే ముఖ్యంగా, ప్రజల ప్రజాస్వామ్య చైతన్యాన్ని మాత్రం కచ్చితంగా రద్దు చేయలేరు. జంతర్ మంతర్ ఒక ప్రజాస్వామ్య ఆస్తిగా ఉండేది. ఇప్పుడు దాని హోదాను రద్దు చేశారు. ఇది రాజ్యం బలహీనతను బైటపెడతోంది. యువ నిరసనకారులకు జంతర్ మంతర్ అనేది వారి ఆందోళనల సామూహిక వ్యక్తీకరణకు, అన్యాయానికి సంబంధించిన వ్యక్తిగత అనుభవాలు ఉమ్మడి రాజకీయ డిమాండ్లుగా మారే ఒక వేదిక.

– మనోజ్ కుమార్ ఝా,
ఆర్‌జెడి ఎంపి



## నిరాడంబర జీవి గుండా మల్లేష్

తెలంగాణ కార్మికోద్యమ చరిత్రలో, ముఖ్యంగా సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో ప్రజా సమస్యలపై గళమెత్తిన నాయకుల్లో గుండా మల్లేశ్ ఒకరు. సాధారణ కుటుంబంలో జన్మించి,లారీ క్లీనర్గా పనిచేసిన స్థాయి నుంచి సీపీఐ నాయకుడిగా,నాలుగుసార్లు శాసనసభ్యుడిగా ఎదిగిన ఆయన జీవితం కార్మిక ఉద్యమాలకు,ప్రజా రాజకీయాలకు సంబంధించిన ఒక ముఖ్యమైన అధ్యాయం.కార్మికుల సమస్యలను స్వయంగా అనుభవించిన నేపథ్యం ఆయన రాజకీయ ప్రస్థానానికి పునాది అయింది. గుండా మల్లేశ్ 1947 జూలై 14న అప్పటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, ప్రస్తుత మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలోని రేచిని గ్రామంలో జన్మించారు. ఆయన తల్లి దండ్రులు బాయమ్మ, గుండా పోషమల్లు సాధారణ రైతు కుటుంబంలో పెరిగిన ఆయన హెచ్‌ఎస్సీ వరకు చదువుకున్నారు. ఆర్థిక పరిస్థితులు, జీవనానుభవాలు ఆయనను చిన్న వయసులోనే ఉపాధి కోసం శ్రమించేలా చేశాయి.యువకుడిగా బెల్లంపల్లిలో లారీ క్లీనర్గా, డ్రైవర్గా పనిచేశారు.ఆ సమయంలో కార్మికులు ఎదుర్కొంటున్న వేతనాలు,పని పరిస్థితులు,హక్కులకు సంబంధించిన సమస్యలను దగ్గరగా చూశారు. తోటి కార్మికుల ఇబ్బందులపై స్పందిస్తూ,వారి తరఫున నిలబడటం ప్రారంభించారు.అనంతరం సింగరేణి కాలరీస్లో కార్మికుడిగా చేరారు.బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికుల జీవితం ఎంత కష్టసాధ్యమో ఆయనకు ప్రత్యక్షంగా తెలిసింది.ఆ అనుభవమే కార్మిక సంఘాల కార్యకలాపాల వైపు, కమ్యూనిస్టు భావజాలం వైపు ఆయనను నడిపించింది.సింగరేణి ప్రాంతంలో కార్మికుల సమస్యలు కేవలం వేతనాలకే పరిమితం కావు.ప్రమాదకరమైన పని పరిస్థితులు, ఉద్యోగ భద్రత,వైద్య సదుపాయాలు,నివాస వసతి, కుటుంబ సంక్షేమం వంటి అంశాలు కార్మిక జీవితాన్ని ప్రభావితం చేస్తాయి.ఈ సమస్యలను దగ్గరగా చూసిన మల్లేశ్ కార్మిక సంఘాల ద్వారా పోరాట మార్గాన్ని ఎంచుకున్నారు.1970లో సింగరేణి ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిస్థాయి రాజకీయ జీవితంలోకి ప్రవేశించారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో పనిచేస్తూ క్రమంగా జిల్లా స్థాయి నాయకత్వం నుంచి రాష్ట్ర స్థాయి నాయకత్వానికి ఎదిగారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో,జాతీయ స్థాయి కమిటీలోనూ బాధ్యతలు నిర్వహించి కార్మికుల తరఫున మాట్లాడటం,పేదలు ఎదుర్కొనే సమస్యలను రాజకీయ చర్చల్లోకి తీసుకురావడం ఆయన ప్రజా జీవితంలో ప్రధానాంశాలుగా నిలిచాయి. 1983లో ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి విజయం సాధించి తొలిసారి శాసనసభలో అడుగుపెట్టారు.1985, 1994లోనూ అదే నియోజకవర్గం నుంచి గెలిచారు. 2009లో బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.ఈ విధంగా నాలుగుసార్లు శాసనసభ్యుడిగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఒక దశలో సిపిఐ శాసనసభాపక్ష నాయకుడిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. గుండా మల్లేశ్ రాజకీయ జీవితం సింగరేణి కార్మిక సమస్యలకే పరిమితం కాలేదు.దళితుల హక్కుల గురించి దళిత హక్కుల పోరాట సమితి(డి ఎచ్ పి ఎస్) అనే జాతీయ స్థాయి సంస్థను స్థాపించారు. ప్రజాప్రతినిధిగా సుదీర్ఘకాలం పనిచేసినప్పటికీ నిరాడంబరంగా జీవించారు. గుండా మల్లేష్ గుండె, మూత్ర పిండాల సమస్యలతో బాధపడుతూ 2020 అక్టోబర్ 13 న హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ లో 73 సంవత్సరాల వయస్సులో మరణించారు. వామపక్ష పార్టీలలో ఒక సామాన్య కార్యకర్త ఒక ప్రజా ప్రతినిధిగా ఎదగవచ్చని గుండా మల్లేష్ జీవితమే ఒక ఉదాహరణ.

ఆళవందార్ వేణు మాధవ్, 8686051752

# మీడియా స్వేచ్ఛపై పెరుగుతున్న దాడులు, కేసులు



నందిరాజు రాధాకృష్ణ
98481 28215

ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలతో పాటు ప్రజల తరఫున ప్రశ్నించే నాలుగో స్తంభంగా మీడియాకు ప్రత్యేక స్థానం ఉంది. అధికారంలో ఉన్నవారి చర్యలను పరిశీలించడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడం, అవినీతి–అక్రమాలను ప్రశ్నించడం పాత్రికేయ వృత్తి యొక్క ప్రాథమిక బాధ్యత. అయితే ఈ బాధ్యతే నేడు అనేక సందర్భాల్లో పాత్రికేయులకు కేసులు, అరెస్టులు, బెదిరింపులు, దాడులు, సంస్థలపై దర్యాప్తులు వంటి రూపాల్లో పెనుసవాలుగా మారుతోంది.

కేసుల సంఖ్య ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా చూపుతోంది. నేషనల్ లా యూనివర్సిటీ–ఢిల్లీ, కొలంబియా లా స్కూల్ హ్యూమన్ రైట్స్ ఇన్‌స్టిట్యూట్, క్లూనీ ఫౌండేషన్ ఫర్ జస్టిస్‌కు చెందిన ట్రయల్ వాచ్ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం 2012–2022 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా పాత్రికేయులపై నమోదైన 423 క్రిమినల్ కేసులు, 427 మంది జర్నలిస్టులు, మొత్తం 624 క్రిమినలైజేషన్ ఘటనలను విశ్లేషించిం ది. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పోలీసు వ్యవస్థపై వార్తలు రాసిన సందర్భాల్లోనే అనేక కేసులు నమోదైనట్లు అధ్యయనం వెల్లడించింది.

ఈ అధ్యయనంలో మరో ఆందోళనకర అంశం వెలుగుచూసింది. మహానగరాల్లో పనిచేసే జర్నలిస్టుల కంటే చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే పాత్రికేయులు అరెస్టులకు ఎక్కువగా గురయ్యారు. పెద్ద నగరాల్లో నమోదైన ఘటనల్లో అరెస్టు శాతం 24 శాతం కాగా, చిన్న పట్టణాలు, గ్రామాల్లో అది 58 శాతానికి చేరింది. అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ పొందిన వారి శాతం మహానగరాల్లో 65 శాతం ఉండగా, చిన్న పట్టణాల్లో కేవలం 3 శాతం మాత్రమే. న్యాయ సహాయం అందుబాటులో లేకపోవడం దీనికి ఒక కారణంగా అధ్యయనం పేర్కొంది.

### 2025లో మరింత ఆందోళనకర దృశ్యం

ఫ్రీ స్పీచ్ కలెక్టివ్ గణాంకాల ప్రకారం 2025లో దేశవ్యాప్తంగా 33 మంది జర్నలిస్టులపై దాడులు నమోదయ్యాయి. జర్నలిస్టుల పనికి సంబంధించిన 14 వేధింపులు, 12 బెదిరింపులు కూడా నమోదయ్యాయి. అదే సంవత్సరంలో మొత్తం 9 మంది జర్నలిస్టులు మరణించారు. ఉత్తర ప్రదేశ్‌లో ఇద్దరు, అండమాన్–నికోబార్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, పంజాబ్‌లలో ఒక్కొక్కరు మరణించినట్లు నివేదిక పేర్కొంది.

2025 తొలి నాలుగు నెలల్లోనే పరిస్థితి తీవ్రతకు మరో అద్దం పడింది. ఆ కాలంలో ఇద్దరు జర్నలిస్టులు హత్యకు గురికాగా, నలుగురిపై దాడులు, ఆరుగురి అరెస్టులు, కనీసం ఐదు బెదిరింపు–వేధింపు ఘటనలు నమోదయ్యాయి. పాత్రికేయులపై కనీసం ఐదు కేసులను లాఫేర్‌గా ఫ్రీ స్పీచ్ కలెక్టివ్ నమోదు చేసింది.

దేశవ్యాప్తంగా స్వేచ్ఛా ప్రసంగానికి సంబంధించిన మొత్తం ఘటనల్లో 2025లో గుజరాత్‌లో 108, ఉత్తరప్రదేశ్‌లో 83, కేరళలో 78, అసోంలో 62, జమ్మూ–కాశ్మీర్‌లో 51 ఘటనలు నమోదైనట్లు గణాంకాలను ఉటంకిస్తూ నివేదికలు పేర్కొన్నాయి. దక్షిణ భారతదేశంలో కర్ణాటకలో 9, ఆంధ్రప్రదేశ్‌లో 7, తమిళనాడులో 6, తెలంగాణలో 5 ఘటనలు నమోదయ్యాయి. ఇవి మీడియా కేసులకే పరిమితమైన సంఖ్యలు కాకుండా, విస్తృతమైన స్వేచ్ఛా ప్రసంగ ఉల్లంఘనలను కలుపుకున్న గణాంకాలని స్పష్టం చేయాలి.

తెలంగాణలో 2025 మార్చిలో ఆన్‌లైన్ న్యూస్ ఛానల్‌కు చెందిన నిర్వాహకురాలు, రిపోర్టర్ అరెస్టు కావడం చర్చనీయాంశమైంది. అసోంలో ఆర్థిక అవకతవకలపై నిరసనను రిపోర్టు చేసిన జర్నలిస్టు అరెస్టై, ఒక కేసులో బెయిల్ వచ్చిన వెంటనే మరో కేసులో అరెస్టయ్యారని ఫిర్యాదు నమోదు చేసింది. మహారాష్ట్రలో జర్నలిస్టుపై పరువునష్టం కేసు కూడా నమోదైంది. సంబంధిత ప్రభుత్వాలు మాత్రం తమ చర్యలను మీడియా స్వేచ్ఛను అణచివేయడంగా చూడకూడదని వాదించాయి.

జమ్మూ–కాశ్మీర్‌లో భద్రతా, ఉగ్రవాద నిరోధక చట్టాల నేపథ్యంలో జర్నలిస్టులు దీర్ఘకాలిక న్యాయపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అంతర్జాతీయ మీడియా స్వేచ్ఛా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ ప్రకారం 2026 సూచీలో భారత్ 180 దేశాల్లో 157వ స్థానంలో ఉంది; 2025లో 151వ స్థానంలో ఉండగా, 2026లో స్థానం మరింత దిగజారింది.




### కేసు దాఖలు శిక్షగా మారకూడదు

పాత్రికేయుడు తప్పు చేస్తే చట్టం తన పని తాను చేయాలి. తప్పుడు వార్తలు, పరువు నష్టం, విద్వేష ప్రసంగం లేదా ఇతర నేరాలకు మీడియా వ్యక్తులు కూడా చట్టానికి అతీతులు కారు. అయితే ప్రశ్న అడిగినందుకు, అధికార నిర్ణయాన్ని విమర్శించినందుకు, ప్రజా ప్రయోజన అంశాన్ని వెలుగులోకి తెచ్చినందుకు క్రిమినల్ కేసులు పెట్టడం వృత్తి స్వేచ్ఛపై తీవ్ర ప్రభావం చూపుతుంది.ప్రత్యేకించి చిన్న పత్రికలు, ప్రాంతీయ మీడియా సంస్థలు, స్వతంత్ర డిజిటల్ జర్నలిస్టులకు న్యాయపోరాటం ఆర్థికంగా భారమవుతుంది. కేసు చివరకు నిలబడకపోయినా, అరెస్టు భయం, కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి, న్యాయవాదుల ఖర్చు, కుటుంబంపై ఒత్తిడి – ఇవన్నీ కలిపి ప్రక్రియే శిక్షగా మారే ప్రమాదం ఉంది. 423 కేసుల అధ్యయనం ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రతిబింబించింది.

అందువల్ల మీడియా స్వేచ్ఛ రక్షణకు పాత్రికేయులపై దాడులపై వేగవంతమైన దర్యాప్తు, కేసుల నమోదులో చట్టబద్ధమైన ప్రమాణాలు, అరెస్టుల విషయంలో న్యాయపరమైన జాగ్రత్త, చిన్న పట్టణ జర్నలిస్టుల కు న్యాయ సహాయం, ప్రభుత్వ సంస్థల పారదర్శకత అవసరం. మీడియా ప్రభుత్వానికి శత్రువు కాదు; ప్రజాస్వామ్యానికి కాపలాదారు. విమర్శను నేరంగా చూడకుండా, నేరాన్ని విమర్శ నుంచి వేరుచేసే వివేకమే ప్రజాస్వామ్య పరిపక్వతకు కొలమానం. అధికారాన్ని ప్రశ్నించే స్వరం భయంతో మౌనమైతే, నష్టపోయేది ఒక్క జర్నలిస్టు కాదు – ప్రజలకు అందే సమాచార హక్కు మొత్తం.

# భారతీయుల ప్రతిభ కావాలి... గ్రీన్‌కార్డుకు నిషేధమా?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం విదేశీ ఉద్యోగులపై తన అణచివేత చర్యలను మరింత తీవ్రతరం చేసింది. ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డుల కోసం యజమానులు విదేశీ నిపుణులకు స్పాన్సర్‌షిప్ అందించేందుకు ఉపయోగించే కీలకమైన పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ నుంచి పలు ప్రముఖ భారతీయ ఐటి సేవల సంస్థలతో పాటు అమెరికాకు చెందిన సాంకేతిక సంస్థలను కూడా సస్పెండ్ చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ పరిణామం అమెరికాలో పనిచేస్తున్న భారతీయ సాంకేతిక నిపుణుల భవిష్యత్తుపై ఆందోళనలను పెంచుతోంది. విదేశీ ఉద్యోగుల విషయంలో ట్రంప్ ప్రభుత్వం మరింత కఠినమైన వైఖరిని అవలంబిస్తోందనడానికి ఇది సంకేతంగా కనిపిస్తోంది. ఈ చర్యకు గురైన సంస్థల జాబితాలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సిఎల్, కాగ్నిజెంట్, క్యాప్‌జెమినీతో పాటు అమెరికాకు చెందిన మైక్రోసాఫ్ట్, అడోబ్ సంస్థ లు ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. కార్మిక చట్టాల ఉల్లంఘనలు, వేతనాల విషయంలో అక్రమాలు, తప్పుడు దరఖాస్తులు, అమెరికా ఉద్యోగులకు బదులుగా విదేశీయులను నియమించుకోవడం వంటి ఆరోపణలపై జరుగుతున్నదర్యాప్తుల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు అమెరికా అధికారులు వెల్లడించారు.

అమెరికా కార్మిక శాఖ అధికారులు, ముఖ్యంగా కార్మిక శాఖ కార్యదర్శి కీత్ సాండర్లింగ్, అమెరికా ఉద్యోగులకు ప్రాధాన్యత కల్పించాలనే ప్రభుత్వ విధానంలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు సమర్థిస్తున్నారు. ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కూడా ఉద్యోగ ఆధారిత వలస కార్యక్రమాల దుర్వినియోగంపై ప్రభుత్వ ఆందోళనలను వ్యక్తం చేశారు.

అయితే, సంస్థలపై వచ్చిన ఆరోపణలను నిరూపితమైన నేరాలుగా పరిగణించరాదు. దర్యాప్తు కొనసాగుతున్నంత మాత్రాన సంబంధిత సంస్థలన్నీ తప్పు చేసినట్లు నిర్ధారణ అయినట్లుకాదు. ఆరోపణలు, దర్యాప్తుల ఫలితాలు, చట్టపరమైన నిర్ణయాల మధ్య స్పష్టమైన తేడాను గుర్తించడం అవసరం.

### పెర్మ్ కార్యక్రమం అంటే ఏమిటి?

అమెరికాలో ఉద్యోగ ఆధారిత వలస విధానంలో పెర్మ్ కీలకమైన దశ. ఈ ప్రక్రియలో, ఒక విదేశీ ఉద్యోగిని శాశ్వత నివాస హోదా కోసం స్పాన్సర్ చేయాలనుకునే యజమాని సాధారణంగా ఆ ఉద్యోగానికి తగిన అర్హతలు, ఆసక్తి, సామర్థ్యం కలిగిన అమెరికా ఉద్యోగులు అందుబాటులో లేరని నిరూపించాలి. అంతేకాకుండా, విదేశీ ఉద్యోగిని నియమించడం వల్ల అదే తరహా పనులు చేసే అమెరికా ఉద్యోగుల వేతనాలు, పని పరిస్థితులపై ప్రతికూల ప్రభావం పడకూడదు. కార్మిక ధ్రువీకరణ పొందిన తరువాత, వర్తించే నిబంధనలకు లోబడి యజమాని ఉద్యోగ ఆధారిత వలస పిటిషన్‌ను దాఖలు చేసే తదుపరి ప్రక్రియను ప్రారంభించవచ్చు. తాత్కాలిక ఉద్యోగ వీసాలపై అమెరికాలో పని చేస్తూ, ఆ తరువాత గ్రీన్‌కార్డు పొందాలని ఆశించే అనేక మంది భారతీయ ఐటి నిపుణులకు ఈ విధానం ఎంతో కీలకం. అందువల్ల, పెర్మ్ కార్యక్రమం నుంచి ఒక సంస్థను సస్పెండ్ చేయడం వల్ల సంబంధిత కార్మిక ధ్రువీకరణ దరఖాస్తులను ప్రారంభించడం లేదా ముందుకు తీసుకెళ్లడం అంతరాయం కలిగే అవకాశం ఉంది. అయితే, వాస్తవ ప్రభావం ప్రభుత్వ ఉత్తర్వుల పరిధి, వ్యక్తిగత దరఖాస్తుల స్థితి, తదుపరి పరిపాలనా లేదా న్యాయపరమైన పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

### భారతీయ ఐటి సంస్థలపై ఎందుకు గురి?

విదేశీ ఉద్యోగుల నియామకంపై కొన్ని సంస్థలు అధికంగా ఆధారపడుతున్నాయని, దీనివల్ల అమెరికా ఉద్యోగులకు అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని ట్రంప్ ప్రభుత్వం వాదిస్తోంది. తక్కువ వేతనాలకు విదేశీ నిపుణులను నియమించుకోవడం, వలస దరఖాస్తుల్లో అక్రమాలకు పాల్పడటం, అమెరికా ఉద్యోగులను తొలగించినప్పటికీ విదేశీ ఉద్యోగుల శాశ్వత నివాసం కోసం దరఖాస్తులు కొనసాగించడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అమెరికా ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వడం, వలస విధానాల అమలును కఠినతరం చేయడం అనే విస్తృత విధానంలో భాగంగానే ఈ చర్యలను చూడవచ్చు.

అంతర్జాతీయ మార్కెట్లలో నైపుణ్యం కలిగిన ఉద్యోగులను నియమించుకుని, వివిధ దేశాల్లో సేవలు అందించే వ్యాపార




నమూనా భారతీయ ఐటి సంస్థలకు ఉంది. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, కన్సల్టింగ్, డిజిటల్ పరివర్తన, క్లౌడ్ కంప్యూటింగ్ తదితర రంగాల్లో ఈ సంస్థలు అమెరికా వ్యాపారాలకు సేవలు అందిస్తున్నాయి. అమెరికాలోని నైపుణ్యాధారిత ఉద్యోగ వీసాలు, ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డుల ద్వారా ప్రయోజనం పొందుతున్నవారిలో భారతీయులు గణనీయమైన వాటాను కలిగి ఉన్నారు.

అయితే, చట్టబద్ధమైన అంతర్జాతీయ నియామకాలకు, చట్టవిరుద్ధమైన కార్మిక విధానాలకు మధ్య తేడాను గుర్తించడం అత్యంత అవసరం. అమెరికా సాంకేతిక రంగ అభివృద్ధిలో విదేశీ నిపుణుల పాత్ర గణనీయమైనది. అందువల్ల, జాతీయత లేదా ఔట్‌సోర్సింగ్ రంగంపై సాధారణీకరణలు చేయకుండా, ప్రతి ఆరోపణను ఆధారాలు, న్యాయపరమైన ప్రమాణాల ప్రకారం పరిశీలించాలి.

ఈ సస్పెన్షన్ వల్ల తమ యజమానులు గ్రీన్‌కార్డు దరఖాస్తులు ప్రారంభించడానికి లేదా ముందుకు తీసుకెళ్లడానికి ఎదురుచూస్తున్న భారతీయ ఉద్యోగుల్లో అనిశ్చితి నెలకొనే అవకాశం ఉంది. దరఖాస్తుల్లో జాప్యం వల్ల దీర్ఘకాలిక ఉద్యోగ ప్రణాళికలు, కుటుంబ స్థిరత్వం, అమెరికాలోనే కొనసాగాలా లేదా ఇతర దేశాలకు వెళ్లాలా అనే నిర్ణయాలు ప్రభావితమవుతాయి. సాంకేతిక సంస్థలకూ నియామకాలు, ఉద్యోగుల నిలుపుదల, సిబ్బంది ప్రణాళికల విషయంలో సమస్యలు ఎదురు కావచ్చు. దర్యాప్తులకు సహకరిస్తూనే వలస విధానాలకు సంబంధించిన పత్రా లు, వేతన విధానాలు, ఉద్యోగుల నియామక ప్రక్రియలు, చట్టపరమైన అనుసరణలను పునఃసమీక్షించాల్సి రావచ్చు. అయితే, ప్రభావితమైన దరఖాస్తుల సంఖ్య, సస్పెన్షన్ కాలపరిమితి, చట్టపరమైన పరిధి, దర్యాప్తుల ఫలితాలపై స్పష్టమైన సమాచారం లభించే వరకు నష్ట తీవ్రతను కచ్చితం గా అంచనా వేయడం సాధ్యం కాదు.

### వాషింగ్టన్, న్యూఢిల్లీ ముందున్న విధానపరమైన సవాలు

ఈ పరిణామం వలస విధానాల అమలు, అంతర్జాతీయంగా నైపుణ్యవంతులైన ఉద్యోగుల అవసరాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతను స్పష్టం చేస్తోంది. దేశీయ ఉపాధిని పరిరక్షించడం, న్యాయమైన వేతనాలను నిర్ధారించడం, అక్రమాలను అరికట్టడం అమెరికాకు న్యాయబద్ధమైన లక్ష్యాలే. అదే సమయంలో, పోటీతత్వం కలిగిన సాంకేతిక ఆర్థిక వ్యవస్థకు ప్రత్యేక నైపుణ్యాలు, అంతర్జాతీయ సహకారం, స్థిరమైన వలస విధానాలు కూడా అవసరం.

భారతదేశానికి ఈ అంశం మరింత ప్రాధాన్యమైనది. అమెరికా భారతీయ ఐటి, వృత్తిపరమైన సేవలకు అతిపెద్ద అంతర్జాతీయ మార్కెట్లలో ఒకటి. కాబట్టి, భారత ప్రభుత్వం, ఐటి రంగ సంస్థలు పరిణామాలను నిశితంగా గమనిస్తూ, ప్రభావిత ఉద్యోగుల పరిస్థితిపై స్పష్టత కోరాలి. చట్టబద్ధంగా పనిచేస్తున్న భారతీయ నిపుణులు అన్యాయంగా నష్టపోకుండా చూడాల్సిన అవసరం ఉంది. ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య ఉద్యోగ ఆధారిత వలస విధానాలపై మరింత కఠినమైన పర్యవేక్షణ ఉంటుందనే సందేశాన్ని పంపుతోంది. అయితే, ఇటువంటి విధానం విజయవంతమైందో లేదో నిర్ణయించాల్సింది ఎన్ని సంస్థలను సస్పెండ్ చేశారనే అంశం ఆధారంగా కాదు. నిజమైన అక్రమాలను అరికట్టగలిగిందా, ఉద్యోగుల హక్కులను పరిరక్షించగలిగిందా, న్యాయబద్ధమైన విచారణకు అవకాశం కల్పించగలిగిందా అనే అంశాలే కీలకం.

అమెరికాలో పనిచేస్తున్న వేలాదిమంది భారతీయ సాంకేతిక నిపుణుల ముందున్న ప్రధాన ప్రశ్న ఇకపై ఉద్యోగం దొరుకుతుందా లేదా అన్నదే కాదు; ఉద్యోగం నుంచి శాశ్వత నివాస హోదా వరకు సాగాల్సిన ప్రక్రియ ఎంతవరకు విశ్వసనీయంగా, అంచనా వేయగలిగే విధంగా ఉంటుందన్నదే.

దేశీయ ఉద్యోగులకు ప్రాధాన్యత కల్పించాలన్న లక్ష్యాన్ని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభ, నైపుణ్యాలపై ఆధారపడే సాంకేతికరంగ వాస్తవాలను అమెరికా ప్రభుత్వం ఎలా సమతుల్యం చేస్తుందో ఈ పరిణామాలు పరీక్షించనున్నాయి. అంతిమంగా, ఉపాధి పరిరక్షణ పేరుతో తీసుకునే చర్యలు న్యాయబద్ధతను, పారదర్శకతను, చట్టబద్ధంగా పనిచేస్తున్న విదేశీ నిపుణుల హక్కులను విస్మరించకూడదు.

డా. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912



# అసెంబ్లీలో బతుకమ్మ సంబరాలు

● ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు చేరి, చప్పట్లు కొడుతూ సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సాగిన ఈ వేడుకలతో అసెంబ్లీ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ వేడుకల్లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. బంతి, చామంతి, గునుగు, తంగేడు తదితర పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ మహిళా ఉద్యోగులు, సిబ్బంది పాటలు పాడారు. ఆడపడుచుల ఆనందోత్సాహాల మధ్య వేడుకలు సందడిగా సాగాయి. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతిని ఆరాధించే గొప్ప సంస్కృతికి ప్రతీక అని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి ఆర్.తిరుపతి, శాసనసభ, శాసన మండలి ఉన్నతాధికారులు, మహిళా ఉద్యోగులు, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బకాయిలు విడుదల చేయాలని నేడు ఎఐటియుసి ఆందోళన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో మంగళవారం భారీ ధర్నా నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని సోమాజిగూడ విద్యుత్ సౌధ వద్ద జరిగే ఈ ఆందోళనలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. ఈ నిరసన కార్యక్రమంలోకార్మికుల పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య విజ్ఞప్తి చేశారు.

# ఆర్‌టిసి బస్సుల్లో దసరా రద్దీ

● తొలి మూడు రోజుల్లో 1.40 కోట్ల మంది ప్రయాణం
● ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు: ఎండి నాగిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దసరా పండుగ నేపథ్యంలో టిజిఎస్‌ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణికుల రద్దీ కొనసాగుతోంది. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అదనపు బస్సులను నడుపుతూ మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. పండుగ రద్దీ, ప్రత్యేక బస్సుల నిర్వహణపై సోమవారం అధికారులతో నిర్వహించిన జూమ్ సమీక్షలో ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి పలు సూచనలు చేశారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని, రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో గత ఏడాదితో పోలిస్తే అదనంగా 495 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు సంస్థ తెలిపింది. 2025 దసరా తొలి మూడు రోజుల్లో 922 అదనపు బస్సులను నడపగా, ఈ ఏడాది ఆ సంఖ్యను 1,417కు పెంచినట్లు పేర్కొంది. ఇదిలా ఉండగా, దసరా సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళలకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుస్తోంది. గతేడాది రోజుకు సగటున రూ.13.02 కోట్లు ఆదా చేసిన మహిళలు, ఈ ఏడాది రోజుకు రూ.13.73 కోట్ల మేర ఆదా



చేసుకోగలిగినట్లు ఆర్‌టిసి వెల్లడించింది. పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 15, 16, 17 తేదీల్లోనూ అవసరానికి అనుగుణంగా అదనపు బస్సులు నడపాలని ఎండి ఆదేశించారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సాధారణ, ప్రత్యేక బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ల కోసం www.tgsrtcbus.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఇతర ప్రయాణ వివరాల కోసం 04069440000, 04023450033 నంబర్లకు కాల్ చేయవచ్చని ఆర్‌టిసి తెలిపింది.

# నేరాలకు అనుగుణంగా దర్యాప్తు మారాలి

● సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల కట్టడికి ప్రత్యేక దృష్టి పెట్టాలి.. డిజిపి సి.వి.ఆనంద్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేరాల స్వరూపం మారుతున్నకొద్దీ పోలీసుల పనితీరు, దర్యాప్తు విధానాలు కూడా మారాలని తెలంగాణ డిజిపి సి.వి.ఆనంద్ అన్నారు. గతంలో నక్సలిజం, దోపిడీలు, మత సామరస్య సమస్యలు పోలీసులకు ప్రధాన సవాళ్లుగా ఉండేవని, ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలతో పాటు ట్రాఫిక్ రద్దీ, రోడ్డు భద్రత, ఆహార కల్తీ వంటి సమస్యలు సవాలుగా మారాయని పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తెలంగాణ పోలీస్ శాఖలో సంస్థాగత మార్పులు చేపడుతూ, ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది ప్రొబేషనరీ డిఎస్‌పిల పాసింగ్ అవుట్ పరేడ్‌లో సోమవారం పాల్గొన్న డిజిపి నూతన అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ యూనిఫామ్ ధరించే అవకాశం అందరికీ దక్కదని, దాని గౌరవం, మర్యాద, ప్రతిష్ఠను కాపాడటం ప్రతి అధికారి బాధ్యతని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలకు స్పందిస్తూ, బాధితులకు అండగా నిలుస్తూ, చట్టబద్ధంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

**తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలి డిఎస్‌పి బ్యాచ్..**

రాష్ట్రం ఏర్పడిన తర్వాత టిజిపిఎస్‌సి ద్వారా ఎంపికైన తొలి డిఎస్‌పి బ్యాచ్ ఇదేనని సి.వి. ఆనంద్ తెలిపారు. మొత్తం 112 మంది అధికారులకు పోలీస్ అకాడమీలో 44 వారాలపాటు చట్టాలు, దర్యాప్తు విధానాలు, వృత్తి నైపుణ్యాలు, క్షేత్రస్థాయి విధులు, డ్రిల్, పరేడ్, క్రీడల్లో శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. అవుట్‌డోర్ విభాగంలో ఎల్.శ్రీకాంత్ బెస్ట్ ప్రొబేషనర్‌గా, ఇండోర్ విభాగంలో నేహా అగర్వాల్ బెస్ట్ ప్రొబేషనర్‌గా ఎంపికయ్యారని తెలిపారు. బెస్ట్ ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్ సాధించిన నేహా అగర్వాల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అకాడమీలో శిక్షణ పూర్తయినప్పటికీ అధికారుల అభ్యాసం కొనసాగాలని, మరో 46 వారాలపాటు జిల్లా స్థాయిలో ప్రాక్టికల్ శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ సమయంలో అలవర్చుకున్న క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావాన్ని క్షేత్రస్థాయిలోనూ కొనసాగించాలని సూచించారు. రాజ్యాంగానికి విధేయులుగా ఉంటూ, నిర్భయంగా, రాగద్వేషాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు సేవ చేసేందుకు సుమారు 90 వేల మంది పోలీసులు ఉన్నారని, ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని డిజిపి పేర్కొన్నారు. డీఎస్పీ స్థాయి అధికారులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, సిబ్బందిని ముందుండి నడిపిస్తూ కష్టసమయాల్లో వారికి అండగా నిలవాలని సూచించారు. పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా ధరించిన బెల్టును 30 ఏళ్ల తర్వాత కూడా అదే రంధ్రాల్లో బిగించగలిగేలా శారీరక దృఢత్వాన్ని కొనసాగించాలని అన్నారు. అనివార్య కారణాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యక్రమానికి హాజరుకాలేకపోయారని, భవిష్యత్తులో ప్రొబేషనరీ డిఎస్‌పిలను ఉద్దేశించి మాట్లాడతారని డిజిపి తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిస్త్‌తో పాటు సీనియర్ ఐపిఎస్ అధికారులు మహేష్‌భగవత్, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్‌లు పాల్గొన్నారు.

# ఉక్రేన్ యుద్ధంలో హస్నాబాద్‌వాసి సుదర్శన్ గౌడ్ మృతి

● బాధిత కుటుంబానికి రూ.6 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రష్యా–ఉక్రేన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించారు. బాధిత కుటుంబానికి రూ.6 లక్షల ఆర్థిక సహాయాన్ని సిఎం ప్రకటించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్) నుంచి ఈ ఆర్థిక సహాయం అందించేందుకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సుదర్శన్ గౌడ్ భౌతికకాయాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సిఎం ఆదేశించారు. ఉపాధి కోసం నాలుగు నెలల కింద ఉక్రేన్ వెళ్లిన సుదర్శన్ గౌడ్ క్షిపణులు, డ్రోన్ దాడుల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని సిఎం భరోసా ఇచ్చారు. సుదర్శన్ గౌడ్ భార్య విజ్ఞప్తి మేరకు ఈ ఘటనను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన సిఎం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

## విద్యార్థినులపై దాడులు అమానుషం

● భారత జాతీయ మహిళా సమాఖ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఢిల్లీలో సిఇసి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోరుతూ ఆందోళన చేస్తున్న విద్యార్థినులు, యువతులపై పోలీసులు, ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు వ్యవహరించిన తీరును భారత జాతీయ మహిళా సమాఖ్య తీవ్రంగా ఖండించింది. మహిళలను అసభ్యకరంగా అవమానిస్తూ, లాఠీలతో దాడులు చేసి ఈడ్చుకెళ్లడం అమానుషమని నాయకులు పి.ప్రేమపావని, ఎస్.ఛాయాదేవి, పడాల నళిని, నండూరి కరుణకుమారి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో' అంటూ నినదించే బిజెపి నాయకులు మహిళలపై జరుగుతున్న ఈ దాడులపై స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. దేశంలో 13.5 కోట్ల మంది ప్రజల ఓటు హక్కును నిరాకరించడం మనిషి శరీరం నుంచి ఆత్మను వేరు చేయడంతో సమానమని విశ్రాంత సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్ పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఓటు హక్కును కాలరాసే అధికారం ఎన్నికల సంఘానికి లేదని, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని కోరారు. శాంతియుత నిరసనకారులపై దాడులకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు. లేకపోతే మహిళా లోకం ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెబుతుందని స్పష్టం చేశారు.

## కెసిఆర్ బాటలోనే మోదీ సర్కార్

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి, ప్రతి రాజకీయ పార్టీకి రాజ్యాంగం కల్పించిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ అని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మోదీ ప్రభుత్వాల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు, రాజకీయ పార్టీలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ ఒక వేదికగా ఉండేదన్నారు. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన కెసిఆర్ ప్రభుత్వం ప్రజల నిరసన హక్కును కాలరాస్తూ ఇందిరాపార్క్ వద్ద ధర్నా చౌక్‌ను ఎత్తివేసిందని విమర్శించారు. నిరసన తెలిపే అవకాశం లేకుండా చేసిన కెసిఆర్ ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. తెలంగాణలో కెసిఆర్ అనుసరించిన అదే విధానాన్ని ఇప్పుడు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తోందని విమర్శించారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రజలు, రాజకీయ పార్టీలు తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేసేందుకు ఉపయోగించుకున్న జంతర్ మంతర్ వంటి నిరసన వేదికలపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కెసిఆర్ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నిరసన వేదికను తొలగిస్తే, మోదీ ప్రభుత్వం దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలకు ఆంక్షలు విధిస్తోందని, ఇద్దరి ఆలోచనా విధానం ఒక్కటేనన్నారు. 'ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌ను ఎత్తేసిన కెసిఆర్‌కు పట్టిన పరిస్థితే జంతర్ మంతర్‌పై ఆంక్షలు విధించిన మోదీకి పడుతుందన్నారు. ప్రజల గొంతును అణచివేసే ప్రతి పాలకుడికి చివరకు ప్రజల తీర్పే సమాధానమన్నారు.

# మంత్రి పొన్నం సవాల్‌కు సిద్ధం

● బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మంత్రి పొన్నం ప్రభాకర్ విసిరిన ఓట్ల తొలగింపు సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తెలిపారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓట్లు తొలగించబడ్డాయని చెబుతున్న కనీసం 10 మంది బాధితులను ఎన్నికల సంఘం కార్యాలయానికి తీసుకురావాలని, మజ్లిస్ నేతలు అసదుద్దీన్, అక్బరుద్దీన్ ఒవైసీలను ఎవరినైనా తీసుకురావచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాంచందర్ రావు ప్రతి సవాల్ చేశారు. పొన్నం సమయం చెబితే తాను అక్కడికి వస్తానని, ఒకవేళ ఓటు డిలీట్ అయితే వెంటనే యాడ్ చేసే ప్రక్రియను ప్రారంభిద్దామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కేబినెట్‌ను రద్దు చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక విమానాల్లో ఢిల్లీకి పారిపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కరవుతో రైతులు అల్లాడుతుంటే పట్టించుకోకుండా గోవాలో నిలబడి రేవంత్ రెడ్డి నీతులు చెబుతున్నారని విమర్శించారు. గోవా కాంగ్రెస్ యాత్రలో బిజెపిని 'రావణుడు', తమను 'రాముడు' అని పోల్చుకోవడం హాస్యాస్పదమన్నారు. 'ముస్లిం ఈజ్ కాంగ్రెస్ కాంగ్రెస్ ఈజ్ ముస్లిం' అన్న రేవంత్ రెడ్డికి రాముడి పేరు ఎత్తే నైతిక హక్కు లేదన్నారు. రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు టి.వీరేందర్ గౌడ్, ఎన్.గౌతంరావు, ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి.సుభాష్, నాయకులు అభిషేక్ జిగిని, సురేష్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

# ఇసి మీ జేబు సంస్థలా భావించొద్దు

● రాంచందర్‌రావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటర్ల జాబితాలో అక్రమాలపై ప్రశ్నిస్తే మతపరమైన అంశాలను తెరపైకి తెచ్చి అసలు సమస్యను పక్కదారి పట్టించడం మానుకోవాలని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాంచందర్‌రావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. ఎన్నికల సంఘం అధికారాలను తమ జేబు సంస్థలా భావించి మాట్లాడటం తగదని మండిపడ్డారు. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటమే ముఖ్యమని, ఒక్క ఓటరు కూడా తన హక్కును కోల్పోకూడదని స్పష్టం చేశారు. తమ వద్ద ఉన్న ఆధారాలను చూపిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడతామని ప్రకటించారు. ఓటర్ల జాబితా తయారీ, సవరణలు, ఓట్ల తొలగింపు పూర్తిగా భారత ఎన్నికల సంఘం పరిధిలోని రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని పొన్నం పేర్కొన్నారు. ఎన్నికల సంఘం అధికారులుగా వ్యవహరించాలని భావిస్తున్నారా అని నిలదీశారు. ఎసి గదుల్లో కూర్చొని సవాళ్లు విసరడం కాదని, ఏయే బూత్‌లు, వార్డుల్లో ఓట్లు తొలగించారో క్షేత్రస్థాయిలో విచారణకు సిద్ధమా అని రాంచందర్‌రావుకు సవాల్ విసిరారు.

**ఫామ్–7 దరఖాస్తులపై స్పష్టత ఇవ్వాలి..**

ఓటర్ల జాబితా సవరణల్లో ఫామ్6, ఫామ్7 దరఖాస్తుల వినియోగంపై వచ్చిన ఆరోపణలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించాలని మంత్రి కోరారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో బిజెపి కార్యకర్తలు ఫామ్ 7 ద్వారా ఓట్ల తొలగింపునకు ఫిర్యాదులు చేశారా లేదా అన్నదానిపై రాంచందర్‌రావు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఓటు హక్కుకు మతం రంగు పులమొద్దు..**

ఓటు హక్కు గురించి ప్రశ్నిస్తే ఎంఐఎం, ఓవైసి పేర్లను ప్రస్తావిస్తూ సమస్యను మతపరమైన కోణంలోకి మళ్లించడం బిజెపి రాజకీయ వ్యూహమని పొన్నం విమర్శించారు. ఓటు హక్కు ఏ ఒక్క మతానికో, రాజకీయ పార్టీకో పరిమితం కాదని, అది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కని పేర్కొన్నారు. కేంద్రంలో పదేళ్లకు పైగా అధికారంలో ఉన్న బిజెపి తెలంగాణకు, రాష్ట్ర రైతాంగానికి ఏం సాధించిందో ప్రజలకు వివరించాలని పొన్నం డిమాండ్ చేశారు.

# జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేయాలి

● ఒయులో వామపక్ష, దళిత–బహుజన విద్యార్థి సంఘాల భారీ ర్యాలీ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటర్ల తొలగింపుపై ఓయూలో వామపక్ష, దళిత–బహుజన విద్యార్థి సంఘాలు గర్జించాయి.. 'సర్' ప్రక్రియ నిలిపివేయడంతో పాటు జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వామపక్ష, దళిత–బహుజన విద్యార్థి సంఘాల నాయకులు, ప్రొఫెసర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. సోమవారం లా కాలేజీ ఎదుట ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి ప్రారంభించిన ర్యాలీ ఆర్ట్స్ కాలేజీ వరకు సాగింది. విద్యార్థి సంఘాల నాయకులు, ప్రొఫెసర్లు పాల్గొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాలు నాయకులు, ప్రొఫెసర్లు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బిజెపి ఏజెంట్‌గా వ్యవహరిస్తూ ఏకపక్ష నిర్ణయాలతో 'సర్' ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని ఆరోపించారు. దళితులు, మైనార్టీలు, ఆదివాసీలు, ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఓటు హక్కు ను హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఓటరు నమోదు ఫారం6లో డిక్లరేషన్‌కు సంబంధించి సుప్రీంకోర్టు మద్దతు తెలిపిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. జంతర్ మంత ర్ వద్ద నిరసన సందర్భంగా విద్యార్థుల అక్రమ అరెస్టులు, పోలీసుల దాడులను తీవ్రంగా ఖండించారు. జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేసి 'సర్' ప్రక్రియను నిలిపివేసే వరకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లెనిన్, జార్జిరెడ్డి, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు, ఎస్‌ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి అజయ్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి అనిల్, ఎఐడిఎస్ఓ నితీష్, విశ్వ విద్యార్థి సంఘం మహిపాల్, సత్య, గ్యార నరేష్, కిరణ్ ,పెంచాల సతీష్, స్వాతి, నవ్య, పవన్, బట్టు వెంకటేశ్వర్లు, సునీల్, శ్రీకాంత్ ప్రొఫెసర్లు సమన్వత, గుమ్మడి అనురాధ, కొండ నాగేశ్వరరావు, వెంకటదాస్ ఆమంచి నాగేశ్వరరావు, మహేష్, నవీన్, జంగిలి దర్శన్, వెంకట్, శరత్ నాయక్, కాసర్ల మధుసూదన్, రాజేష్ నాయక్, అశ్వన్, అనిల్, భాను తదితరులు పాల్గొన్నారు.

# నిధులు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

● బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నేత హరీశ్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతులను భయపెట్టడం మానేసి, వారికి భరోసా ఇవ్వాలని, రైతు బంధు, రైతు బీమా సహా అన్ని పథకాలకు చెందిన నిధులను తక్షణమే విడుదల చేసి, రైతులను ఆదుకోవాలని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నేత తన్నీరు హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలు వేయొద్దనే ఉచిత సలహాలు ఇవ్వడం మానేసి, కరెంట్ కోతలు, నీటి కొరత పై సమగ్ర కార్యచరణను ప్రకటించాలన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, సంజయ్‌తో కలిసి హరీశ్‌రావు మాట్లాడుతూ బొగ్గు కొరత, విద్యుత్ కోతలకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. విద్యుత్ విషయంలో ఇతర రాష్ట్రాలు ముందుగానే అప్రమత్తమై విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నాయని, రాష్ట్ర ప్రభు త్వం మాత్రం యూనిట్‌కు రూ.10, నుంచి రూ.15 పెట్టినా విద్యుత్ దొరకడం లేదని చెబుతోందని, ముందుగానే ఎందుకు ఒప్పందాలు చేసుకోలేదని మండిపడ్డారు. యాసంగిలో పంటలు వేయొద్దంటే రైతులు, రైతు కూలీలు ఎలా బతకాలని ప్రశ్నించారు. కేబినెట్ సమావేశాన్ని నిర్వహించి స్పష్టమైన నిర్ణయం తీసుకోలేరా?, రైతుల సమస్యల కంటే పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని సిఎం ఢిల్లీకి వెళ్తారా?, ఆయన ఢిల్లీ నుంచి రైతులతో వీడియోకాన్ఫరెన్స్‌లో కూడా పాల్గొనలేరా? అని హరీశ్‌రావు దుయ్యబట్టారు. రైతుల సమస్యలను పక్కనపెట్టి ఢిల్లీ రాజకీయాలకే ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ఎల్‌నినో నేపథ్యంలో మంత్రులు తుమ్మల, పొంగులేటి రైతులకు ఉచిత సలహాలు ఇవ్వడం కాదని, ప్రభుత్వం ఏం చేయబోతుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది సింగూరు ప్రాజెక్టులో 29 టిఎంసిల నీరు ఉండేదని, ఈ ప్రాజెక్టును ఏడాదిలో బాగు చేస్తామని చెప్పి, ఉన్న నీటిని వదిలేశారని , కానీ ఒక్క పని కూడా పూర్తి చేయలేదన్నారు. మద్యం కంపెనీలకు నీళ్లు అందుబాటులో ఉంటాయి. కానీ తాగు, సాగునీటి కోసం మాత్రం ప్రజలు ఇబ్బందులు పడాలా? అని అన్నారు.

**డాక్యుమెంటు పోయినది**

హనుమకొండ జిల్లా పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన ప్రస్తుతం వరంగల్ జిల్లా ఏనుమాముల మార్కెట్ రోడ్‌లో నివాసం ఉంటున్న **అల్లె కొమురయ్య**కు చెందిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం. **6991/2010** (SRO,Warangal Rural) గలది ఇల్లు షిఫ్టింగ్ చేస్తున్న సమయంలో పోయినది. ఎవరికైననూ దొరికినచో క్రింది నెంబర్‌కు తెలియజేయాలని కోరుతున్నాము.

ఇట్లు
**అల్లె కొమురయ్య**
**తండ్రి : పోశాలు**
గ్రామం : నాగారం
మండలం : పరకాల
జిల్లా : హనుమకొండ
**సెల్ నెం. 9701543946**

**డాక్యుమెంటు పోయినది**

వరంగల్ జిల్లా మరియు నగరంలోని ఏనుమాముల మార్కెట్ రోడ్‌లో నివాసం ఉంటున్న **దయ్యాల జ్యోతి**కి చెందిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం. **157/2011** (SRO,Warangal Fort) గలది ఇల్లు షిఫ్టింగ్ చేస్తుండగా పోయినది. ఎవరికైననూ దొరికినచో క్రింది నెంబర్‌కు తెలియజేయాలని కోరుతున్నాము.

ఇట్లు
**దయ్యాల జ్యోతి**
**భర్త : రాజేందర్**
ఇం. నెం. 46-5-856
ఏనుమాముల మార్కెట్ రోడ్
సిటి & జిల్లా : వరంగల్
**సెల్ నెం. 9701543946**

**డాక్యుమెంటు పోయినది**

వరంగల్ జిల్లా మరియు నగరంలోని ఏనుమాముల మార్కెట్ రోడ్‌లో నివాసం ఉంటున్న **దయ్యాల జ్యోతి**కి చెందిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం. **158/2011** (SRO, Warangal Fort) గలది ఇల్లు షిఫ్టింగ్ చేస్తుండగా పోయినది. ఎవరికైననూ దొరికినచో క్రింది నెంబర్‌కు తెలియజేయాలని కోరుతున్నాము.

ఇట్లు
**దయ్యాల జ్యోతి**
**భర్త : రాజేందర్**
ఇం. నెం. 46-5-856
ఏనుమాముల మార్కెట్ రోడ్
సిటి & జిల్లా : వరంగల్
**సెల్ నెం. 9701543946**

తెలంగాణా ప్రభుత్వం
**పంచాయత్ రాజ్ ఇంజనీరింగ్ శాఖ**
జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీరు వారి కార్యాలయము, ఖమ్మం

పత్రికా ప్రకటన — తేది: 12-10-2026

ఇందుమూలముగా ఎర్రుపాలెం మండలం కొత్తపాలెం, గట్లగౌరారం గ్రామ పంచాయతీ ప్రజలకు మరియు సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా కొత్తపాలెం నుండి గట్లగౌరారం వరకు రహదారిలో 6.20 హెక్టార్ల విస్తీర్ణము ఫారెస్ట్ బౌండరిలో ఉన్నది. ఇట్టి సరిహద్దు ఫారెస్ట్ బౌండరిలో రహదారి నిర్మాణము కొరకు పర్యావరణం అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వము వారు ఉత్తర్వుల సంఖ్య FP/TG/ROAD/543752/2025, dt.01/06/2026 ద్వారా రహదారి నిర్మాణమునకు కొరకు అనుమతి మంజూరి చేసినారు. కావున సమస్త మండల మరియు ఖమ్మం జిల్లా ప్రజలకు తెలియచేయనైనది.

సం/- జిల్లా పంచాయత్ రాజ్ ఇంజనీరు
పిఐయు డివిజన్, ఖమ్మం

DIPR R.O. No. : 11783-PP/CL/ADVT/2026-27, Date: 12-10-2026

**పురపాలక పరిపాలన శాఖ**

Roc.No. E1/02/MCBHPL/2026, కొటేషన్ ప్రకటన — తేది: 12.10.2026

కింద పేర్కొన్న స్పెసిఫికేషన్ ప్రకారం ఉన్న అంశాలకు సంబంధించిన కొటేషన్లను, 15.10.2026 తేదీన మధ్యాహ్నం 3.00 గంటలలోపు కింద సంతకం చేసిన వారికి చేరేలా వారు ఆహ్వానిస్తున్నారు. మరియు సదరు కొటేషన్ అదే రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు ఏజెన్సీలు లేదా అధీకృత సరఫరాదారుల సమక్షంలో తెరవబడుతుంది.

| క్ర.సం. | స్పెసిఫికేషన్ ఐటెమ్ | Qty | Unit |
|---|---|---|---|
| 1 | కుర్చీలు, ఆడియో సిస్టమ్, థర్మల్ షీటింగ్, జనరేటర్, ఏసిపి ప్యానెల్ వర్క్‌తో ఎలివేషన్, పచ్చదనం, ఓపెన్ జిమ్, ఆడిటోరియంలో ఫౌంటెన్. | 1 | Each |
| 2 | కళాత్మక పెయింటింగ్ | 1 | Each |
| 3 | కూడళ్ల అభివృద్ధి కోసం కంచు విగ్రహం, ఫౌంటెన్‌లు, పచ్చదనం మొదలైనవి | 1 | Each |
| 4 | పివిసి ఫిట్టింగ్స్ మొదలైన నీటి సరఫరా నిర్వహణ సామాగ్రి | 1 | Each |

ఎటువంటి కారణం లేకుండా కొటేషన్ ప్రకటనను రద్దు చేసే హక్కు కమిషనర్‌కు ఉంది.

సం/- మున్సిపల్ కమిషనర్,
భూపాలపల్లి.

DIPR R.O. No. : 11723-PP/CL/ADVT/2026-27, Date: 12-10-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్, బోయిన్‌పల్లి సర్కిల్-03**

NIT No. 31/DB/EE-II/Bowenpally Circle/MMC/2026-27 — Date: 12.10.2026

| క్ర.సం. | NIT No. | వివరణ | Unit | Qty |
|---|---|---|---|---|
| 1 | NIT No. 31/DB/EE-II/Bowen-pally Circle/MMC/2026-27, Date: 12.10.2026 | తాజా ఇంటెల్ కోర్ 5, కనీసం 8 GB DDR5 RAM, 512 GB PCIe NVMe M.2 SSD, ఇన్‌స్టాల్ చేయబడిన మైక్రోసాఫ్ట్ ఆఫీస్ 24తో కూడిన విండోస్ 11, కనీసం 300 నిట్స్ IPS యాంటీ-గ్లేర్ గల 23.8'' డయాగనల్ FHD డిస్‌ప్లే, కీబోర్డ్ మరియు మౌస్‌తో కూడిన ఆల్-ఇన్-వన్ డెస్క్‌టాప్ సరఫరా, డెలివరీ మరియు ఇన్‌స్టాలేషన్. HP, Dell, Lenovo లేదా Asus బ్రాండ్‌కు చెందినది. లేబర్ మరియు రవాణా ఛార్జీలు మొదలైనవాటితో సహా 1 సంవత్సరం ఆన్‌సైట్ వారంటీతో పూర్తి సేవ. | Each | 1 |
| 2 | | తాజా ఇంటెల్ కోర్ 7, కనీసం 16 GB DDR5 RAM, 1TB PCIe NVMe M.2 SSD, ఇన్‌స్టాల్ చేయబడిన మైక్రోసాఫ్ట్ ఆఫీస్ 24తో కూడిన విండోస్ 11, కనీసం 300 నిట్స్ IPS యాంటీ-గ్లేర్ గల 27'' లేదా అంతకంటే ఎక్కువ డయాగనల్ FHD డిస్‌ప్లే, కీబోర్డ్ మరియు మౌస్‌తో కూడిన ఆల్-ఇన్-వన్ డెస్క్‌టాప్ సరఫరా, డెలివరీ మరియు ఇన్‌స్టాలేషన్. HP, Dell, Lenovo లేదా Asus బ్రాండ్‌కు చెందినది. లేబర్ మరియు రవాణా ఛార్జీలు మొదలైనవాటితో సహా 1 సంవత్సరం ఆన్‌సైట్ వారంటీతో పూర్తి సేవ. | Each | 1 |
| 3 | | బ్రదర్ HL-L2440DW ఆటో డ్యూప్లెక్స్ లేజర్ ప్రింటర్ (30 PPM ప్రింట్ స్పీడ్, LCD డిస్‌ప్లే, 64 MB మెమరీ, (వైఫై వైర్‌లెస్ LAN USB), 250 షీట్ పేపర్ ట్రే, 3000 పేజీల ఇన్‌బాక్స్ టోనర్‌తో సహా) యొక్క సరఫరా, డెలివరీ మరియు ఇన్‌స్టాలేషన్, 1 సంవత్సరం ఆన్‌సైట్ వారంటీతో పాటు లేబర్ మరియు రవాణా ఛార్జీలు మొదలైనవి కలిపి పూర్తిగా అందించబడతాయి. | Each | 1 |
| 4 | | HP స్కాన్ జెట్ ప్రో 2000 s2 షీట్-ఫీడ్ స్కానర్ యొక్క సరఫరా, డెలివరీ మరియు ఇన్‌స్టాలేషన్ (1 సంవత్సరం ఆన్‌సైట్ వారంటీతో పాటు లేబర్ మరియు రవాణా ఛార్జీలు మొదలైనవి కలిపి పూర్తిగా అందించబడతాయి). | Each | 1 |
| 5 | | EN 124 ప్రమాణాల ప్రకారం ఫ్రేమ్‌తో కూడిన 0.6మీ X 0.6మీ సైజు DI కవర్ యొక్క సరఫరా మరియు డెలివరీ, అన్ని మెటీరియల్స్ లోడింగ్, రవాణా, అన్‌లోడింగ్ మరియు లేబర్ ఛార్జీలు మొదలైన వాటి ఖర్చుతో సహా పూర్తిగా అందించబడతాయి. దీని బరువు 70 కిలోల కంటే తక్కువ ఉండకూడదు. | Each | 1 |

గమనిక:
(i) సీల్ చేసిన కొటేషన్లను సంస్థ / ఏజెన్సీ లెటర్ హెడ్ 19/10/2026 తేదీన లేదా అంతకు ముందుగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ - II, బోయిన్‌పల్లి సర్కిల్-03, MMC కార్యాలయానికి సమర్పించాలి.
(ii) కొటేషన్ రేటుపై GST 18% అదనంగా ఉంటుంది.
(iii) లెటర్ ప్యాడ్ GST నంబర్‌ను తప్పనిసరిగా పేర్కొనాలి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ - II, బోయిన్‌పల్లి సర్కిల్-03,
ఎంఎంసి.

DIPR R.O. No. : 11762-PP/CL/ADVT/2026-27, Date: 12-10-2026



## పరిశ్రమల స్థాపనలో స్థానికంగా ఉపాధి

తాస్కానిగూడెంలో కాటన్ మిల్లును ప్రారంభించిన ఎమ్మెల్సీ ,ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మండలం తాస్కానిగూడెం గ్రామంలో వరమహాలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్‌ను సోమవారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాగజోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాటన్ మిల్లును ప్రారంభించి పరిశ్రమల స్థాపనలో స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆకాంక్షించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించడంతో పాటు పత్తి రైతులకు దాని అనుబంధ రంగాలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ, చండూరు మున్సిపాలిటీ చైర్మన్ కోడి శ్రీనివాసులు , వైస్ చైర్మన్ భూతరాజు దశరథ , తాస్కానిగూడెం సర్పంచ్ కొండ రజిత రవి, ఐఎంసి డైరెక్టర్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , తలారి నర్సింహ్మా , కాంగ్రెస్ చండూరు మండల అధ్యక్షుడు మేకల సాగర్ రెడ్డి, పుల్లెంల సర్పంచ్ ముక్కాంల వెంకన్న యాదవ్ , శ్రీను, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తీర్పారి వెంకటేశ్వర్లు , కోడి వెంకన్న, గురిజ రామచంద్రం, శ్రీను పాల్గొన్నారు.

## ఎల్-నినో నేపథ్యంలో ప్రతి నీటి బొట్టు పొదుపు

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ:** ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రైతులకు సూచించారు.సోమవారం పగిడిమర్రి గ్రామ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన రైతులతో ముఖాముఖి మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ లో సాగునీటి లభ్యత పరిమితంగా ఉండటంతో చెరువులు, కాలువలు, బోరు బావుల్లో ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. రానున్న 300 రోజులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, జూన్,జూలై వరకు నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ నీటి ఎద్దడిని అధిగమించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని,అవసరమైన స్ప్రింక్లర్లు తదితర పరికరాలను ప్రభుత్వ సహకారంతో సమకూరుస్తామని తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేస్తున్న 5 రైతు క్లస్టర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్,హార్టికల్చర్ అధికారి శేఖర్, ట్రాన్స్ కో ఎస్ఈ,తహసీల్దార్ పద్మ,ఎంపీడీవో వేద రక్షిత,సర్పంచ్ నాగవెల్లి నాగమణి సైదులు,ఏఈవో కీర్తన,జగల్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** చట్టపరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 38 మంది బాధితులు తమ సమస్యలను ఎస్పి దృష్టికి తీసుకువచ్చారు.ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా,ప్రతి దరఖాస్తుపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత సమయంలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకొని,వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే పోలీస్ శాఖ లక్ష్యమని పేర్కొన్నారు.గ్రీవెన్స్ డేలో అందిన ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి,చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

## 108 సేవలను పరిశీలించిన కేంద్ర నాణ్యతా బృందం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లాలో 108 అత్యవసర అంబులెన్స్ సేవలను ఢిల్లీ నుంచి వచ్చిన జాతీయ నాణ్యతా ప్రమాణాల బృందం సోమవారం క్షేత్రస్థాయిలో ఆడిట్ చేసింది.జిల్లాలోని 108 అంబులెన్స్ లను సందర్శించిన బృందం ప్రజలకు అందిస్తున్న అత్యవసర వైద్య సేవల నాణ్యతను పరిశీలించింది.అంబులెన్స్ సంసిద్ధత, ప్రాణాలను కాపాడే మందు లు, వెంటిలేటర్, డీఫిబ్రిలేటర్, సక్షన్,ఆక్సిజన్, అత్యవసర మెడిసిన్ కిట్ లభ్యతను పరిశీలించారు.మెడికల్, గాయాలు, గర్భిణీ,గుండెపోటు కేసులను ప్రోటోకాల్ ప్రకారం నిర్వహించడంలో ఇఎంటీలు,పైలట్ల పరిజ్ఞానాన్ని, పీసీఆర్ రాయడం,రెస్పాన్స్ టైం,ఇన్ఫెక్షన్ కంట్రోల్,బయో మెడికల్ వేస్ట్ నిర్వహణ,అంబులెన్స్ డిస్ ఇన్ఫెక్షన్ విధానాన్ని అధ్యయనం చేశారు. జిల్లాలోని అన్ని 108 అంబులెన్స్ లు 24 గంటలూ ఉచిత సేవలు అందిస్తూ సగటు రెస్పాన్స్ టైం 20 నిమిషాల లోపు ఉండేలా చూస్తున్నట్లు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ తెలిపారు. సిబ్బంది అంకితభావం పట్ల బృందం సంతృప్తి వ్యక్తం చేస్తూ డాక్యుమెంటేషన్‌లో మెరుగుదలకు సూచనలు చేసింది.

## ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందన

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజలు అందించే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పి కె. నరసింహ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో బాధితుల నుండి ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. అధికారులు బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి భరోసా కల్పించాలని ఆదేశించారు. ప్రజారక్షణ కోసం పోలీసు సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు.

# జర్నలిజం ప్రజల పక్షాన ఉండాలి

ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ఫోర్త్ ఎస్టేట్ పనిచేయాలి

మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి

జర్నలిస్టులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియాపై ఒకరోజు వర్క్ షాప్




**ప్రజాపక్షం/నందికొండ :** ప్రజా ప్రయోజనాలను కాంక్షించేదిగా ఫోర్త్ ఎస్టేట్ ఉండాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జర్నలిస్టులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియాపై ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిజం ప్రజల పక్షాన, ప్రజల మనోభావాలను,ప్రయోజనాలను కాంక్షించేదిగా ఉండాలన్నారు. ప్రజా ప్రయోజనాలను పరిరక్షించే వ్యవస్థే పత్రికా వ్యవస్థ అని,జర్నలిస్టులు సమాజ సేవకు అంకితం కావాలని అన్నారు. ప్రజలకు సమాచారాన్ని తెలియజేయడం, చైతన్యం చేయడం మీడియా బాధ్యత అని, ప్రజల మనోభావాలను ప్రతిబింబించలేనప్పుడు మీడియాపై నమ్మకం పోతుందన్నారు. సమాజంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల తర్వాత స్థానం జర్నలిజానిదే నని, ఆ స్థానాన్ని నిలబెట్టాలని కోరారు. అనంతరం వర్కింగ్ జర్నలిస్టులు,జర్నలిస్టుల చట్టాలు, పత్రికలు యాజమాన్య సంబంధాలు, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్, డిజిటల్ మీడియాల వ్యత్యాసాలు, జర్నలిజం మార్గదర్శక సూత్రాలను ఆయన కూలంకషంగా వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై ఫాక్ట్ చెక్కర్, ఏఐ ట్రైనర్ సత్యప్రియ, సోషల్ మీడియాపై ముద్దం నరసింహస్వామి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు,జిల్లా సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పులి మామిడి మహేందర్ రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ ఓఎస్డీ రహమాన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, మీడియా అకాడమీ పీఆర్ఓ శైలేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాగార్జునసాగర్, నందికొండ, దేవరకొండ,మిర్యాలగూడ ప్రాంతాల జర్నలిస్టులు చైర్మన్‌ను శాలువాలు, పూల బొకేలతో సన్మానించారు.

## అతివేగం, మద్యం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై నిఘా



జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు

చిట్యాల పోలీస్‌స్టేషన్ తనిఖీలో యాదాద్రి జోన్ ఐజీ షాహనవాజ్ ఖాసిం

**ప్రజాపక్షం/చిట్యాల:** జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని యాదాద్రి జోన్ ఐజీ షాహనవాజ్ ఖాసిం పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నల్లగొండ జిల్లా చిట్యాల పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి,స్టేషన్ నిర్వహణ, కేసుల దర్యాప్తు, పోలీసు రికార్డులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆయన వెంట ఉన్నారు.జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి,వాటి నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఐజీ సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.మహిళలు,బాలికలు,చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఐజీ సూచించారు. పోక్సో కేసుల్లో వేగవంతమైన, నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. దొంగతనాలు, వాహనాల చోరీల నియంత్రణకు రాత్రివేళల్లో గస్తీని ముమ్మరం చేయాలని, రౌడీషీటర్లు, పదేపదే నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు.పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని,నేరస్తులకు శిక్షలు పడేలా పక్కా ఆధారాలతో దర్యాప్తు పూర్తి చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. సైబర్ నేరాల బారినపడిన బాధితులు ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రజల ప్రాణాలు,ఆస్తుల రక్షణే లక్ష్యంగా పనిచేస్తూ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని ఐజీ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ తనిఖీలో నల్లగొండ డిఎస్‌పి కొలను శివరాంరెడ్డి, చిట్యాల సీఐ సిరికొండ సురేష్,ఎస్ఐ బీరెల్లి వెంకట్‌రెడ్డి,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ ఎన్నికల్లో హేమలత ప్యానెల్ ఆధిపత్యం

టాప్ 15లో నల్లగొండ సేవా సమితి ప్యానెల్ నుంచి 8 మంది.. అమరేందర్‌రెడ్డి ప్యానెల్ నుంచి ఏడుగురు

ఏడు రౌండ్ల ఓట్ల లెక్కింపుతో ఉత్కంఠకు తెర..

అత్యధికంగా 573 ఓట్లు సాధించిన డాక్టర్ హేమలత



**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో డాక్టర్ హేమలత నేతృత్వంలోని నల్లగొండ సేవా సమితి ప్యానెల్ ఆధిపత్యం ప్రదర్శించింది.ఏడు రౌండ్ల ఓట్ల లెక్కింపు అనంతరం అందుబాటులో ఉన్న తుది వివరాల ప్రకారం టాప్ 15 మంది అభ్యర్థుల్లో హేమలత ప్యానెల్‌కు చెందిన ఎనిమిది మంది,గోలి అమరేందర్‌రెడ్డి ప్యానెల్‌కు చెందిన ఏడుగురు స్థానం సంపాదించారు.దీంతో రెండు ప్యానెళ్ల మధ్య హోరాహోరీ పోటీ నెలకొనగా,టాప్ 15లో హేమలత ప్యానెల్ ఒక అభ్యర్థి ఆధిక్యాన్ని సాధించింది.ఈ ఎన్నికల్లో డాక్టర్ హేమలత 573 ఓట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచారు.అకవరం లతాకుమారి 549 ఓట్లతో రెండో స్థానంలో,కుంబం జ్యోతి 536 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు.గోలి అమరేందర్‌రెడ్డి 530 ఓట్లు సాధించి నాలుగో స్థానాన్ని దక్కించుకున్నారు.చిలుకూరి పరమాత్మ 517 ఓట్లు, గుంటి రామకృష్ణ 491 ఓట్లు,డాక్టర్ ఏ.సీ.పుల్లారావు 489 ఓట్లు, మిర్యాల యాదగిరి 485 ఓట్లు సాధించి తదుపరి స్థానాల్లో నిలిచారు. టాప్ 15లో హేమలత ప్యానెల్ నుంచి డాక్టర్ హేమలత,అకవరం లతాకుమారి,కుంబం జ్యోతి,చిలుకూరి పరమాత్మ,గుంటి రామకృష్ణ, గుర్రం ప్రభాకర్‌రెడ్డి, భీమనపల్లి శ్రీకాంత్, మంచుకొండ చిన బిక్షమయ్య చోటు దక్కించుకున్నారు.మరోవైపు గోలి అమరేందర్‌రెడ్డి ప్యానెల్ నుంచి గోలి అమరేందర్ రెడ్డి, డాక్టర్ ఏ.సీ. పుల్లారావు, మిర్యాల యాదగిరి,పూరుకొండ ప్రభాకర్ రెడ్డి, టి. సుధారాణి, అమంచి రాజలింగం, కోమటిరెడ్డి పృథ్వీధర్‌రెడ్డి టాప్ 15లో నిలిచారు.ఓట్ల లెక్కింపు కొనసాగినంతసేపూ రెండు ప్యానెళ్ల మధ్య పోటీ ఆసక్తికరంగా సాగింది. చివరకు అందుబాటులో ఉన్న తుది ఓట్ల వివరాల ప్రకారం టాప్ 15లో ఎనిమిది స్థానాలతో హేమలత ప్యానెల్ స్వల్ప ఆధిక్యాన్ని ప్రదర్శించింది. అమరేందర్‌రెడ్డి ప్యానెల్ ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల ఫలితాలు జిల్లా కేంద్రంలో చర్చనీయాంశంగా మారాయి.

## కంకర పోశారు.. బిటి మరిచారు

కంకర రోడ్డుతో వడ్డెరగూడెం ప్రజలకు కన్నీళ్లే మిగిల్చారు..

పండగ పూట పల్లె బాట సాగేదెలా...

రోజులు గడుస్తున్నా కనికరించని కాంట్రాక్టర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు

**ప్రజాపక్షం/డిండి:** దసరా పండగను పురస్కరించుకొని హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్న పరజలు పండగను ఏదేమైనా తమ స్వంత గ్రామానికి వెళ్తారు. కానీ నల్గొండ జిల్లా గుండ్లపల్లి మండలంలోని వావిలికోల్ గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్డెరగూడెం గ్రామ ప్రజలు తమ గ్రామానికి వెళ్ళాలంటే దడుసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే వావిలికోల్ గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్డెరగూడెం, బ్రాహ్మణపల్లి, బ్రహ్మణపల్లి తండా వాసుల ప్రయాణార్థం బిటి రోడ్డు నిర్మాణం కోసం సదరు కాంట్రాక్టర్ ఆదిలోనే హంసపాదుగా కంకరపోసి వదిలేసారు. గత సంవత్సరం కురిసిన వర్షాలకు మడుగులను తలపించి ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలిగిఎంతో మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురయ్యారు. అధికారులను మొరపెట్టుకున్నా, ప్రజా ప్రతినిధులను వేడుకున్నా, కాంట్రాక్టర్‌ను బతిమిలాడినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికి రోడ్డుపై కంకర చిందర వందరగాపడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఏళ్లు గడుస్తున్నా పనులు మాత్రం జరగడం లేదు, పండగకు పల్లె కు పోదామంటే వడ్డెరగూడెం వాసులు ఆ రహదారిపై వెళ్లాలంటే నరకానికి వెళ్లినట్లుగా భావించి పండగకు వెళ్లలేని పరిస్థితిలో ఆందోళన చెందుతున్నారు. ప్రజాపాలనలో ప్రజలకు అవసరమైన పనులు వీలైనంత త్వరగా పూర్తి అయితాయని భావించిన వడ్డెర గూడెం, బ్రాహ్మణపల్లి, బ్రాహ్మణపల్లితండా ప్రజలకు కంకర రోడ్డుతో కన్నీళ్లే మిగిల్చారని అధికారులు, ప్రజా ప్రతినిధులపై మండిపడుతున్నారు. ప్రజాపాలనలో ఏ పని పూ ర్తిగా కావడం లేదని ప్రజలకు అవసరమైన పనులు చేయడంలో కూడా అధికారులు ప్రజాప్రతినిధులు చేతులెత్తేస్తున్నారని బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు ముత్యాలు అన్నారు. ఇది ప్రజా పాలన కాదని ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసే పాలన అని అన్నారు.





## తాగునీటి అవసరాలకు నీటి విడుదల

**ప్రజాపక్షం/నందికొండ :** ప్రస్తుతం నెలకొన్న తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువకు అధికారులు సోమవారం నీటిని విడుదల చేశారు.తాగునీటి అవసరాలను తీర్చేందుకు తొలుత 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు, క్రమంగా ప్రవాహాన్ని పెంచుతూ రోజుకు 6 వేల క్యూసెక్కుల స్థాయికి తీసుకెళ్లనున్నారు. రాబోయే ఏడు రోజుల పాటు ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల కొనసాగనుండగా, ఈ సమయంలో తాగునీటి అవసరాల కోసం మొత్తం సుమారు 3 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**సాగర్ రిజర్వాయర్ సమాచారం :** నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 540.20 అడుగులుగా నమోదైంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 312.045 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 188.744 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 33,125 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6,173 క్యూసెక్కులు,ఎస్ఎల్ బీసీ,ఏఎంఆర్‌పి ద్వారా 1,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఇన్ ఫ్లోగా వస్తున్న 41,398 క్యూసెక్కుల నీటిని అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లోగా దిగువకు విడుదల చేస్తున్నారు.

## ఈ నెల 21న పోలీస్ ఫ్లాగ్‌డే

**ప్రజాపక్షం/సూర్యాపేట :** దేశంలో శాంతిభద్రతల పరిరక్షణ, సమాజ రక్షణ, ప్రజల భద్రత కోసం విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పి కె. నరసింహ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అక్టోబర్ 21 నుంచి 31 వరకు సర్ధార్ వల్లభబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే జాతీయ ఐక్యతా దినోత్సవం వరకు పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలీసు అమరవీరుల త్యాగాలు, వారి బలిదానాలు, ఆశయాలను ప్రజలకు తెలియజేసేందుకు జిల్లా వ్యాప్తంగా ఫ్లెక్సీలు, హోర్డింగులు, పోస్టర్లను ఏర్పాటు చేయడంతోపాటు పోలీస్ ఫ్లాగ్ డేకు సంబంధించిన వీడియోలను ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేయనున్నట్లు వివరించారు. పోలీసు శాఖ నిర్వహిస్తున్న విధులు, ప్రజల భద్రత కోసం పోలీసులు చేస్తున్న సేవలు, పోలీసు అమరవీరుల త్యాగాల ప్రాముఖ్యతను విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలకు వివరించేలా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా పోలీసుల విధులు, ఆయుధాల వినియోగం, పోలీసు కమ్యూనికేషన్ వ్యవస్థ, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, రోడ్డు ప్రమాదాల నివారణ, పోలీస్ స్టేషన్ల నిర్వహణ, కేసుల దర్యాప్తు విధానం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రజలకు అందించే పోలీసు సేవల గురించి వివరించనున్నట్లు వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పోటీలను నిర్వహించి పోలీసు వ్యవస్థపై అవగాహన పెంపొందించనున్నట్లు చెప్పారు.

## గ్రామీణ క్రీడాకారులకు వేదికగా ఎమ్మెల్యే బిఎల్‌ఆర్ కప్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దసరా పండుగ సందర్భంగా టీమ్ సీబీకే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ కప్ ఉమ్మడి నల్లగొండ జిల్లా గ్రామీణ స్థాయి కబడ్డీ పోటీలు మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తనయుడు, యువ నాయకులు బత్తుల సాయి ప్రసన్నరెడ్డి పోటీలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు, క్రీడాభిమానులు, కబడ్డీ క్రీడాకారులు, టీమ్ సీబీకే సభ్యులు పాల్గొన్నారు.

## సూర్యాపేట మార్కెట్‌ను ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

వ్యవసాయ మార్కెట్‌లో నూతన గాల్‌వాల్యూమ్ షెడ్డు పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట మార్కెట్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తానని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో నూతన గాల్‌వాల్యూమ్ షెడ్డు పనులకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు మార్కెట్‌ను మరింత చేరువ చేస్తూ వారి అవసరాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. రైతుల సంక్షేమంతో పాటు మార్కెట్ యార్డులో పనిచేస్తున్న కార్మికుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. రైతులు ఎంతో కష్టపడి పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ధర లభించేలా కృషి చేస్తానని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని చెప్పారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, వారి సమస్యలను గుర్తించి పరిష్కరించడం తన ప్రధాన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. మార్కెట్ యార్డులో వివిధ పనులు చేస్తూ రైతులకు, వ్యాపారులకు సేవలందిస్తున్న కార్మికుల సంక్షే మం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతానని అన్నారు. కార్మికుల సమస్యలను తెలుసుకొని, వారి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి కార్యదర్శి ఎండి ఫసియోద్దీన్, మార్కెట్ సిబ్బంది, మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపాలిటి వైస్ చైర్మన్ యండి షఫీఉల్లా, మార్కెట్ కమిటి పాలక వర్గ సభ్యులు, అడ్తి అసోసియేషన్, అపరాల అసోసియేషన్, ట్రేడర్స్ అసోసియేషన్, మిల్లర్ల అసోసియేషన్, హమాలీ కార్మికులు, స్వీపర్లు, కార్మికులు పాల్గొన్నారు.





## పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించిన మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల కేంద్రానికి చెందిన క్రీ.శే.కోరాడ పరంజ్యోతి (రిటైర్డ్ ఎస్ఐ) అనారోగ్యం వల్ల మృతి చెందినట్లు తెలుసుకున్న జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పరంజ్యోతి పార్థివ దేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులకు గుండె నిబ్బరం చేసే మనో ధైర్యాన్ని ఆ దేవుడు ప్రసాదించాలని ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ తెలిపారు.



## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/ధన్వాడ :** ఉట్కూరు మండలంలోని బిజ్వార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్ట్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు సమాజసేవలో ముందుండే హర్షత్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడం తమకు ఎంతో గర్వకారణమని 2005–2006 పదో తరగతి బ్యాచ్ కు చెందిన ఆయన చిన్ననాటి మిత్రులు అన్నారు. ఈ సందర్భంగా ధన్వాడలో మిత్రులందరూ కలిసి హర్షత్ ను ఘనంగా సన్మానించారు. తన వృత్తి నైపుణ్యంతో విద్యార్థులను రాష్ట్రస్థాయిలో రాణించేలా తీర్చిదిద్దిన హర్షత్, భవిష్యత్తులో విద్యార్థులు జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటేలా కృషి చేయాలని మిత్రులు ఆకాంక్షించారు. ఆయన విద్యాసేవలో తన వంతు సహకారం అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. అదే విధంగా తమ చిన్ననాటి మిత్రుడు భాస్కర్ పంచాయితీ కార్యదర్శిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆయనను కూడా ఈ కార్యక్రమంలో సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో అభిలాష్ గౌడ్, ఉదయ్ కుమార్, సాయిబాబా, సురేష్, రామకృష్ణ, బాబు, నారాయణ, మల్లికార్జున్, పవన్ పాల్గొన్నారు.



## బతుకమ్మ పాట షూటింగ్ ప్రారంభించిన వాకిటి లలిత

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ మండలంలోని పస్పుల పంచదేవ్ పహాడ్ గ్రామాల మధ్య శ్రీశ్రీ దత్తాత్రేయ టెంపుల్ కృష్ణానది దగ్గర తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మక్తల్ పట్టణానికి చెందిన జెమిని రవి, సురేందర్, రాజు, కుర్వ శంకర్‌ల ఆధ్వర్యంలో మక్తల్ పరిసర ప్రాంతంలో రూపొందిస్తున్న బతుకమ్మ పాట షూటింగ్‌ను వాకిటి లలిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, ప్రకృతితో ముడిపడిన మన సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పాటలను రూపొందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా తెలంగాణ పండుగల విశిష్టతను, సంస్కృతి గొప్పతనాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చని లలిత తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్ కుమార్ గుప్తా, గణేష్ కుమార్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్‌లో ఇంటింటికీ ఎన్‌రోల్‌మెంట్

**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలంలోని ఖానాపూర్ గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ ప్రక్రియ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజెపి మండల అధ్యక్షులు, ప్రతాప్ రెడ్డి, బిజెపి పార్టీ మక్తల్ మండల ప్రధాన కార్యదర్శి ఖానాపూర్ సురేష్, బిజెపి జిల్లా మైనార్టీ నాయకులు, జావిద్ లక్ష్మీపతి, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## ఢిల్లీలో ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఎన్నికల వ్యవహారాలపై నిరసన వ్యక్తం చేస్తూ నిర్వహించిన ఈ ధర్నాలో అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణతో పాటు పలువురు రాష్ట్ర ఎమ్మెల్యేలు, మంత్రులు పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నాయకులు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని కోరుతూ ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# నాగర్‌కర్నూల్‌ను కరువు జిల్లాగా ప్రకటించాలి

### రైతులకు రూ.100 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలి
### జాయింట్ కలెక్టర్‌కు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం వినతి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, రైతులను ఆదుకునేందుకు రూ.100కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వార్ల వెంకటయ్య డిమాండు చేశారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్ల వెంకటయ్య మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సక్రమంగా కురవక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లాలో కేవలం 18శాతం మేరకే పంటల సాగు జరిగిందని, సాగు చేసిన పంటలకు కూడా విద్యుత్ సరఫరా సక్రమంగా లేక కొన్ని పంటలు ఎండిపోయాయని పేర్కొన్నారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేల చొప్పున నష్టపరిహారం అందించాలని, పత్తి, మిర్చి పంటలకు ఎకరాకు రూ.20వేల చొప్పున పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలని, పశువులకు పశుగ్రాసం ఏర్పాటు చేయాలని, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను సరిపడా అందించాలని, రైతుల పంట రుణాలను తక్షణమే మాఫీ చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య పాకల శంకర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసులు, జిల్లా కోశాధికారి సాయిల్ నాయుడు, నాయకులు మారేడు శివశంకర్, ఎఐకెఎస్ జిల్లా నాయకులు గడ్డం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలాపురంలో పేకాట శిబిరంపై పోలీసుల దాడి

### ఐదుగురు పట్టివేత రూ.5,420 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం
### నారాయణపేట్ రూరల్ ఎస్ఐ సతీష్ రెడ్డి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ.సతీష్ రెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ సతీష్ రెడ్డి తన సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకొని, వారి వద్ద నుంచి రూ.5,420 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. గేమింగ్ యాక్ట్ ప్రకారం ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాలు, పట్టణాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే ప్రజలు వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని కోరారు.






## అన్నదానానికి మించిన గొప్ప దానం మరొకటి లేదు

### టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు కోయిలకొండ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** అన్నదానానికి మించిన గొప్ప దానం మరొకటి లేదని టియుడబ్ల్యుజె (ఐజెయు) నారాయణపేట్ జిల్లా అధ్యక్షుడు కోయిలకొండ నారాయణరెడ్డి అన్నారు. పుట్టినరోజు వేడుకలను కేవలం వ్యక్తిగత సంబరాలకే పరిమితం చేయకుండా, నిరుపేదలకు సేవ చేస్తే కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఆ రోజుకు మరింత సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం నారాయణపేట్ జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని నిరుపేదలకు భోజనాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోయిలకొండ నారాయణరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ గౌడ్, మాజీ మార్కెట కమిటీ వైస్ చైర్మన్, లయన్ కన్న జగదీష, టియూడబ్ల్యూజే (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ సభ్యుడు నక్క శ్రీనివాస్, జిల్లా ఆరోగ్య విభాగం కన్వీనర్ సంజీవ్ ప్రకాష్ ముదిరాజ్, జిల్లా విద్యా విభాగం కన్వీనర్ రాజేష్ కుమార్, జిల్లా ప్రచార విభాగం ప్రతినిధి సురేష్, ఉపాధ్యక్షులు తఖీ, బోయ శ్రీనివాస్, చక్రి లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### పిఎం ధన్-ధాన్య కృషి యోజన అమలులో

# నాగర్‌కర్నూల్‌కు జాతీయ గుర్తింపు

### కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల ఉత్పాదకత పెంపు, వ్యవసాయ అనుబంధ రంగాల బలోపేతమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన (పిఎం డిడికెవై) పథకం అమలులో నాగర్‌కర్నూల్ జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ పథకం అమలుకు సంబంధించి న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి మైలురాయి వేడుకల్లో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అవార్డును అందుకున్నారు. సోమవారం న్యూఢిల్లీలోని ఎన్ఎస్‌సి కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా కలెక్టర్ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ బృందంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో పాటు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యశ్వంత్ రావు, కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త ఓ.శైలా, ప్రగతిశీల రైతు రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# గద్వాలలో చెన్నై షాపింగ్ మాల ప్రారంభం



**ప్రజాపక్షం/గద్వాల :** జిల్లా కేంద్రంలోని హిమాలయ హోటల్ సమీపంలో ఏర్పాటు చేసిన ది చెన్నై షాపింగ్ మాల్ (40వ బ్రాంచ్)ను స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీనటి రితికా నాయక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమెను చూడటానికి, ఆమె సందడిని తిలకించేందుకు యువత, అభిమానులు భారీగా తరలిరావడంతో షాపింగ్ మల్ వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా షాపింగ్ మాల్ నిర్వహకులు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చెన్నై షాపింగ్ మాల్ 40వ బ్రాంచ్ గద్వాలలో ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. స్థానిక ప్రజలు బట్టలు, ఇతర వస్తువులు, కొనుగోళ్ల కోసం హైదరాబాద్, కర్నూలు వెళ్లాల్సిన అవసరం లేకుండా గద్వాలలోనే నాణ్యమైన వస్తువులు సరసమైన ధరలకు అందుబాటులోకి రావడం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. గద్వాల నియోజకవర్గంలో భవిష్యత్తులో మరిన్ని వ్యాపార సంస్థలు ఏర్పాటై, ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు , జిల్లా సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, షాపింగ్ మాల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి పలువురు అధికారుల గైర్హాజరు

### ఒక్కటే దరఖాస్తు..

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి పలువురు అధికారుల గైర్హాజరయ్యారు. వీపనగండ్ల మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కేవలం ఒక్క దరఖాస్తు మాత్రమే అందినట్లు ఎంపిడిఓ నరసింహులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందేందుకు ప్రజావాణి కార్యక్రమం ఒక ముఖ్యమైన వేదికగా ఉంది. అయితే, ఈ కార్యక్రమానికి కొంతమంది అధికారులు హాజరుకాకపోవడం గమనార్హం. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేసేందుకు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోతే సమస్యల పరిష్కారం ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజావాణిలో మొత్తం ఒక్క దరఖాస్తు మాత్రమే అందగా, అందులో గ్రామీణ నీటి సరఫరా విభాగంకు సంబంధించిన ఒక దరఖాస్తు వచ్చినట్లు ఎంపిడిఓ తెలిపారు. ఇతర శాఖలకు సంబంధించి ఎలాంటి దరఖాస్తులు నమోదు కాలేదు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన ప్రజావాణి కార్యక్రమం కేవలం ఒక అధికారిక కార్యక్రమంగా మిగిలిపోకుండా, ప్రజలకు నిజమైన ప్రయోజనం చేకూర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఖాజా మైనుద్దీన్, వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్, ఎపిఎం మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. ప్రజావాణికి అధికారులు పూర్తిస్థాయిలో హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తారా? లేక ఈ కార్యక్రమం నామమాత్రంగానే కొనసాగుతుందా? అనేది వేచి చూడాలి.



## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

**ప్రజాపక్షం/నర్వ :** నర్వ మండల కేంద్రంలో ముష్టిపల్లి సంధ్య నూతన ఇందిరమ్మ ఇంటికి, యాంకి గ్రామంలో బోయ చెన్నమ్మ నూతన ఇందిరమ్మ ఇంటికి గృహప్రవేశ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భరోసా కల్పించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాల్లో కొత్త ఆశలు నింపుతోంది. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసిన లబ్ధిదారులకు నేడు తమ ఇంట్లో గృహప్రవేశం చేసుకోవడం ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ కార్యక్రమంలో మండల ఎంపిడిఓ శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్, ఏఎంసి వైస్ చైర్మన్ డి.కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ టి.హనుమంత్ రెడ్డి, యాంకి గ్రామ సర్పంచ్ కళ్యాణి వెంకటేష్, మండల ఉపాధ్యక్షుడు శరణప్ప, మండల కాంగ్రెస్ నాయకులు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి, జనార్ధన్ రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు సంజీవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బుచ్చారెడ్డి, వార్డు మెంబర్ సంఘం ఐలప్ప, నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పి.అశోక్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు పి.చంద్రశేఖర్ , ఎల్లంపల్లి వెంకటేష్, నర్వ కాంగ్రెస్ నాయకులు వెంకటరామిరెడ్డి, ఐలమ్మ, గ్రామ యువజన అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

## మాగనూరు మండల బిజెపి అధ్యక్షుడు జయానంద్ రెడ్డిపై జిల్లా అధ్యక్షుడికి ఫిర్యాదు

### షోకాజ్ నోటీసు లేకుండా తొలగింపుపై అశోక్ గౌడ్ అభ్యంతరం

**ప్రజాపక్షం/మాగనూరు :** మాగనూరు మండల బిజెపి అధ్యక్షుడు జయానంద్ రెడ్డి వ్యవహారశైలిపై బిజెపి జిల్లా అధ్యక్షులు సత్యయాదవ్‌కి ఫిర్యాదు చేసినట్లు మండల ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ పార్టీకి నిబద్ధతతో పనిచేస్తున్న తనను ఎలాంటి షోకాజ్ నోటీసు ఇవ్వకుండా వివరణ తీసుకోకుండా మండల ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు గౌరవం ఇవ్వాలని నియమ నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. మండల అధ్యక్షుడు జయానంద్ రెడ్డి, సీనియర్ నాయకులను, కార్యకర్తలను కలుపుకోని పోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని దీనివల్ల పార్టీలో అసంతృప్తి పెరిగి పార్టీకి నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో క్రమశిక్షణ ఐక్యత కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఉండాలని పార్టీ బలోపేతానికి సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జయానంద్ రెడ్డి, వ్యవహారశైలిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని తన తొలగింపు విషయాన్ని పునఃపరిశీలించాలని జిల్లా అధ్యక్షులు సత్యయాదవ్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.విద్యాసాగర్, మాజీ మండల అధ్యక్షుడు జి.నారాయణ, బిజెపి సీనియర్ నాయకులు మురళీధర్ గౌడ్, కౌన్సిలర్, బిజెవైఎం నాయకులు భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య, దేవ సహాయం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవ సహాయం అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 46 ఫిర్యాదులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందించి సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పాండు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఆర్థిక పురోగతి లక్ష్యం

### ఢిల్లీ సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** జోగులాంబ గద్వాల జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో సామాన్య రైతులు సైతం ఆర్థికంగా పురోగతి సాధించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజనను అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలో వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి లక్ష్యంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో సోమవారం నిర్వహించిన పిఎం డిడికెవై ఒక సంవత్సరం మైలురాయి వేడుకల్లో జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని అధికారుల బృందం హాజరైంది. సమావేశంలో వివిధ జిల్లాల్లో వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న ఉత్తమ పద్ధతులు, వినూత్న కార్యక్రమాలు, విజయవంతమైన నమూనాలపై అధ్యయనం చేశారు. ముఖ్యంగా వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సాగు పద్ధతులు వ్యవసాయ ఉత్పాదకత పెంపు, సాగు ఖర్చుల తగ్గింపు రైతులకు సాంకేతిక సహాకరం అందించడం వంటి అంశాలపై చర్చించారు. వివిధ జిల్లాల్లో విజయవంతంగా అమలవుతున్న కార్యక్రమాలను తెలుసుకుని, వాటిని జోగులాంబ గద్వాల జిల్లాలో స్థానిక అవసరాలకు అనుగుణంగా అమలు చేసే అవకాశాలను పరిశీలించారు. ఈ సమావేశం ద్వారా సేకరించి అనుభవాలు, ఉత్తమ వ్యవసాయ పద్ధతులను పీఎండీడీకేవై లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలో అమలు చేయడం ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంపొందించేందుకు చర్యలు తీసుకోనున్నారు. డీఏవో వీరప్ప, వ్యవసాయ శాస్త్రవేత్త అర్చన, ప్రగతిశీల రైతు ప్రహ్లాద రెడ్డి పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమానికి పెద్దపీట

### మాజీ ఎంపిపి

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇస్తూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలన లక్ష్యమని పెద్దకొత్తపల్లి మాజీ ఎంపిపి సూర్య ప్రతాప్ గౌడ్ అన్నారు. పెద్దకొత్తపల్లి మండలంలోని వెన్నచర్ల గ్రామంలో సోమవారం మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి మాజీ ఎంపిపి సూర్యప్రతాప్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి సూర్య ప్రతాప్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర టూరిజం, సంస్కృతిక శాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మహిళా సమాఖ్య భవన నిర్మాణం కోసం రూ.10 లక్షల నిధులు మంజూరు చేయించారని మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో కొల్లాపూర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జి.సుబ్రహ్మణ్యం, పంచాయతీరాజ్ ఎఇ రాజశేఖర్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ బై.రాముడు, మాజీ ఎంపిటిసి డి.రవికుమార్, గ్రామ వార్డు సభ్యులు దేవరపాగ మంజుల, దేవరాజ్, ఓర్సు నాగమ్మ, చిన్న సుల్తాన్, వంగ లింగస్వామి గౌడ్, కాటమని సత్యనారాయణ గౌడ్, ఎం.బాలస్వామి, ఓర్సు పెద్ద సుల్తాన్, ఎండి కరీం, జి.ఎల్లయ్య, డి.రామ్‌చంద్రయ్య, ఎం.సాయి, ఎం.గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

# 'నో' అని సమాధానం ఇస్తే ఖాతా ఖాళీ !

ఒటిపిలు, లింకులతో పనిలేకుండానే సైబర్ మోసం..

వాట్సాప్ సందేశాలతో కొత్త ఎత్తుగడ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేరగాళ్లు మోసాలకు కొత్త సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఇప్పటివరకు ఒటిపిలు చెప్పడం, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయడం ద్వారా ఖాతాల్లోని నగదును కొల్లగొట్టే నేరగాళ్లు.. ఇప్పుడు వాట్సాప్ సందేశాలతోనూ మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. సజ్జనార్ హెచ్చరించారు. బ్యాంకు ఖాతా నుంచి నగదు డెబిట్ అయిందంటూ గుర్తుతెలియని నంబర్ నుంచి సందేశం పంపి, లావాదేవీ తాము చేయలేదని భావించిన బాధితులతో 'నో' అని సమాధానం ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇలాంటి సందేశాలకు స్పందించకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ తరహా మోసాల్లో బాధితులు ఒటిపిని పంచుకోకపోయినా, లింక్‌పై క్లిక్ చేయకపోయినా ప్రమాదంలో పడే అవకాశం ఉందంటూ సజ్జనార్ ప్రజలను అప్రమత్తం చేశారు. గుర్తుతెలియని లేదా అంతర్జాతీయ నంబర్ల నుంచి వాట్సాప్‌కు వచ్చే సందేశాల్లో బ్యాంకు లావాదేవీల పేరుతో భయాందోళనలు సృష్టించి, వెంటనే 'నో' అని బదులివ్వాలని కోరుతున్నారని వివరించారు. అయితే, సందేశానికి సమాధానం ఇచ్చినంత మాత్రాన ఫోన్ హ్యాక్ అవుతుందని లేదా ఖాతాలోని డబ్బు పోతుందని నిర్ధారించలేమని, సందేశాల్లోని హానికరమైన ఫైళ్లు, లింకులు, ఇతర సాంకేతిక అంశాలపై అప్రమత్తత అవసరమని సూచించారు.

**చార్టర్డ్ అకౌంటెంట్ ఖాతా నుంచి లక్షల్లో నగదు స్వాహా..** ఇటీవల ఇదే తరహా మోసంలో ఓ చార్టర్డ్ అకౌంటెంట్ బ్యాంకు ఖాతా నుంచి లక్షల రూపాయలు మాయమైనట్లు సజ్జనార్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో బ్యాంకు లావాదేవీల పేరుతో గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే సందేశాలకు 'ఎస్', 'నో' అంటూ ఎలాంటి సమాధానమూ ఇవ్వవద్దని సూచించారు. అనుమానాస్పద సందేశాలను తొలగించి, సంబంధిత నంబర్‌ను బ్లాక్ చేయాలని కోరారు. ఖాతా నుంచి నగదు డెబిట్ అయిందని సందేశం వస్తే ఆందోళన చెందకుండా, అధికారిక బ్యాంకు మొబైల్ యాప్ లేదా నెట్ బ్యాంకింగ్‌లో లావాదేవీల వివరాలను పరిశీలించాలని సూచించారు.



అనుమానం ఉంటే పాస్‌బుక్ లేదా కార్డు వెనుక ఉన్న అధికారిక కస్టమర్ సేవల నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

**మోసపోతే వెంటనే 1930కు ఫోన్ చేయాలి..** ఒకవేళ సైబర్ మోసానికి గురై నగదు కోల్పోతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సజ్జనార్ సూచించారు. వీలైనంత త్వరగా ఫిర్యాదు చేస్తే, లావాదేవీ వివరాల ఆధారంగా సంబంధిత బ్యాంకులు, అధికారుల ద్వారా నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా మోసం జరిగిన వెంటనే స్పందించడం కీలకమని పేర్కొన్నారు.సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతులతో ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్న నేపథ్యంలో, తెలియని నంబర్ల నుంచి వచ్చే సందేశాలను నమ్మవద్దని, వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను భద్రంగా ఉంచుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఎన్నికల వ్యవస్థపై ప్రజలకున్న విశ్వాసాన్ని దెబ్బతీయొద్దు

ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఎన్నికల వ్యవస్థపై ప్రజలకున్న విశ్వాసాన్ని దెబ్బతీయ వద్దని, అలా చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనే అస్కారం ఉంటుందని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై ఢిల్లీలో జరిగిన నిరసనలో ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేతుల్లో కీలుబొమ్మగా ఎన్నికల కమీషన్ మారితే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. సిఇసి జ్ఞానేష్‌కుమార్‌ను బాధ్యతల నుండి తొలగించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

## ఫిర్యాదులపై నిర్లక్ష్యం..ఇంటర్ అధికారిపై జెసి ఆగ్రహం

ప్రజావాణికి హాజరు కాకపోవడంపై

ఇంటర్ బోర్డు అధికారికి అదనపు కలెక్టర్ హెచ్చరిక

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులపై స్పందించకపోవడం, బాధితులకు సమాధానం చెప్పకపోవడంపై రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావాణికి గైర్హాజరైన జిల్లా ఇంటర్ బోర్డు అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రెండు గంటల్లో సమగ్ర విచారణ పూర్తి చేసి నివేదిక అందించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే..సస్పెండ్‌కు సైతం వెనుకాడబోమని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి, డిఆర్ఓ ఎన్.శారదాదేవి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 102 ఫిర్యాదులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 49, ఇతర శాఖలకు సంబంధించి 53 అర్జీలు ఉన్నాయి. బాలాపూర్ మండలం నాదర్‌గూల్‌లోని నానో జూనియర్ కళాశాలపై గత నెల 22న ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని బాధితుడు సన్నిభూపాల్ అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎలాంటి అనుమతులు లేకుండానే కళాశాల యాజమాన్యం అడ్మిషన్లు చేపట్టి, తరగతులు నిర్వహిస్తోందని ఆరోపిస్తూ చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఇంతకాలమైనా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. దీంతో జిల్లా ఇంటర్ బోర్డు అధికారి ఎక్కడున్నారని అదనపు కలెక్టర్ ప్రశ్నించారు. సంబంధిత అధికారి ప్రజావాణికి హాజరుకాకుండా,ఆయన స్థానంలో



మరో ఉద్యోగి రావడంపై అసహనం వ్యక్తం చేశారు. ఫిర్యాదుపై రెండు గంటల్లో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఫోన్ ద్వారా ఆదేశించారు. గైర్హాజరుపై వివరణ ఇవ్వాలని కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయరాదని, బాధితులకు జవాబుదారీతనంతో సమాధానం చెప్పాలని స్పష్టం చేశారు.

**ఆలూరులో 16 గుంటల భూమిని కాపాడాలి...**చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలో ప్రజావసరాల కోసం గ్రామ పంచాయతీ పేరున రిజిస్ట్రేషన్ చేసిన 16 గుంటల భూమి కబ్జాకు గురైందని గ్రామ పంచాయతీ కార్యవర్గ సభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇదే భూమి మీదుగా 'ఆర్గానో' విల్లాస్‌కు 40 అడుగుల రహదారిని అక్రమంగా ఏర్పాటు చేశారని, హెచ్‌ఎండిఎ నుంచి ఐదు ఎకరాలకు అనుమతులు తీసుకొని, 50 ఎకరాల్లో విల్లాల నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ వ్యవహారంలో అక్రమాలకు పాల్పడిన వారితో పాటు, వారికి సహకరిస్తున్న అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రజావాణికి వచ్చి.. తిరిగి వెళ్లలేక అవస్థలు

కలెక్టరేట్‌కు బస్సు సర్వీసులు పెంచాలంటున్న బాధితులు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తమ సమస్యను అధికారులకు చెప్పుకోవాలన్న ఆశతో కలెక్టరేట్ మెట్లెక్కారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అర్జీ ఇచ్చేందుకు వచ్చిన వృద్ధులు, ఒంటరి మహిళలు తిరిగి ఇంటికి వెళ్లలేక అవస్థలు పడ్డారు. సోమవారం రాజేంద్ర నియోజకవర్గం కాటేదాన్‌కు చెందిన పరంజ్యోతి,మనోహర, సత్యవతి, బండారు సునీత, రోజారాణి (సరూర్‌నగర్), ఇందిర (మన్సూరాబాద్) తదితర వృద్ధులు, ఒంటరి మహిళలు ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్జీలు సమర్పించేందుకు సోమవారం ఉదయం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఆయా ప్రాంతాల నుంచి నానా అవస్థలు పడుతూ వచ్చారు. అర్జీలు సమర్పించేందుకు క్యూలైన్‌లో వంద మందికిపైగా ఉండటంతో, ఓపికగా వేచి ఉండి ఎట్టకేలకు అధికారులకు తమ వినతిపత్రాలు అందజేశారు. అర్జీ సమర్పించే క్రమంలో సమయం గడిచిపోయింది. తమ వద్ద ఉన్న కొద్దిపాటి డబ్బులు ఆటో చార్జీలకే ఖర్చవడంతో తిరిగి వెళ్లేందుకు చేతిలో చిల్లిగవ్వ మిగల్లేదు. మరోవైపు మధ్యాహ్నం రెండు గంటలకు రావాల్సిన సికింద్రాబాద్–చందర్‌లా బస్సు సాయంత్రం నాలుగు గంటలైనా రాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆకలితో అలమటిస్తూ, ఇంటికి ఎలా వెళ్లాలో తెలియక సాయంత్రం వరకు కలెక్టరేట్ వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇది ఒక్కరోజు సమస్య కాదు. తమ గోడును ఉన్నతాధికారులకు విన్నవించుకునేందుకు ప్రతి సోమవారం ప్రజావాణికి వచ్చే అనేక మంది సామాన్యులకూ రవాణా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పేదలు, వృద్ధులు, మహిళలు బస్సుల కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగుల సౌకర్యార్థం ఉదయం 9 గంటలకు జేబీఎస్ నుంచి రెండు బస్సులు, దిల్‌సుఖ్‌నగర్, మియాపూర్, మెహిదీపట్నం నుంచి ఒక్కో బస్సు సర్వీసును నడుపుతున్నట్లు సమాచారం. తిరిగి సాయంత్రం ఐదు గంటలకు ఇదే సర్వీసులను నడుపుతున్నారు. ప్రజావాణికి వచ్చే బాధితుల కోసం అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



## విద్యుత్ కోతల నియంత్రణలో విఫలం

బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

**ప్రజాపక్షం/కొందుర్గు:** ఎండుతున్న పంటలను, పెరుగుతున్న విద్యుత్ కోతలను నియంత్రించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. సోమవారం కొందుర్గు మండల కేంద్రంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అధ్యక్షతన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఎరువులు, విత్తనాల కొరతలు సృష్టించడంతో పాటు విద్యుత్ కోతల కారణంగా చేతికొచ్చిన పంటలు ఎండుతుంటే పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని వాపోయారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని తెలిపారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బిఆర్‌ఎస్ నేతలు సభ్యత్వ నమోదు ప్రక్రియను చురుగ్గా చేపట్టాలని, పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.



## శాంతియుతంగా ఉత్సవాల నిర్వహణ

షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకునేందుకు భక్తులు, నిర్వహకులు కృషి చేయాలని షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ సూచించారు. సోమవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సిఐ సీతారం ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దుర్గామాత అమ్మవారి ప్రతిమలు ప్రతిష్టించే నిర్వాహకులు విధిగా పోలీస్ శాఖ అనుమతులు తీసుకోవాలని సూచించారు. పోలీస్‌శాఖ అదేశాలను మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించే పోలీస్ సిబ్బంది వస్తుంటారని, వారి వద్ద ఉండే రిజిస్టర్ లో సంతకాలు చేయాలని సూచించారు. మండపాల వద్ద ఏ సమస్య ఉన్నా తమదృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషిచేస్తామని తెలిపారు.

## కరువు పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించాలి

కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ధర్నా

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** వర్షాభావ పరిస్థితులతో నష్టపోతున్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపు మేరకు సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కె.మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతుల సమస్యలను పరిష్కరించాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, పత్తి, మిర్చి పంటలకు ఎకరాకు రూ.50 వేలు, కూరగాయల పంటలకు ఎకరాకు రూ.20 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలోని కరువు



ఉపసంఘం తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి, పంట నష్టాలు, వర్షాభావ పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన రైతులకు నష్టపరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో తాగునీరు, సాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులతో పాటు పశుసంపదను కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, జిల్లా అధ్యక్షుడు కె.మాధవరెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి భానూరు సుభాన్‌రెడ్డి, ఎం.సుధాకర్‌గౌడ్ నాయకత్వంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు కె.కృష్ణచారి, బి.కిష్టయ్య, కె.మాణిక్యప్ప, వీరాండి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## నీటి వనరులకు అనుగుణంగా పంటల సాగు

కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడటంతో పాటు, రాబోయే రబీ సీజన్‌లో అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తులో ఏర్పడే పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అన్ని రైతు వేదికల ద్వారా రైతు నేస్తం కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఢిల్లీ నుంచి పాల్గొన్న ఉపముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, తదితరులు రాష్ట్ర రైతాంగాన్ని ఉద్దేశించి మాట్లాడిన సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ రైతు వేదిక నుంచి కలెక్టర్ నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిసెట్టి, సంబందిత జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పంటల సాగు కోసం పెట్టుబడులు పెట్టిన రైతులకు నష్టం తగ్గించేలా ప్రస్తుత పంటలను సాధ్యమైనంతవరకు కాపాడాలన్నారు. సాగునీటి కోసం బోరుబావులపై ఆధారపడుతున్న నేపథ్యంలో విద్యుత్, భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. వచ్చే వేసవి వరకు ప్రజలకు, పశువులకు తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, గ్రామ పంచాయతీల పరిధిలోని పాత తాగునీటి పథకాలు, బోర్లు,మోటార్లను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. రబీ సీజన్‌లో రైతులు తొందరపడి పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవద్దని కలెక్టర్ సూచించారు. బోరుబావుల్లో నీటి మట్టాలు, అందుబాటులో ఉన్న సాగునీరు, పంటలకు అవసరమయ్యే నీటిని అంచనా వేసుకొని ప్రణాళిక రూపొందించుకోవాలని, అవసరమైతే పంటలసాగు విస్తీర్ణాన్ని తగ్గించుకోవాలని, నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ, స్వల్పకాలిక పంటలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న మార్కెట్ అవకాశాలను వినియోగించుకొని ఆకుకూరలు, ఇతర స్వల్పకాలిక పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు.




**ఉపాధి పనులతో నీటి సంరక్షణకు ప్రాధాన్యం...**పంటలు సాగు చేయలేని ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేలా గ్రామీణ ఉపాధి పనులను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షపు నీరు వృథాగా పోకుండా భూగర్భ జలాల పెంపునకు దోహదపడే పనులను గుర్తించి చేపట్టాలని సూచించారు. వ్యవసాయ,గ్రామీణ నీటి సరఫరా, పశుసంవర్ధక, ఉద్యానవన శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుజాత, డిపిఓ వి.సురేష్ మోహన్, పిడి డిఆర్‌డిఏ ఎల్.శ్రీలత, ఉద్యానవన శాఖ అధికారి కె.సురేష్, మిషన్ భగీరథ అధికారి ఆర్.రాజేశ్వర్‌రావు, పశుసంవర్ధకశాఖ అధికారి, ఆర్‌డిఓ శ్రీనివాస్‌రెడ్డి, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## సురక్షితమైన తాగునీరు అందించాలి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజలకు సురక్షితమైన తాగునీరు అంధించేందుకు నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప సూచించారు. సోమవారం మున్సిపాలిటి పరిధిలోని 7వ వార్డులో వైస్ చైర్మెన్ అందె మోహన్ ముదిరాజ్, కౌన్సిలర్ కొప్పునూరి ప్రవీణ్‌లతో కలిసి శ్రీ దుర్గా చికెన్ సెంటర్, ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు, మెరుగైన సేవలు అంధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, రఘునాయక్, కౌన్సిలర్లు కొప్పునూరి ప్రవీణ్, బిఎన్ సుదీర్, బాల్‌రాజ్ గౌడ్, శ్రీను నాయక్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

## ఎండిన పంటకు పరిహారం ఇవ్వాలి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఎలినో ప్రభావం, విద్యుత్ కోతల కారణంగా ఎండిపోతున్న పంటలను పరిశీలించి రైతులకు తగిన పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ పొలాల వద్దకు వెళ్ళి పరిశీలించి పంట నష్టం వివరాలతో నివేధిక తయారు చేసి ప్రభుత్వానికి అంధించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో జడ్పివైస్ చైర్మెన్ ఈట గణేష్, కొందుర్గు సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, మాజీ మార్కెట్ కమిటి చైర్ పర్సన్ మన్నె కవిత నారాయణ, మాజీ జడ్పిటిసి బంగారు రాములు, మండల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, హాఫీజ్, లక్ష్మణ్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్, సర్పంచులు మోహనచారి, సోని శేఖర్, నాయకులు పోతురాజు గోపాల్, కొండి యాదయ్య, వెంకటేష్, సత్య ప్రమోద్ పంతులు, దానగల్ల రాములు, ఆకుల మాణయ్య, రెడ్డి నర్సింలు, దర్గా రామచంద్రయ్యలు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/కేశంపేట:** ప్రజల సౌకర్యార్థం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ బీస కవిత కరుణాకర్‌రెడ్డిలు ప్రారంభించారు. సోమవారం కేశంపేట మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలోని బిసి కాలనీలో గ్రామ పంచాయతీ నిధులు రూ.4.50లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవినాయక్, వార్డు సభ్యులు లచ్చిరాంనాయక్, పొగుల నర్సింలు, నరేష్, కావలి వసంత, చాపల కృష్ణమ్మ, కందెన సంతోష శివయ్య, నాగిళ్ల ప్రేమలత యాదయ్య, మాజీ ఎంపిటిసి రంగయ్య, నరసింహారెడ్డి, గుత్తి శేఖర్, లాలమోని చంద్రయ్య, రాఘవచారి, రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, గుత్తి పాపయ్య, అంతయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

## కంది సాగులో రైతుకు లాభాలు



**ప్రజాపక్షం/షాబాద్:** కంది సాగులో రైతులకు అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని చర్లగూడగ్రామంలో వివిధ గ్రామాల రైతులతో కలిసి మిషన్ ఫర్ ఆత్మనిర్బరత్ ఇన్ పల్సెస్ (ఎంఏఎస్‌పి) పథకం కింద రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శివతేజ, రాజేశ్వరి, శైలజ, బలరాం,సర్పంచ్ పెంటయ్య, ఫెడ్ ఫార్మర్ ప్రోడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సిఇఒ కందివనం చంద్రశేఖర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** డెంటల్ క్లినిక్ ద్వారా క్రమబద్ధంగా దంతాలను సంరక్షణ తీసుకోవడం వలన మీ నోటి ఆరోగ్యానికి కాకుండా పూర్తి శరీర ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని డాక్టర్. అక్షయ్ తెలిపారు. సోమవారం హస్తినాపురం డివిజన్‌లోని చైతన్య నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పివికె డెంటల్ క్లినిక్‌ను మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యతమైన సేవలు అందించాలని, వారి నుంచి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ( కార్యక్రమంలో రాజేంద్ర ప్రసాద్, పాశం జీవన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, కటాం శేఖర్ గౌడ్, శివ క్రిష్ణ పాల్గొన్నారు.

## శంకర్‌పల్లి, మోకిల పిఎసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి,:**శంకర్‌పల్లి, మోకిల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నూతన పాలకవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. శంకర్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా బొల్లారం వెంకట్ రెడ్డి తో పాటు వైస్ చైర్మన్ పార్శి బాలకృష్ణ, 11 మంది డైరెక్టర్‌లతో సంఘం సిఈఓ రామ్ రెడ్డి ప్రమాణ స్వీకారం నిర్వహించగా, మోకిల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా గౌండ్ర సత్యం , 12 మంది డైరెక్టర్‌లతో సంఘం సిఇఒ వేణు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ శాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్‌పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి, సర్పంచ్‌లు సురేందర్‌గౌడ్, చిట్టెంపల్లి శేఖర్, లక్ష్మణ్ నాయక్, అజీజ్, రవీందర్ రెడ్డి, గోపాల్, చేకూర్త గోపాల్ రెడ్డి, వై.ప్రకాష్ గుప్తా పాల్గొన్నారు.

## సౌదీ-హౌతీ చర్చలకు సహకరిస్తాం: ఇరాన్

**టెహ్రాన్:** సౌదీ అరేబియాలో మరో కీలక విమానాశ్రయంపై హౌతీ సైన్యాలు భీకర దాడి చేశాయి.ఒకవైపు హౌతీల దాడులు జరుగుతుంటే మరోవైపు ఇరాన్-సౌదీ అరేబియా విదేశాంగమంత్రుల మధ్య సోమవారం ఫోన్ సంభాషణ జరిగింది. పెను యుద్ధంలో నిమగ్నమైన సౌదీ అరేబియా-హౌతీ తిరుగుబాటు సైన్యాలమధ్య చర్చలకు సహాయం చేస్తామని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీ సంసిద్ధత వ్యక్తం చేశారు.సౌదీ అరేబియా విదేశాంగమంత్రి ఫైజల్ బిన్ ఫర్హాన్,అబ్బాస్ అరాఘ్చీ మధ్య యుద్ధ పరిస్థితిపై ఫోన్ సంభాషణలు జరిగింది.రాజకీయ పరిష్కారాన్ని విస్మరించి సైనిక పరిష్కారానికే సిద్ధపడితే పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారిపోతాయని కూడా అబ్బాస్ అరాఘ్చీ సున్నితంగా హెచ్చరించారు.రోజు రోజుకూ పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగిపోతున్నాయని,వీటిని సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోరారు.ఈ ప్రాంతంలో జరుగుతున్న సంక్షోభాలకు సైనిక పరిష్కారాలు లేవని కూడా ఆయన స్పష్టం చేశారు. రాజకీయ పరిష్కారం సాధించడానికి,ఎలాంటి సహాయమైనా చేయడానికి ఇరాన్ సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

# హోర్ముజ్‌లో మరో చమురు ట్యాంకర్ దగ్ధం

### దొడ్డిదారిన వెళితే ఇదేగతి పడుతుంది: ఐఆర్‌జిసి హెచ్చరిక



**టెహ్రాన్:** హోర్ముజ్ జలసంధిలో చాలా తక్కువ సమయంలో మరో చమురు ట్యాంకర్ కూడా మంటల్లో దగ్ధమైపోయిందని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) సోమవారం ప్రకటించింది.తమ కళ్ళుగప్పి తాము నిర్దేశించిన అధికారిక మార్గాన్ని వదిలిపెట్టి దొడ్డిదారిన తప్పించుకువెళ్ళాలని ఒక భారీ చమురు ట్యాంకర్ ప్రయత్నం చేసిందని,కానీ ప్రయత్నం విఫలమైందని ఐఆర్‌జిసి స్పష్టం చేసింది. సముద్రంలో తాము ఏర్పాటు చేసిన మందుపాతరను ఢీకొని చమురు ట్యాంకర్ మంటల్లో దగ్ధమైపోయిందని,హోర్ముజ్ జలసంధి ఎప్పటికీ తమ అధీనంలోనే ఉంటుందని ప్రకటించింది.7.50 లక్షల బ్యారెళ్ళ చమురు లోడుతో వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ ఆదివారం మధ్యాహ్నం తమ కళ్ళుకప్పి వెళ్ళాలని ప్రయత్నం చేసి చివరకు మందుపాతరను ఢీకొని దగ్ధమైందని,ఈ విషయం అందరూ గుర్తుంచుకోవాలని ఐఆర్‌జిసి నౌకాదళ పబ్లిక్ రిలేషన్స్ విభాగం ఒక ప్రకటనలో తెలియజేసింది.హోర్ముజ్ జలసంధిలో తమ నావిగేషన్‌ను,గుర్తింపు వ్యవస్థలను స్తంభింపజేసి రహస్యంగా వెళ్ళాలనుకుంటే సాధ్యం కాదని,ఇలాంటి నౌకలను శత్రునౌకలుగా గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలియజేసింది.అంతకుముందు శనివారం(అక్టోబరు 10)కూడా వ్యూహాత్మక జలమార్గం ద్వారా ప్రయాణం చేయకుండా రహస్యమార్గంలో వెళుతున్న ఒక సూపర్ ట్యాంకర్ కూడా సముద్ర మందుపాతరను ఢీకొని మంటలు చెలరేగి దగ్ధమైపోయిందని గుర్తుచేసింది.నావిగేషన్‌ను నిలిపివేసి ఈ సూపర్ ట్యాంకర్ రహస్య ప్రయాణం చేయాలని ప్రయత్నంచేయడంవల్ల మంటల్లో దగ్ధమై చివరకు తీరప్రాంత నివాసితులకు సముద్రంలో మండిపోతూ కనువిందు చేసిందని విమర్శించింది.తాము విధించిన నిబంధనలను,భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించిన నౌకలకు ఇదే గతి పడుతుందని హెచ్చరించింది.

**హోర్ముజ్‌లో సాధారణ పరిస్థితిలేదు**
**ట్రంప్ వాదనకు బఖాయీ తిరస్కృతి**

హోర్ముజ్ జలసంధిలో సాధారణ పరిస్థితులు నెలకున్నాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న వాదనలను ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ తిరస్కరించారు.ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనాన్ని కొనసాగించినంతకాలం హోర్ముజ్ జలసంధిలో ఎప్పటికీ సాధారణ పరిస్థితులు తిరిగి వచ్చే అవకాశమేలేదని బఖాయీ స్పష్టం చేశారు.హోర్ముజ్‌లో నౌకాయానాన్ని కఠినంగా ఇరాన్ నియంత్రిస్తున్నప్పటికీ సాధారణ పరిస్థితి ఏర్పడిందన్న ట్రంప్ వాదనపై ఐఆర్ఎన్ఏ విలేకరి టెహ్రాన్‌లో జరిగిన వారాంతపు మీడియా సమావేశంలో బఖాయీని ప్రశ్నించినప్పుడు ఆయన పైవిధంగా స్పందించారు.వారు అలాంటి వాదనలే చేస్తారు,కానీ మా పని మేం చేసుకువెళతాం అని బఖాయీ చెప్పారు.ట్రంప్ వాదనలకు అంతర్జాతీయ మార్కెట్లు కూడా ఎలాంటి విలువా ఇవ్వడంలేదన్నారు. ఆధిపత్యంకోసం హోర్ముజ్ జలసంధిని ఇరాన్ స్తంభింపజేయలేదని,గడచిన ఫిబ్రవరిలో అమెరికా దాడుల పర్యవసానంగానే ఇలాంటి దుస్థితిని ప్రపంచదేశాలు ఎదుర్కొంటున్నాయని చెప్పారు.ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం,ఆర్థికయుద్ధం కొనసాగినంతకాలం హోర్ముజ్ జలసంధిలో భద్రత పునరుద్ధరణ సాధ్యంకాదన్నారు.దీనిని అమెరికా దురాక్రమణ చర్యగా ఆయన పేర్కొన్నారు. కాగా, ఇరాన్ ప్రతిపాదించిన ఏడు సూత్రాలపై అమెరికా అధికారికంగా ఇరాన్‌కు పంపించిన ప్రతిస్పందనను తమ పాలకవర్గం ఇంకా పరిశీలిస్తోందని చెప్పారు.ఈ సమీక్ష పూర్తయిన తర్వాత తమ స్పందనను మధ్యవర్తుల ద్వారాఅమెరికాకు చేరవేస్తామని చెప్పారు.అన్ని రంగాలలో తక్షణం శాశ్వత యుద్ధ విరమణ,పశ్చిమాసియా నుండి అమెరికా సేనల ఉపసంహరణ,ఇరాన్ ఆస్తుల విడుదల,ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం ఎత్తివేత వంటి అనేక డిమాండ్లు ఇరాన్ ప్రతిపాదించింది. దీనికి ట్రంప్ లిఖితపూర్వక ప్రతిస్పందన పంపించారు.

## ఆమోదించలేదు (మొదటి పేజీ తరువాయి)

పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఫామ్-6కు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని ఎన్నికల సంఘం పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఇసి ఏకపక్ష నిర్ణయాలపై చర్యలకు ఆదేశించాలని కోరారు. దీనిపై స్పందించిన జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, కొత్త ఫామ్-6పై ఎలాంటి న్యాయ నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. బిహార్ ఎస్ఐఆర్ వ్యవహారంపై గతంలో విచారణ జరిపినప్పుడు కొత్త ఫా మ్6 అంశం తమ ముందుకు రాలేదని ఆయన పేర్కొన్నారు. బిహార్ ఎస్ఐఆర్ అంశంలో మేలో సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. ఆ తీర్పులో ఫామ్-6ను ఎస్ఐఆర్ ధ్రువీకరణ ప్రక్రియకు మార్గదర్శకంగా పేర్కొంది. అప్పట్లో బిహార్‌లో ఉపయోగించిన ఫామ్-6 పత్రాల పరిశీలనకు ఒక విధానాన్ని నిర్దేశిస్తోందని వివరించింది. ధ్రువీకరణ ప్రక్రియకు ఎలాంటి మార్గదర్శకాలు లేకుండా పూర్తిగా అధికారుల వ్యక్తిగత నిర్ణయాలపై వదిలేయడం ఆచరణ సాధ్యం కాదని, 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల ప్రకారం రూపొందించిన ఫామ్6, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(2) కింద చేపట్టే ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియకు అనుగుణంగా ఉండాలని ఆ తీర్పులో పేర్కొన్నారు.

**ఎన్నికల సంఘం ప్రకటనపై చర్చ:** 2026 సెప్టెంబర్ 26న ఎన్నికల సంఘం ఒక ప్రకటనను విడుదల చేసింది. అందులో బిహార్ ఎస్ఐఆర్‌కు సంబంధించి 2026 మేలో ఇచ్చిన తీర్పులో ఫామ్6లోని ప్రకటనను సుప్రీంకోర్టు సమర్థించినట్లు పేర్కొంది. దాని ప్రకారం, కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వ్యక్తులు గతంలో నిర్వహించిన ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాలతో తమకు ఉన్న సంబంధాన్ని వివరించే అదనపు డిక్లరేషన్‌ను సమర్పించాల్సి వచ్చింది. దరఖాస్తుదారులు తాము, తమ తల్లిదండ్రులు లేదా తాతముత్తాతలు గత ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాల్లో నమోదై ఉన్నారా? అనే వివరాలు వెల్లడించాలి. ఈ వివరాల ద్వారా పాత ఓటర్ల జాబితాలతో అనుసంధానాన్ని గుర్తించే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం తప్పనిసరి చేశారు. ఈ ప్రక్రియను పూర్తి చేయకుండా ఫామ్6 దరఖాస్తులను సమర్పించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ మార్పులపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై అక్టోబర్ 5న విచారణ సందర్భంగా కూడా ప్రధాన న్యాయమూర్తి ఈ అంశంపై స్పందించారు. వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం ఉపయోగిస్తున్న ఫామ్6లో చేసిన మార్పులను తాము ఆమోదించలేదని తెలిపింది. ఫామ్-6 అనేది 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల షెడ్యూల్‌లో పొందుపరిచిన చట్టబద్ధమైన పత్రం. ఇందులో మార్పులు చేయాలంటే తగిన చట్టపరమైన ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని పిటిషన్‌లో వాదించారు. ఏకపక్షంగా పరిపాలనా నిర్ణయాల ద్వారా ఇటువంటి మార్పులు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

# ఇంధన వనరులపై రష్యా-ఉక్రేన్ దాడుల విరమణ

- తక్షణం అమలులోకి వస్తుందని ట్రంప్ ప్రకటన
- ఒప్పందాన్ని రష్యా ఉల్లంఘించిందని ఉక్రేన్ ఫిర్యాదు
- 60 రోజులు విరామం ఇస్తే ఎన్నికలు: జెలెన్స్కీ ప్రతిపాదన

**వాషింగ్టన్:** రష్యా-ఉక్రేన్ మధ్య ఇంధన వనరులపై దాడుల విరమణ ఒప్పందం తక్షణం అమలులోకి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోమవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. కానీ దీనిపై ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఒక ప్రకటన చేస్తూ,ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ రష్యా దాడులు కొనసాగిస్తూనే ఉందని పేర్కొన్నారు.ట్రంప్ ప్రకటన చేసిన కొద్ది గంటల్లోనే ఉక్రేన్‌లో విద్యుత్ ప్లాంటును రష్యా క్షిపణులు ధ్వంసం చేశాయని చెప్పారు.రష్యా తన దాడులను ఆపలేదన్నారు. కానీ ఉక్రేన్ కూడా చాపకింద నీరులాగా రష్యాలోని సుదూర ప్రాంతాలలో ఉన్న లక్ష్యాలను దెబ్బతీస్తూ ఆ దేశానికి తీవ్ర ఆర్థికనష్టం కలిగిస్తోంది.గడచిన మూడు రోజుల్లో నాలుగు కీలక డేటా సెంటర్లను ఉక్రేన్ డ్రోన్లు ధ్వంసం చేయడంతో అనేక రష్యా నగరాలలో సమస్యలు తలెత్తాయి.

రష్యా-ఉక్రేన్ దేశాలు ఇంధన వనరులు,విద్యుత్ కేంద్రాలు,సరఫరా వ్యవస్థలపై పరస్పర దాడులు నిలిపివేయాలని కొద్ది నెలలక్రితమే ట్రంప్ ప్రతిపాదన చేశారు. ఈ తర్వాత రష్యా ఇంధన కేంద్రాలపై ఉక్రేన్ డ్రోన్ దాడులు విపరీతంగా పెరిగిపోయాయి.రెండు రోజుల క్రితం రష్యా డీజిలును దిగుమతి చేసుకోవడానికి పుతిన్‌తో ట్రంప్ ఒక ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందం తర్వాత జెలెన్స్కీని పదవి నుండి తొలగించడానికి సమయం ఆసన్నమైందని ప్రకటించారు. రష్యా యుద్ధాన్ని నిలువరించడంలో జెలెన్స్కీ విఫలమయ్యారని ట్రంప్ ఆరోపించారు కానీ రష్యా నుండి డీజిలు దిగుమతులు చేసుకోవాలంటే ముందుగా రష్యాలోని చమురు శుద్ధి కేంద్రాలపై దాడులు నిలిచిపోవాలి. రష్యా ఇంధన వనరులపై దాడులు ఆపకపోతే ఉక్రేన్‌కు ఆయుధ సరఫరా,ఇంటిలిజెన్స్ షేరింగ్ నిలిపివేస్తామని కూడా ట్రంప్ హెచ్చరించారు. రష్యా నుండి తక్షణం 3,00,000 లక్షల బ్యారెళ్ళ డీజిలు దిగుమతి చేసుకోవడానికి, నవంబరునెలలో 5,00,000 బ్యారెళ్ళ డీజిలు దిగుమతికి ఆ తర్వాత క్రమంగా 10,00,000 బ్యారెళ్ళ డీజిల్,ముడి చమురు దిగుమతికి పుతిన్‌తో ట్రంప్ ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం రష్యా సరఫరాలు చేయలంటే ఆ దేశంలో చమురు శుద్ధి కర్మాగారాలపై ఉక్రేన్ దాడులు చేయకూడదు. అందుకే ట్రంప్ తక్షణం ఇంధన వనరులపై దాడుల విరమణ ఒప్పందం అమలులోకి వస్తుందని ప్రకటించారు.

### పుతిన్‌కు అదనపు లాభం-కొత్త విజయం

ఇదిలా ఉండగా, ఎలాంటి ప్రతిఫలం ఇవ్వకుండానే ట్రంప్‌తో పుతిన్ డీజిలు ఒప్పందం చేసుకున్నారని, ఇది రష్యాకు గొప్ప విజయమని బ్రిటన్ పత్రికలు ప్రశంసించాయి. ఆపదలో ఉన్న ట్రంప్‌కు వ్యక్తిగతంగా విజయం సాధించడానికి పుతిన్ సహకరిస్తున్నారని, ఈ సహాయంవల్ల అమెరికా-ఉక్రేన్ మధ్య ఉద్రిక్తతలు మరింత లోతుగా పెరుగుతాయని విశ్లేషకులు పేర్కొన్నారు.అమెరికాకు డీజిలు విక్రయాల ద్వారా పుతిన్ ఊహించని అదనపు రెవెన్యూ కూడగట్టుకుంటున్నారని, ఇది ఉక్రేన్‌కు పెద్ద సమస్యగా మారుతుందని పేర్కొన్నారు. కాగా రాబోయే రెండు వారాలలో ట్రంప్ ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ రష్యాలో పర్యటించనున్నారు. ఈలోపు రష్యాపై ఉక్రేన్ వైఖరి ఏమిటో వారు స్పష్టంగా తెలుసుకుంటారు.ఐతే ఈ ఒప్పందానికి తాము కట్టుబడి ఉంటామని,రష్యా దాడులు చేయకుండా నిలువరించాలని ట్రంప్‌ను జెలెన్స్కీ కోరారు. అదేవిధంగా రష్యా గనుక 60 రోజులు పూర్తిగా కాల్పులు, దాడులను విరమిస్తే, ఉక్రేన్‌లో సార్వత్రిక ఎన్నికలు నిర్వహిస్తానని కూడా జెలెన్స్కీ కొత్త ప్రతిపాదన చేశారు. జెలెన్స్కీని పదవి నుండి తప్పించే సమయం ఆసన్నమైందని ట్రంప్ ప్రకటించిన తర్వాత ఉక్రేన్ అధ్యక్షుడు ఈ ప్రతిపాదన తెరమీదకు తెచ్చారు. దీనిపై క్రెమ్లిన్ ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ వెంటనే సోమవారం స్పందిస్తూ, నిజంగా ఉక్రేన్‌లో ఎన్నికలు నిర్వహిస్తే, ఎన్నికల రోజున పూర్తిగా దాడులు నిలిపివేయడానికి పుతిన్ సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సుప్రీం కమాండర్‌కు ఉత్తర్వులు ఇచ్చేందుకు పుతిన్ సిద్ధంగా ఉన్నారని, కానీ జెలెన్స్కీ నిజంగా ఉక్రేన్‌లో ఎన్నికలు నిర్వహిస్తారా? అనేదే సందేహాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు. 60 రోజులు యుద్ధ విరమణ ప్రకటించాలని చేసిన ప్రకటనపై రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావరోవ్ స్పందిస్తూ, 60 రోజులపాటు యుద్ధ విరామం పొందే అర్హత ఉక్రేన్‌కు లేదని విమర్శించారు.కాల్పుల విరమణ సమయంలో కూడా దాడులు చేయడానికి వీలుగా ఉక్రేన్‌కు యూరప్ దేశాలు ఆయుధాలు అందిస్తాయని అన్నారు. జెలెన్స్కీ విరామం కోసం ఎలాంటి అవకాశాన్నైనా వాడుకుంటారన్నారు. ఆయనకు హామీలు ఇవ్వడానికి రష్యా సిద్ధంగా లేదన్నారు.

## ప్రజాస్వామ్య యాత్ర

(మొదటి పేజీ తరువాయి)

(ఎన్‌సిపి-ఎస్‌సిపి) నాయకురాలు సుప్రియా సూలే,శివసేన-యుబిటి నాయకుడు సంజయ్ రౌత్,భారత కమ్యూనిస్టుపార్టీ(సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా,జార్ఖండ్ ముక్తీ మోర్చా ఎంపి మహువా మాఝీ,సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ,ఇండియన్ యకూనియన్ ముస్లిం లీగ్(ఐయుఎంఎల్) నాయకుడు ఇ.టి.మహ్మద్ బషీర్‌లు కూడా ఈ పిటిషన్ దాఖలు చేసినవారిలో ఉన్నారు. సుప్రీంకోర్టు వెబ్‌సైటు చెప్పిన సమాచారం ప్రకారం సోమవారం సాయంత్రం ఈ పిటిషన్ దాఖలైంది.ప్రతిపక్ష ఎంపీలు,నాయకులతోపాటు వేలాదిమంది కార్యకర్తలు కూడా ఈ ప్రజాస్వామ్య యాత్రలో పాల్గొన్నారు.ఈ యాత్రలో వామపక్ష నాయకులు,సిపిఐ(ఎంఎల్) నాయకుడు దీపాంకర్ భట్టాచార్య,బషీర్ యాత్రలో పాల్గొన్నవారిలో ఉన్నారు.కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్,హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖువిందర్ సింగ్ సుఖు,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రజాస్వామ్య యాత్రలో పాల్గొన్నవారిలో ఉన్నారు. ఇండియా కూటమి తరపున వేలాదిమంది కార్యకర్తలు,నాయకులు యాత్రలో చేరారు. వీరంతా ముందుగా కాన్స్టిట్యూషన్ క్లబ్ వద్ద గుమిగూడారు.బరఖాంబ రోడ్ జంక్షన్ వైపు వెళ్ళి ప్రజాస్వామ్య యాత్రలో చేరారు.అంతకుముందు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కాంగ్రెస్ నాయకుల విజ్ఞాపన పత్రం స్వీకరించి వారితో సమావేశం జరిపేందుకు తిరస్కరించారు.ఈ మేరకు కాంగ్రెస్‌పార్టీ నాయకులకు లిఖితపూర్వకంగా తిరిగి సమాధానం పంపించారు.రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా అత్యున్నత చట్టబద్ధ వ్యవస్థలు ఎవరి విధులు వారే నిర్వహించాలని,మరొకరి విధుల్లో జోక్యం చేసుకోకూడదని,ఈ స్థాపిత విలువలకు అనుగుణంగా తాను సమావేశాన్ని తిరస్కరిస్తున్నానని జస్టిస్ సూర్యకాంత్ తన లేఖలో కాంగ్రెస్‌వారికి తెలియజేశారు.రాహుల్‌గాంధీ,మల్లిఖార్జునఖర్గే ఇద్దరు భారత ప్రధాన న్యాయమూర్తికి అక్టోబరు పదో తేదీన ఒక లేఖ రాశారు.ఓట్‌చోరీతోపాటు ప్రజాస్వామ్య విలువలు,భావప్రకటనాస్వాతంత్ర్య హక్కుల అణచివేత,ప్రజానిరసన అణచివేతపై విజ్ఞాపన పత్రం సమర్పించేందుకు సమావేశం కోసం సమయం ఇవ్వాలని కోరుతూ లేఖ రాశారు. ఈ విజ్ఞప్తిని భారత ప్రధాన న్యాయమూర్తి తిరస్కరించారు.

**నినాదాలతో దద్దరిల్లిన ఢిల్లీ ప్రధాన వీధులు**

ఓట్‌చోరీ,జ్ఞానేశ్ కుమార్ అక్రమాలకు,ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు వరకూ సోమవారం నిర్వహించిన భారీ ప్రదర్శన దేశంలో ప్రతిపక్షాల సత్తాను,శక్తిసామర్థ్యాలను చాటి చెప్పింది.ప్రతిపక్ష దిగ్గజ నాయకులు ఈ ప్రతిష్ఠాత్మకమైన యాత్రలో పాల్గొన్నారు.ప్రజాస్వామ్యంకోసం ఈ యాత్ర చేస్తున్నాం,ఇది ప్రజాస్వామ్య యాత్ర అని ప్రతిపక్ష నాయకులు చాటి చెప్పారు.ఈ యాత్రామార్గంలో అడుగడుగునా భారీస్థాయిలో పోలీసులు బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు.భగవాన్‌దాస్ రోడ్ వద్ద పోలీసులు ఈ యాత్రను అడ్డుకున్నారు.సుప్రీంకోర్టువరకూ దిగ్గజ నాయకులను వెళ్ళనీయకుండా నిలిపివేశారు.ఐనాగానీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేసే ప్రక్రియ నిలిచిపోలేదు. యథాతథంగా సుప్రీంకోర్టులో ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా పిటిషన్‌ను ప్రతిపక్ష నేతల తరపున ప్రతినిధులు దాఖలు చేశారు.రాహుల్ గాంధీ,ప్రియాంకాగాంధీ, మల్లిఖార్జునఖర్గే, డి.రాజా(సిపిఐ),ఎం.ఎ.బేబీ(సిపిఐఎం), దీపాంకర్ భట్టాచార్య(సిపిఐ-ఎంఎల్)తోపాటు టిఎంసి, ఎన్‌సిపి, ఎస్‌సిపి, సమాజ్‌వాదీపార్టీ, ఆర్‌జెడి తర ప్రతిపక్ష నాయకులు ఈ ప్రజాస్వామ్య యాత్రలో పాల్గొన్నారు.కాంగ్రెస్ నాయకులు శశిథరూర్,సచిన్ పైలట్,ముకుల్ వాస్నిక్,టిఎంసి నాయకుడు సాగరిక ఘోష్,యోగేంద్ర యాదవ్,నందితా నారాయణ్ తదితరులు కూడా యాత్రలో చేరారు.ఓట్‌చోరీని ఆపేయాలని,సర్ ప్రక్రియను నిలిపివేయాలని,జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని,ఆయన న్యాయ విచారణ ఎదుర్కోవాలన్న తమ డిమాండ్‌ను ఈ ప్రజాస్వామ్య యాత్ర ద్వారా వారు బలంగా వినిపించారు.ఢిల్లీ ప్రధాన వీధుల్లో,యాత్రా మార్గంలో వేలాదిమంది కార్యకర్తలు,నాయకులు ఎన్నికల సంఘాధినేతకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కదిలారు. గడచిన వారం రోజులుగా ప్రపంచ మీడియా దృష్టి అంతా భారతదేశ ప్రధాన స్రవంతి రాజకీయాలపైనే కేంద్రీకరించింది. దేశ దేశాల కీలక మీడియా వ్యవస్థలు,ప్రధాన పత్రికలలో మోదీకి వ్యతిరేకంగా,ఆయన అనుచరుడుగా మారిన జ్ఞానేశ్ కుమార్ అక్రమాలకు వ్యతిరేకంగా పుంఖాను పుంఖాలుగా వార్తలు వెలువడుతున్నాయి. జ్ఞానేశ్ కుమార్ వెనుక మోదీ అజ్ఞాతంగా ఉన్నారా? అనే విషయంపై కూడా విశ్లేషణలు వెలువడుతున్నాయి.

# ఓటు హక్కు పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమం

- ఢిల్లీలో మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకునేందుకు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సిఎం ఆందోళ న వ్యక్తం చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్, ఇండియా కూటమి తమ పోరాటాన్ని కొనసాగిస్తాయని సిఎం స్పష్టం చేశారు. 'ఓటు బచావో.. దేశ్ బచావో' ఆందోళనలో భాగంగా ఢిల్లీ తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్, ఎఐసిసి పరిశీలకులు సచిన్ సావంత్, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, ఇతర ముఖ్య నా యకు లు పాల్గొన్నారు. ఆనాడు స్వాతంత్ర్యం కోసం 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం సాగిందని, ఇప్పుడు ఓటు హక్కును కాపాడుకునేందుకు 'జ్ఞానేశ్ గో బ్యాక్', 'ఎస్ఐఆర్ గో బ్యాక్' నినాదాలతో ఉద్యమించాలని సిఎం అన్నారు. భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి, ఓటర్ల జాబి తా సవరణ పేరుతో ప్రజల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని సిఎం ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం దేశ ప్రజలకు ఓటు అనే శక్తిమంతమైన ఆయుధాన్ని అందించిందన్నారు. రాజరిక, కుటుంబ పాలనలకు ముగింపు పలికి ప్రజల చేతిలో అధికారం పెట్టడంలో ఓటు హక్కు కీలక పాత్ర పోషించిందని సిఎం తెలిపారు. గతంలో సర్ ప్రక్రియను ప్రజలకు మేలు చేసే చర్యగా చూశారని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం దాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. తమ అధికారానికి అడ్డుగా ఉన్న రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో ఇడి, సిబిఐ, ఆదాయపు పన్ను శాఖ, నా ర్కోటిక్స్ విభాగం వంటి సంస్థలను ఉపయోగించుకుందని, ఇప్పుడు వాటితో రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడం కష్టమవుతోందనే ఉద్దేశంతో ఎస్ఐఆర్‌ను తెరపైకి తెచ్చారని సిఎం విమర్శించారు. ఇసి ఐ ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి మోదీ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని నడిపిస్తోందని ఆరోపించారు.

**మోదీ, అమిత్ షాల మౌనం ఎందుకు?**

జ్ఞానేశ్ కుమార్ నియామకంలో ఎలాంటి కుట్ర లేదని మోదీ, అమిత్ షాలు భావిస్తే, ఆయనను తొలగించాలనే డిమాండ్లపై ఎందుకు స్పందించడం లేదని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వారు ఎందుకు అండగా నిలుస్తున్నారో సమాధానం చెప్పాలని సిఎం డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేపడితే ఎందుకు అడ్డుకుంటున్నారని, నిరసనలను ఎందుకు అణచివేస్తున్నారని సిఎం ప్రశ్నించారు. ఢిల్లీలో భారీగా పోలీసులను ఎందుకు మోహరిస్తున్నారో వివరించాలన్నారు. ఓటర్ల జాబితా సవరణలో పూర్తి పారదర్శకత ఉండాలని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని సిఎం డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పందించాలని, రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలు ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని సిఎం అన్నారు.

**దళితులు, గిరిజనులు, పేదల ఓట్లే లక్ష్యమా?**

దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల ప్రజల ఓటు హక్కులను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. దేశ యువత ఓట్లను తొలగించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని సిఎం మండిపడ్డారు. సోషల్ మీడియాలో బిజెపి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారిని లక్ష్యంగా చేసుకుని వారి ఓటు హక్కులను తొలగించే యోచనలో ఉందని సిఎం విమర్శించారు.

## రద్దు (మొదటి పేజీ తరువాయి)

ప్రకటనను విడుదల చేశారు. దీనికి బదులుగా నిరసనలు చేపట్టడానికి మూడు కొత్త ప్రదేశాలను ప్రకటించారు. ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ ఈనెల 11న ఈ ఉత్తర్వును జారీ చేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం రామ్‌లీలా మైదాన్, బురారీ గ్రౌండ్, సిబిడి గ్రౌండ్ కొత్త నిరసన ప్రదేశాలుగా నిర్ణయించారు. సెంట్రల్ జిల్లాలోని రామ్‌లీలా మైదాన్ ప్రస్తుత ప్రదేశం నుండి 4 కి.మీ దూరంలో ఉండగా, తూర్పు జిల్లాలోని సిబిడి గ్రౌండ్ 12-13 కి.మీ, ఉత్తర జిల్లాలోని బురారీ గ్రౌండ్ దాదాపు 21 కి.మీ దూరంలో ఉన్నాయి. 'ప్రస్తుతం ఉన్న నిర్దేశిత ప్రదేశం స్థానంలో, పౌరుల నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించే హక్కు కోసం తగిన ప్రత్యామ్నాయ వేదికలను పరిశీలించడానికి భారత ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ ఒక కమిటీని ఏర్పాటు చేసింది' అని ఆ ఉత్తర్వు పేర్కొంది. కమిటీ సిఫార్సుల ఆధారంగా, జంతర్ మంతర్‌ను నిరసన వేదికగా గుర్తించే హోదాను రద్దు చేసినట్లు అందులో తెలిపారు. 'రామ్‌లీలా గ్రౌండ్, బురారీ గ్రౌండ్, తూర్పు ఢిల్లీలోని సిబిడి గ్రౌండ్ అనే మూడు కొత్త ప్రదేశాలను నిరసనలు/ప్రదర్శనల నిర్వహణకు కొత్త వేదికలుగా నిర్ణయించారు' అని ఆ ఉత్తర్వు పేర్కొంది. అంతేకాకుండా, ఈ మూడు వేదికల వద్ద నిరసనలు, ప్రదర్శనల నిర్వహణకు సంబంధించిన సమగ్రమైన, సవరించిన ప్రామాణిక నిర్వహణ విధానం (ఎస్ఒపి) విడిగా జారీ చేయబడుతుందని తెలిపి ంది.

**మోదీ, షాకు ఇక ప్రజాస్వామ్యంతో పనిలేదు : కాంగ్రెస్**

జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశంగా ప్రకటించడాన్ని రద్దు చేయడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలపై కాంగ్రెస్ సోమవారం విమర్శలు గుప్పించింది. వారికి ఇకపై ప్రజాస్వామ్యంతో సంబంధం లేదని, ఇదంతా 'డెమోకుర్సీ'కి సంబంధించిన విషయమని ఆరోపించింది. చారిత్రాత్మక జంతర్ మంతర్ ఇకపై ప్రజాస్వామ్యానికి నిత్యం ఊతం ఇచ్చే ప్రదేశంగా ఉండబోదనే విషయం, ప్రధానిహోం మంత్రి ద్వయాన్ని పట్టిపీడిస్తున్న తీవ్ర భయాందోళనకు స్పష్టమైన సంకేతమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ పేర్కొన్నారు. 'ఈ విషపూరిత జంట సంక్షోభంలో ఉంది. శాంతియుత ప్రజా నిరసనలను వారు ఎంత క్రూరంగా అణచివేశారో గత కొద్ది రోజులుగా మనం చూశాం' అని ఆయన ఎక్స్ ఛానెల్‌లో అన్నారు.

**ఇక దేశమంతా జంతర్‌మంతరే : సిజెపి**

ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసనలకు అధికారిక వేదికగా గుర్తించే హోదాను రద్దు చేయడాన్ని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) సోమవారం తీవ్రంగా విమర్శించింది. ఈ చర్యతో 'ఇక దేశమంతా జంతర్ మంతర్‌గా మారుతుంది' అని హెచ్చరించింది. జంతర్ మంతర్‌కు నిరసన వేదిక హోదాను తొలగించారు. అది ఇకపై నిరసన వేదిక కాదు, ఎందుకంటే ఆ పిరికి (మోదీ) నియంత దానిని ఇప్పటికే ఒక యుద్ధ క్షేత్రంగా మార్చేశారని మండిపడ్డారు. ఇక దేశమంతా జంతర్ మంతర్‌గా మారుతుంది అని సోమవారం దీప్కే ఎక్స్ వేదికగా వెల్లడించారు. మరొక పోస్ట్‌లో, ప్రధాని నరేంద్ర మోదీ తదుపరి చర్యగా ప్రజాస్వామ్య హోదాను కూడా రద్దు చేయవచ్చు అని దీప్కే వ్యాఖ్యానించారు. నేడు మోదీ జంతర్ మంతర్ నిరసన వేదిక హోదాను రద్దు చేశారని, రేపు ఆయన ప్రజాస్వామ్యాన్నే రద్దు చేయవచ్చన్నారు. జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశం హోదా నుండి తొలగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆమోదయోగ్యం కాదు అని, తాము ఈ ఏకపక్ష నిర్ణయాన్ని అంగీకరించబోమని సిజెపి సహకన్వీనర్ సౌరవ్ దాస్ సోమవారం అన్నారు. నరేంద్ర మోదీకి జంతర్ మంతర్ అంటే ఎందుకు భయం అని దాస్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. 'జంతర్ మంతర్ భారత ప్రజలది. హోం మంత్రిత్వ శాఖ భారత ప్రజలను సంప్రదించిందా? సంబంధిత వర్గాలను గానీ, ఏవైనా సంస్థలను గానీ సంప్రదించారా?' అని ఆయన ప్రశ్నించారు. ప్రధానమంత్రిపై విమర్శలు గుప్పిస్తూ, త్వరలోనే ప్రభుత్వం భారతదేశాన్ని ప్రజాస్వామ్య దేశం కాదనే స్థాయికి (ప్రజాస్వామ్య హోదాను రద్దు చేసేలా) మారుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. 'రాసి పెట్టుకోండి ప్రజలకు చెందిన జంతర్ మంతర్ హోదాను ఎలాగైతే రద్దు చేస్తున్నారో, అలాగే ప్రధానమంత్రి త్వరలో భారతదేశంలో ప్రజాస్వామ్య హోదాను కూడా రద్దు చేస్తారు. ఈ చర్య అటు వైపు వేస్తున్న అడుగు,' అని దాస్ అన్నారు. 'మేము ఈ ఏకపక్ష నిర్ణయాన్ని అంగీకరించము. ఇది నిరసన తెలిపే మరియు శాంతియుతంగా సమావేశమయ్యే ప్రజల ప్రాథమిక హక్కుపై దాడి. ఇప్పుడు దేశమంతా జంతర్ మంతర్‌గా మారుతోంది' అని ఆయన అన్నారు.

## నీరు... పొదుపు

(మొదటి పేజీ తరువాయి)

శాస్త్రవేత్తల సూచనలతో రైతులకు అవగాహన కల్పిస్తూ, పంట నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు.రాష్ట్రంలో ఇప్పటికే 315 మండలాల్లో అతి తక్కువ వర్షపాతం నమోదైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. సుమారు 15 లక్షల ఎకరాల మేర వరి సాగు విస్తీర్ణం తగ్గిందని తెలిపారు. యాసంగిలో వరి, పత్తికి బదులుగా తక్కువ నీటితో, స్వల్పకాలంలో చేతికొచ్చే ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. పప్పుదినుసులు, నూనెగింజల పంటల సాగును ప్రోత్సహించడంతోపాటు ఆరుతడి పంటల విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. ఎల్‌నినో పరిస్థితులపై చర్చించేందుకు అత్యవసర కేబినెట్ సమావేశం నిర్వహించి, కేంద్రానికి ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని తీసుకెళ్లే అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో గత వర్షాకాలంతో పోలిస్తే ఈసారి దాదాపు 20 శాతం లోటు వర్షపాతం నమోదైందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. కృష్ణా బేసిన్‌లో 270 టిఎంసిలకు బదులుగా 80 టిఎంసిలు, గోదావరి బేసిన్‌లో 150 టిఎంసిలకు బదులుగా 100 టిఎంసిల నీరు మాత్రమే వచ్చిందన్నారు. ప్రస్తుత నీటి లభ్యతతో వ్యవసాయానికి నీరందించే పరిస్థితి లేదని, రానున్న పది నెలల పాటు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో ప్రత్యేక వార్ రూమ్‌లు ఏర్పాటు చేస్తామని, ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపడతామని తెలిపారు.భూగర్భ జలమట్టాలు రోజురోజుకూ పడిపోతున్నందున వరి, పత్తి సాగు చేయవద్దని వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ సూచించారు. బిందు సేద్యంతో పామ్ తోటలు, కూరగాయలు, స్వల్పకాలిక పంటలను సాగు చేయవచ్చన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరుగుతున్నాయని, నవంబర్, డిసెంబర్ నెలల్లో పరిస్థితులు మరింత ఆందోళనకరంగా ఉండవచ్చని వాతావరణ శాఖ అధికారి డాక్టర్ స్రవంతి హెచ్చరించారు.జలాశయాల్లో నీటి లభ్యత తగ్గడంతో గత ఏడాదితో పోలిస్తే ఈసారి విద్యుత్ ఉత్పత్తి 25 శాతానికే పరిమితమైందని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలిపారు. సెప్టెంబర్ 30న రాష్ట్రంలో 19,892 మెగావాట్ల రికార్డు స్థాయి విద్యుత్ వినియోగం నమోదైందన్నారు. మరోవైపు, గత ఏడాది వివిధ ప్రాజెక్టుల ద్వారా 37.56 లక్షల ఎకరాలకు సాగునీరు అందించగా, ఈసారి ఎల్‌నినో ప్రభావంతో కేవలం ఏడు లక్షల ఎకరాలకే నీరందించినట్లు నీటిపారుదల శాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న జలాశయాల నీటిని 2027 జులై వరకు తాగునీటి అవసరాలకు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 1.39 కోట్ల పశువులు, జీవాలకు పశుగ్రాసం, నీటి వసతి కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తి తెలిపారు. డిసెంబర్ వరకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, అనంతర పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందిస్తామని పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ చెప్పారు. తక్కువ నీటితో పండే పెసలు, మినుములు, శనగలు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు, కుసుమ వంటి పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులు, వాతావరణ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన విశ్వవిద్యాలయం, పశుసంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వెస్టిండీస్‌తో నాలుగో టి–20కు భారత జట్టు



వెస్టిండీస్‌తో ఐదు టి–20ల సిరీస్‌లో పై చేయి సాధించిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. బుధవారం హైదరాబాద్ వేదికగా జరిగే నాలుగో టి–20లో పర్యాటక వెస్టిండీస్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. తొలి మూడు టి–20ల్లో రెండు గెలిచి ఒకటి ఓడిన టీమిండియా 2–1 తేడాతో సిరీస్‌లో పైచేయి సాధించింది. హైదరాబాద్ వేదికగా జరిగే మ్యాచ్ కూడా గెలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. తద్వారా ఆఖరి మ్యాచ్‌లో బెంచ్ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలని భావిస్తోంది. మరోవైపు రెండో టి–20 తరహాలో పుంజుకొని విజయం సాధించాలనే పట్టుదలతో వెస్టిండీస్ ఉంది. తద్వారా ఐదు టి–20ల సిరీస్ రేసులో నిలవాలని భావిస్తోంది. హైదరాబాద్ పిచ్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండనున్న నేపథ్యంలో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**వైభవ్ సూర్యవంశీకి నిరాశే..** ఇండోర్ వేదికగా జరిగిన మూడో టి–20లో టీమిండియా రెండు మార్పులతో బరిలోకి దిగింది. ఎక్స్‌ట్రా పేసర్‌గా కుల్దీప్ యాదవ్ స్థానంలో ప్రిన్స్ యాదవ్‌ను ఆడించగా.. శివమ్ దూబే ప్లేస్‌లో ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డికి అవకాశం ఇచ్చారు. హైదరాబాద్ వేదికగా జరిగే నాలుగో టి–20లోనూ ఇదే కాంబినేషన్‌ను కొనసాగించే అవకాశం ఉంది. లోకల్ ప్లేయర్‌గా నితీష్‌ను కొనసాగించనున్నారు. ఎక్స్‌ట్రా స్పిన్నర్‌ను ఆడించాలనుకుంటే.. ప్రిన్స్ యాదవ్ స్థానంలో కుల్దీప్ యాదవ్ బరిలోకి దిగనున్నాడు.

**మూడో టి–20లో సంజూ శాంసన్ విఫలమైనా..** అతడినే కొనసాగించనున్నారు. హైదరాబాద్‌లో అతనికి మెరుగైన రికార్డ్ ఉంది. దాంతో వైభవ్ సూర్యవంశీకి నిరాశే ఎదురవ్వనుంది. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఇన్నింగ్స్ ప్రారంభించనుండగా.. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, నితీష్ రెడ్డి, నమన్ ధీర్ మిడిలార్డర్‌లో ఆడనున్నారు. అర్షదీప్ సింగ్ పేస్ బాధ్యతలను లీడ్ చేయనున్నాడు.

**వెస్టిండీస్‌తో రెండో టి–20కి భారత తుది జట్టు (అంచనా)...** సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), నితీష్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్/ప్రిన్స్ యాదవ్, అర్షదీప్ సింగ్, మయాంక్ యాదవ్

**వెస్టిండీస్‌తో టి–20 సిరీస్‌కు భారత జట్టు**
వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నమన్ ధీర్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్, నితీష్ కుమార్ రెడ్డి.

# అతను 5 బంతులాడితే టీమిండియా గెలుస్తుంది

### అభిషేక్ శర్మపై పుజారా ప్రశంసలు





టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మపై మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారా ప్రశంసల జల్లు కురిపించాడు. అభిషేక్ శర్మ 5 బంతులు ఓపికగా ఆడితే ప్రత్యర్థి కథ ముగుస్తుందని కొనియాడాడు. ముఖ్యంగా మూడో టి–20లో తనను ఇబ్బంది పెడుతున్న రోస్టన్ ఛేజ్‌ను అభిషేక్ శర్మ ఎదుర్కొన్న తీరు అద్భుతమని ప్రశంసించాడు.ఇండోర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ 30 బంతుల్లో 69 పరుగులు చేసి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ సిరీస్‌లో తనను ఇబ్బంది పెట్టిన రోస్టన్ ఛేజ్ బౌలింగ్‌లో అభిషేక్ శర్మ సంయమనం పాటించాడు. తన శైలికి భిన్నంగా 56 బంతులను ఓపికగా ఎదుర్కొన్నాడు. ఈ మ్యాచ్ గురించి ఓ క్రికెట్ వెబ్‌సైట్ షోలో మాట్లాడిన పుజారా.. అభిషేక్ శర్మ బ్యాటింగ్ తీరును కొనియాడాడు. 'అభిషేక్ శర్మ తన శైలికి భిన్నంగా 56 బంతులు ఓపికగా ఆడాడు. దూకుడుగా ఆడే అభిషేక్ శర్మ సంయమనంతో బ్యాటింగ్ చేయడం పెద్ద విషయం. ముఖ్యంగా ఛేజ్ బౌలింగ్‌ను ఓపికగా ఆడిన అభిషేక్ శర్మ.. ఆ తర్వాత తన సహజమైన శైలిలో చెలరేగిపోయాడు. 56 బంతుల్లోనే ప్రత్యర్థి కథను ముగించాడు. పిచ్ కండిషన్‌ను అందిపుచ్చుకొని పరుగులు చేయడానికి అవకాశాలు ఎక్కడ ఉన్నాయో అతను సరిగ్గా అంచనా వేసాడు.' అని పుజారా చెప్పుకొచ్చాడు. ఈ సిరీస్‌లో తొలి టి–20లో అభిషేక్ శర్మ 21 పరుగులు చేయగా..రెండో టి–20లో 20 పరుగులకు వెనుదిరిగాడు. కానీ మూడో మ్యాచ్‌లో అతను ప్రశాంతంగా ఇన్నింగ్స్ ప్రారంభించి 6 ఫోర్లు, 5 సిక్సర్లు కొట్టాడు. ఈ ఇన్నింగ్స్‌లో అంతర్జాతీయ క్రికెట్లో అత్యంత వేగంగా 2000 పరుగుల మైలురాయి అందుకున్న ఆటగాడిగా అభిషేక్ శర్మ వరల్డ్ రికార్డ్ సాధించాడు. 1164 బంతుల్లోనే అభిషేక్ 2000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో సూర్యకుమార్ యాదవ్ పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు.

## యువతరంగం

# కుటుంబంతో అధిక సమయం




దేశంలో జరుగుతున్న అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టడంలో ముందున్న యువత, కుటుంబంతో అధికసమయం గడిపే విషయంలోనూ ఆదర్శంగా వ్యవహరిస్తున్నారు. మన దేశంలో ఈ జనరేషన్ జెడ్ (జెన్ జి) యువత కుటుంబంతో కలిసి గడిపే సమయానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తాజా అంతర్జాతీయ సర్వే వెల్లడించింది. కుటుంబ సభ్యులతో సమయం గడపడం చాలా ముఖ్యమని 84 శాతం మంది భారతీయ 'జెన్ జి' యువత అభిప్రాయపడటం ఈ సర్వేలో నమోదైన ప్రధాన అంశం. పరిశీలనలో భాగమైన దేశాలన్నింటిలోనూ ఇదే అత్యధిక శాతంగా నిలిచింది. ఆధునిక జీవనశైలి, చదువులు, ఉద్యోగ బాధ్యతలు, డిజిటల్ పరికరాల వినియోగం పెరుగుతున్నప్పటికీ కుటుంబ బంధాల పట్ల భారతీయ యువతలో ఆసక్తి బలంగానే ఉందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. కుటుంబ సంబంధాల ప్రాధాన్యం తల్లిదండ్రులు, పిల్లలు, తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మల మధ్య కూడా స్పష్టంగా కనిపిస్తోంది. తమ తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలతో మరింత సమయం గడపాలని 76 శాతం మంది పిల్లలు కోరుకుంటున్నారు. ఇది సర్వేలో పాల్గొన్న దేశాల్లోనే అత్యధికం. మరోవైపు, 85 శాతం మంది తల్లిదండ్రులు తమసొంత తల్లిదండ్రులతో కనీసం వారానికి ఒకసారైనా సమయం గడుపుతుండగా, 65 శాతం మంది ప్రతిరోజూ వారిని కలుస్తున్నట్లు తెలిపారు. కుటుంబంలోని పెద్దలతో అనుబంధం భారతీయ సామాజిక జీవితంలో ఇప్పటికీ కీలక స్థానాన్ని కలిగి ఉందని ఈ వివరాలు తెలియజేస్తున్నాయి. అయితే, కుటుంబానికి ఇంతటి ప్రాధా న్యం ఇస్తున్నప్పటికీ, పిల్లలు ఆశించిన స్థాయిలో నాణ్యమైన కుటుంబ సమయాన్ని పొందడం లేదన్న విషయం ఆందోళన కలిగిస్తోంది. తమకు లభిస్తున్న కుటుంబ సమయంతో సంతృప్తిగా ఉన్నామని కేవలం 22 శాతం మంది భారతీయ పిల్లలు మాత్రమే చెప్పారు. సర్వేలో పాల్గొన్న దేశాలన్నింటిలో ఇది అత్యల్ప శాతం. అంటే కుటుంబంతో గడపాలనే ఆకాంక్ష బలంగా ఉన్నప్పటికీ, ఆ కోరికకు అనుగుణంగా పరిస్థితులు ఉండటం లేదని అర్థమవుతోంది. చదువులు, హోంవర్క్, పాఠశాల కార్యకలాపాలు కుటుంబ సమయాన్ని తగ్గిస్తున్న ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. 43 శాతం మంది పిల్లలు చదువులు, హోంవర్క్ కారణంగా కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపలేకపోతున్నట్లు తెలిపారు. పిల్లల బిజీషెడ్యూళ్లే కుటుంబ అనుబంధానికి అడ్డంకిగా మారుతున్నాయని 44 శాతం మంది తల్లిదండ్రులు, 54 శాతం మంది తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలు అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, బిజీగా ఉన్నప్పటికీ కుటుంబ సభ్యుల కోసం సమయం కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నామని 60 శాతం మంది పిల్లలు పేర్కొన్నారు. కుటుంబ జీవితంపై డిజిటల్ పరికరాల ప్రభావం మరో కీలక సమస్యగా ముందుకొచ్చింది. స్క్రీన్ టైమ్, డిజిటల్ పరికరాల కారణంగా కుటుంబ సభ్యుల మధ్య అనుబంధానికి లభించే అవకాశాలు తగ్గుతున్నాయని 70 శాతం మంది తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. పిల్లల్లో 45 శాతం మంది కూడా స్క్రీన్ వినియోగమే కుటుంబంతో ఎక్కువ సమయం గడపకుండా చేస్తున్న ప్రధాన కారణమని చెప్పారు. పిల్లలను కుటుంబ సభ్యుల కంటే డిజిటల్ తెరలే ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయన్న ఆందోళన వృద్ధుల్లోనూ కనిపిస్తోంది. మరోవైపు, పిల్లలు బాధలో ఉన్నప్పుడు తమ తల్లిదండ్రులు గుర్తిస్తారని 59శాతం మంది తెలిపారు. పిల్లల భావోద్వేగ అవసరాలను గుర్తించే విషయంలో కుటుంబాల పాత్ర ఇప్పటికీ బలంగా ఉన్నట్లు ఇది సూచిస్తోంది. పని పరిస్థితులు, విద్యా వ్యవస్థ, సాంకేతికత కుటుంబ జీవితానికి సహకరిస్తున్నాయని 80శాతం మంది తల్లిదండ్రులు భావించడం కూడా గమనార్హం. మొత్తంగా చూస్తే, భారతీయ కుటుంబాల్లో అనుబంధాలు బలంగా ఉన్నప్పటికీ, వాటిని మరింత అర్థవంతంగా కొనసాగించేందుకు సమయాభావం, చదువుల ఒత్తిడి, డిజిటల్ వినియోగం వంటి అంశాలు సవాళ్లుగా మారుతున్నాయి. కుటుంబంతో ఉండటం ముఖ్యమని భావించడం మాత్రమే సరిపోదు. పరస్పరం మాట్లాడుకోవడం, పిల్లల భావాలను అర్థం చేసుకోవడం, పెద్దల అనుభవాలకు విలువ ఇవ్వడం కూడా అంతే అవసరం. కుటుంబ సభ్యులంతా కలిసి గడిపే సమయాన్ని బాధ్యతగా కాకుండా ఆనందంగా మార్చుకోగలిగితేనే తరాల మధ్య బంధాలు మరింత బలపడతాయి.

## ఒక్క పెన్నీతో మొదలైన గొప్ప ఆలోచన



మైక్ హేస్ అందరిలా ఆలోచించలేదు. సమస్యకు తల వంచలేదు. కొత్త ఆలోచనతో ముందుకు అడుగు వేశాడు. 1987లో, అతని వయసు 18 ఏళ్లు. ఒక విద్యార్థి. యూనివర్సిటీ ఆఫ్ ఇలినాయిస్‌లో తన చదువుకు సుమారు 28,000 డాలర్లు అవసరం కాగా, 'ఎడ్యుకేషన్ లోన్' తీసుకోవడం అతనికి ఇష్టం లేదు. అందుకే 28లక్షల మంది ఒక్కొక్కరు కేవలం ఒక పెన్నీ చొప్పున ఇస్తే తన చదువు పూర్తవుతుందని భావించాడు. తన ఆలోచనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, ప్రముఖ కాలమిస్టు బాబ్ గ్రీన్ సహాయం కోరాడు. బాబ్ గ్రీన్ తన పత్రికా కాలమ్ ద్వారా మైక్ కథను పాఠకులతో పంచుకున్నాడు. ఇంటర్నెట్ లేని ఆ రోజుల్లో కూడా ఈ చిన్న విజ్ఞప్తి వేలాది మంది హృదయాలను ఆకర్షించింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 18 వేల మంది పెన్నీలు, నాణేలు, చిన్న మొత్తాల రూపంలో విరాళాలు పంపారు. అలా సేకరించి మైక్ తన విద్యను కొనసాగించాడు. చిన్న సహాయాలు ఒక్కటిగా చేరితే, అవి ఒకరి జీవితాన్ని మార్చగలంత పెద్ద శక్తిగా మారతాయనే వాస్తవాన్ని హేస్ ఉదంతం మనకు స్పష్టం చేస్తుంది.

# కరువు మండలాలు ప్రకటించాలి

**ఎల్‌నినో ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి**

**ఎకరాకు రూ.30వేల నుంచి రూ.50 వేల వరకు నష్టపరిహారం ఇవ్వాలి**

**కరువు పరిస్థితులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి**

**రాష్ట్ర రైతు సంఘం డిమాండ్**



భద్రాచలం...


వరంగల్

**ప్రజాపక్షం/వరంగల్ :** రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను అంచనా వేసి తక్షణమే కరువు మండలాలను ప్రకటించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. రైతు సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క మొగిళి, సహాయ కార్యదర్శి రాజారామ్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం వరంగల్ జిలా కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ కరువు వల్ల నష్టపోయిన రైతులకు పంటల వారీగా నష్టపరిహారం అందించాలన్నారు. రాష్ట్రంలో నీటి లభ్యత, సాగునీటి వనరుల పరిస్థితి, పంటల నష్టంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. కరువు పరిస్థితులపై సమగ్ర సర్వే చేపట్టాలని, రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని, దీంతో వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వరి సాగుతో పాటు ఇతర పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులపై ప్రభావాన్ని అంచనా వేసేందుకు సమగ్ర సర్వే నిర్వహించాలన్నారు. పంట నష్టపరిహారంగా ఎకరాకు రూ.30వేలు, పత్తి, మిర్చి పంటలకు రూ.50 వేలు, కూరగాయలు, ఇతర పంటలకు రూ.20 వేల చొప్పున పరిహారం అందించాలని, పంటలను రక్షించేందుకు కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరంగా సరఫరా చేయాలని, తాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని. పశువులకు మేత అందించే ఏర్పాట్లు చేయాలని, కరువు ఉపశమన చర్యలను గ్రామస్థాయి నుంచి అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, చిన్న, సన్నకారు రైతుల జీవనోపాధిపై కరువు ప్రభావాన్ని అధ్యయనం చేయాలన్నారు. పంటలు దెబ్బతిన్న రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని, నీటి పంపిణీ వ్యవస్థను ప్రభుత్వ నియంత్రణలో ఉంచి స్థానిక అవసరాలకు అనుగుణంగా న్యాయంగా నీటిని పంపిణీ చేయాలని పశ్య పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**భద్రాద్రికొత్తగూడెం :** ఎల్‌నినో ప్రభావంతో పాటు ప్రస్తుతం సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎక్కడికక్కడ ఎండిపోతున్నాయని, భద్రాద్రికొత్తగూడెం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ అనుబంధ రైతు సంఘం (ఎఐకెఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జెసి వేణుగోపాలరావుకు అందజేశారు. సంద్ర నరేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు కల్లూరి వెంకటేశ్వర రావు సలిగంటి శ్రీనివాస్ వి పూర్ణ చంద్రరావు, వైఎస్ గిరి గుర్రం వెంకటేశ్వర్లు రంజిత్ వాడే లక్ష్మీ ఇట్టి శ్రీనివాసరావు, రాజారావు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం :** రాష్ట్రంలో పరిస్థితులు దయనీయంగా మారాయని వ్యవసాయ కార్మికులకు ఉపాధి దొరకడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు అనుబంధం) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్‌లు తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్, నాయకులు మేళ్లచెరువు వీరబాబు, పిట్టల రాంబాబు, గోగుల ఆదినారాయణ పాల్గొన్నారు.

**వికారాబాద్ :** వర్షాభావ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు వికారాబాద్ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సావిత్రమ్మ, సుంకరి రాములు, చాకలి రవి, బాబు, సాయప్ప తదితరులు పాల్గొన్నారు.

**హుజూర్‌నగర్ :** ఎల్‌నినో ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం హుజూర్‌నగర్ ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్, మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్, ఎల్లావుల రమేష్, రైతు సంఘ పట్టణ అధ్యక్షులు జక్కుల రమేష్, నాయకులు సుందరి పద్మ, ఇందిరాల వెంకటేశ్వర్లు, జక్కుల రమణ పాల్గొన్నారు.

**కోదాడ :** వర్షభావం కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దొడ్డ వెంకటయ్య, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసరావుతో కలిసి ఆర్‌డిఒ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వేణుగోపాల్, గొట్టెముక్కల కోటి నారాయణ, వెంకటరావు, కనగాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మునగాల...


కోదాడ...


వికారాబాద్...


ఖమ్మం...

## కార్మికులపై పనిభారం తగ్గించాలి

**ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య**



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పడకలను పెంచి కార్మికులపై పనిభారం తగ్గించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, జిల్లా అధ్యక్షుడు సుధాకర్ డిమాండ్ చేఃఆరు. సోమవారం ప్రభుత్వ ఆస్పత్రి జిజిహెచ్‌లో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ రాములుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రికి ప్రతిరోజు వచ్చే అవుట్ పేషంట్స్ పెరగడంతో పాటు ఎంసిహెచ్ బిల్డింగ్‌లో పనితో సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగి అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. గతంలో ప్రభుత్వం వైద్యశాఖ నిర్ణయించిన ప్రకారం వెంటనే 750 పడకలకు బడ్జెట్‌ను పెంచి, సిబ్బందిపై పని భారం తగ్గించాలన్నారు. కార్మికుల టెండర్ కాలపరిమితి ముగిసి సంవత్సరం పూర్తయినందున ప్రభుత్వం హామీనిచ్చిన కార్పోరేషన్ ఏర్పాటు చేసి కార్మికుల వేతనాలు చెల్లించాలని, జాతీయ పండగ ఆర్జిత సెలవులు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భాగ్యలక్ష్మి, స్వరూప, భారతి, కవిత, సాయి, సునీత, సఫీయా, సానిటేషన్, కేర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసి సాయంతో బిజెపి ఓటు చోరీ

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు**




**ప్రజాపక్షం/మావల :** దేశంలో ఎలక్షన్ కమిషన్‌ను అడ్డుపెట్టుకుని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఆరోపించారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా మావల పట్టణంలో స్థానిక సిపిఐ కార్యాలయంలో బి.గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బిజెపి ఏజెంట్‌గా వ్యవహరిస్తూ ఏకపక్ష నిర్ణయాలతో 'సర్' ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని ఆరోపించారు. దళితులు, మైనార్టీలు, ఆదివాసీలు, ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఓటు హక్కును హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఢిల్లీలో ఓట్ల చోరీకి వ్యతిరేకంగా శాంతియుతంగా ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. వెంటనే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని, లేనిపక్షంలో దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని తక్కళ్లపల్లి హెచ్చరించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలపై తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులకు ప్రభుత్వంపై నమ్మకం లేకపోవడంతోనే ఇటీవల జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎఐటియుసి అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఘన విజయం కట్టబెట్టారన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని నిర్మాణపరంగా బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు, నాయకులు ఎస్.విలాస్, ముడుపు ప్రభాకర్‌రెడ్డి, ముడుపు నళినిరెడ్డి, సిర్ర దేవేందర్, ఎస్.ఉస్మాన్, కళ్లేపల్లి గంగయ్య, అరుణ్‌బాబు, కె.చంద్రమౌళి, కట్ట కృష్ణస్వామి, సి దేవిదాస్, ఇందూర్ నర్సింగ్, ఎఐవైఎఫ్ నాయకులు భాస్కర్, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు కేశవ్ పాల్గొన్నారు.

# పరస్పర అవగాహన ముఖ్యం

**సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా**



**ప్రజాపక్షం/పాల్వంచ :** యాజమానులు, వర్కర్ల మధ్య పరస్పర అవగాహన, సఖ్యత అత్యంత కీలకమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. పాల్వంచ పట్టణంలోని హోటల్ యాజమానులు, కార్మికులు, వివిధ పక్షాల ముఖ్య నాయకుల సమన్వయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సంధర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ కార్మికుల శ్రమ, యాజమానుల పాత్ర ప్రాధాన్యత కలిగినవని, ఇరువర్గాలు కుటుంబ సభ్యులుగా మెలగాలని పిలుపునిచ్చారు. పనిచేసే చోట అభిప్రాయ బేధాలు తలెత్తిన వాటిని అంతర్గతంగా, సామరస్యపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలే తప్పా మూడో పక్షం జోక్యానికి ఆస్కారం ఇవ్వకూడదని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే అందరికీ నష్టమేనన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఎం జిల్లా నాయకులు దొడ్డా రవికుమార్, సొసైటీ వైస్‌చైర్మన్ కాంపల్లి కనకేష్, బిఆర్‌ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షులు మంతపురి రాజుగౌడ్, కాంగ్రెస్ నాయకులు సాదం రామక్రిష్ణ, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కందగట్ల సురేందర్, భద్రాచలం పట్టణ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి.జిందా, వాసు, రాజు, పాల్వంచ హోటల్స్ యాజమానులు, కార్మికుల సంఘం అధ్యక్షులు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, ఉప్పుశెట్టి రాహుల్, హోటల్ యాజమానుల సంఘం నాయకులు వీరభద్రం, పోపుల నాగేశ్వరరావు, శ్రీను, ఎండి ఖాజా, రెడ్డి, సంక్రాంతి రవి, నాగవేణి, హోటల్ కార్మికులు వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీనివాస్, కాసింబీ, సశి, వెంకటమ్మ పాల్గొన్నారు.

## ఎసిబి వలలో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్, మండల సర్వేయర్

● లేఅవుట్ జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే నివేదిక కోసం రూ.20 లక్షల లంచం డిమాండ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) వలలో ఇద్దరు రెవెన్యూ అధికారులు చిక్కారు. అబ్దుల్లాపూర్‌మెట్ తహశీల్దార్ బి. సుదర్శన్ రెడ్డి, మండల సర్వేయర్ బాతుక శ్రీనివాసులు రూ.20 లక్షల లంచం వ్యవహారంలో ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. లేఅవుట్ అనుమతుల ప్రక్రియలో భాగంగా జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే నివేదిక జారీ చేసేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఎసిబి వెల్లడించింది. లేఅవుట్‌కు సంబంధించిన జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే నివేదిక ఇచ్చేందుకు తొలుత రూ.30 లక్షలు డిమాండ్ చేసి, చివరకు రూ.20 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎసిబి వివరించింది. తహశీల్దార్ బి.సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల సర్వేయర్ బాతుక శ్రీనివాసులు లంచం సొమ్మును స్వీకరిస్తుండగా ఎసిబి, సిఐయు అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి లంచం సొమ్మును ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సర్వేయర్ రెండు చేతుల వేళ్లకు నిర్వహించిన రసాయన పరీక్షలో పాజిటివ్ ఫలితం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో తహశీల్దార్, మండల సర్వేయర్‌ను అరెస్ట్ చేసి నాంపల్లిలోని ఎసిబి కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు.

**లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి**

ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని ఎసిబి అధికారులు తెలిపారు. ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు వెనుకాడకుండా ఎసిబి టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అవినీతికి సంబంధించిన సమాచారాన్ని ఎసిబి దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

## తెలంగాణలో కమ్యూనిటీ ఫుట్‌బాల్ అభివృద్ధికి లివర్‌పూల్ ఫౌండేషన్ సహకారం!

● గచ్చిబౌలిలో రౌండ్‌టేబుల్ సమావేశం..

● బాలికలు, యువతకు మరిన్ని అవకాశాలపై చర్చ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో ఫుట్‌బాల్‌ను క్షేత్రస్థాయి నుంచి అభివృద్ధి చేయడంతోపాటు, క్రీడల ద్వారా సామాజిక మార్పును తీసుకువచ్చేందుకు లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్ ఫౌండేషన్ సహకారాన్ని వినియోగించుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. కమ్యూనిటీ ఫుట్‌బాల్ విస్తరణ, బాలికలు, మహిళల భాగస్వామ్యం పెంపు, కోచ్‌లకు శిక్షణ, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్) నిధుల వినియోగం వంటి అంశాలపై సోమవారం గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆహ్వానం మేరకు హైదరాబాద్‌కు వచ్చిన లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్ ఫౌండేషన్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ కోలిన్ కాంటిని ఈ సమావేశంలో పాల్గొన్నారు. శాట్స్ వైస్ ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సోనిబాలాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఫుట్‌బాల్ క్లబ్‌ల ప్రతినిధులు, ఫౌండేషన్ల సభ్యులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, క్రీడాశాఖ అధికారులు పాల్గొన్నారు. భారత మాజీ అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులు విక్టర్ అమల్‌రాజ్, షబ్బీర్ అలీ తమ అనుభవాలను పంచుకున్నారు. 2002లో ఏర్పాటైన లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్ ఫౌండేషన్ క్రీడలతోపాటు విద్య, ఆరోగ్యం, జీవిత నైపుణ్యాలు, యువత అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన వంటి రంగాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కోలిన్ కాంటిని వివరించారు. ఈ అనుభవాలను తెలంగాణ అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే అవకాశాలపై చర్చించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లోని చిన్నారులు, యువతకు ఫుట్‌బాల్ అవకాశాలు కల్పించడం, మహిళలు, బాలికల భాగస్వామ్యాన్ని పెంచడం, స్థానిక కోచ్‌ల నైపుణ్యాలను మెరుగుపరచడంపై దృష్టి సారించారు. తెలంగాణలో ఫుట్‌బాల్ అభివృద్ధికి 'సాట్' చేస్తున్న కృషిని కోలిన్ కాంటిని అభినందించారు. రాష్ట్రంలో కమ్యూనిటీ ఫుట్‌బాల్, సామాజిక సమ్మిళితత్వం, క్రీడల ద్వారా సామాజిక అభివృద్ధి వంటి అంశాల్లో కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించేందుకు ఆసక్తి చూపారు. తెలంగాణలో ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు కొదవలేదని, లివర్‌పూల్ ఫౌండేషన్ అనుభవం రాష్ట్రానికి ఉపయోగపడుతుందని డాక్టర్ సోనిబాలాదేవి పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు, ఫుట్‌బాల్ క్లబ్‌లు, సీఎస్‌ఆర్ భాగస్వాములు, మాజీ క్రీడాకారులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ ఫుట్‌బాల్‌ను విస్తరించేందుకు ఈ సమావేశం తొలి అడుగు కానుందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జి.పల్గుణ, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, డాక్టర్ రవి తేజ, శ్రీనివాస్, అశోక్, జిఎంసి బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు, ప్రజా సంబంధాల అధికారి సురేష్ కాలేరు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి–మెట్రో కామన్ పాస్ చార్జీల పునఃపరిశీలన

● ప్రజలపై భారం తగ్గించేలా నిర్ణయం..

త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం: మంత్రి పొన్నం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి మెట్రో కామన్ పాస్ ఛార్జీలను ప్రజలకు అందుబాటులో ఉండేలా పునఃపరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత ధరలు అధికంగా ఉన్నాయంటూ ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి, ఛార్జీలపై సమీక్షించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్ ధర రూ.400గా ఉండగా, ఇందులో మెట్రో వాటా రూ.300, ఆర్‌టిసి వాటా రూ.100గా ఉంది. నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500గా నిర్ణయించారు. ఇందులో మెట్రో వాటా రూ.7వేలు కాగా, ఆర్‌టిసి వాటా రూ.1,500గా ఉంది. ఈ ధరలు సామాన్య ప్రయాణికులకు భారంగా మారుతున్నాయన్న అభిప్రాయాల నేపథ్యంలో ప్రభుత్వం పునఃసమీక్షకు సిద్ధమైంది. ప్రజల అభిప్రాయాలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ప్రయాణికులకు ఆర్థికంగా ప్రయోజనం కలిగేలా ధరలను నిర్ణయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆర్‌టిసి, మెట్రో సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకునేలా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా, అందుబాటు ధరలతో కామన్ పాస్ విధానం అమలయ్యేలా తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.



## ఓటర్ల జాబితా సవరణపై.. పౌరసంఘాల నిరసన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఎదుట రాజకీయ పార్టీలు, పౌర సమాజ సంఘాలు నిరసన చేపట్టాయి. ఓట్ల తొలగింపులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో పాటు పలు పౌర సంఘాల ప్రతినిధులు ధర్నాలో పాల్గొని ఎన్నికల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ధర్నా నేపథ్యంలో బిఆర్‌కె భవన్ పరిసరాల్లో పోలీసులు భారీగా మోహరించారు. నిరసనకారులను అడ్డుకునేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఆందోళనల ప్రభావంతో సిచివాలయం, లిబర్టీ, బషీర్‌బాగ్, ట్యాంక్‌బండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

## హరీశ్‌రావు మామకు ఊరట

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిద్ధిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్టలో బిఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు మామ మాధవరపు హనుమంతరావుకు చెందిన 3.22 ఎకరాల భూమి స్వాధీన వ్యవహారంలో బలవంతపు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు రెవెన్యూ అధికారులను ఆదేశించింది. భూమి స్వాధీనానికి సంబంధించి సెప్టెంబరు 29న జారీ చేసిన షోకాజ్ నోటీసును సవాలు చేస్తూ హనుమంతరావు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ శ్రవణ్‌కుమార్ విచారణ జరిపారు. నోటీసులకు పిటిషనర్ కౌంటర్‌ఇవ్వాలని స్పష్టం చేశారు, వాటిపై పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. తదుపరి విచారణను నవంబరు 2కు వాయిదా వేశారు.

## రాజ్యాంగ వ్యవస్థలపై కాంగ్రెస్ దాడి

● బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై నిరాధార ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్, 'ఇండీ' కూటమి ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నాయని బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో బోగస్ ఓట్ల తొలగింపును డిమాండ్ చేసిన కాంగ్రెస్ నేతలే ఇప్పుడు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వ్యతిరేకించడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టుపై ఒత్తిడి తీసుకురావాలనే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా చట్టబద్ధంగా, పారదర్శకంగా అధికార యంత్రాంగం సమక్షంలో జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియపై బహిరంగ చర్చకు బిజెపి సిద్ధంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా చర్చకు రావాలని సవాల్ విసిరారు.

## అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరీక్ష ఫలితాలు విడుదల

● ఈ నెల 17 నుంచి ధ్రువపత్రాల పరిశీలన..

అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రాసిక్యూషన్ సర్వీసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎపిపి) పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలను తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి సోమవారం విడుదల చేసింది. బోర్డు ఛైర్మన్ వి.వి. శ్రీనివాసరావు ఈ ఫలితాలను వెల్లడించారు. అభ్యర్థులు తమ వ్యక్తిగత లాగిన్ వివరాలతో అధికారిక వెబ్‌సైట్ www.tgprb.inలో ఫలితాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు. అర్హత సాధించిన అభ్యర్థులకు అక్టోబర్ 17 నుంచి ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నారు.

## ఆరోపణలు అవాస్తవం : ఎమ్మెల్యే పల్లా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ కిషన్ కుమార్ రెడ్డి భార్య సుజనా రెడ్డి తనపైన చేసిన ఆరోపణలు అవాస్తవమని, ఆమె ఎవరో తనకు తెలియదని బిఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. గతనెల 8వ తేదీన పోలీస్ స్టేషన్‌లో తిట్టినట్టు, బెదిరించినట్టు సుజనారెడ్డి ఫిర్యాదు చేసిన ఆరోపణలు అవాస్తవమని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెఎన్‌టియు విసి వ్యవహారశైలి యూనివర్సిటీ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా ఉన్నదని, విసి తన భార్యను అడ్డుపెట్టుకుని, తన పదవిని ఉపయోగించుకుంటూ యూనివర్సిటీ ప్రతిష్ఠను దిగజార్చే చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. యూనివర్సిటీ క్వార్టర్స్‌ను బార్‌గా మార్చారని, జూబ్లీహిల్స్ క్లబ్, గోల్ఫ్ క్లబ్ కేంద్రాలుగా చేసుకుని వారాంతాల్లో వసూలు చేస్తున్నారని, ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికి తీయాలని డిమాండ్ చేశారు.

## హైదరాబాద్– మియోషి భాగస్వామ్యానికి 20 ఏళ్లు

● జిహెచ్‌ఎంసి కార్యాలయాన్ని సందర్శించిన జపాన్ ప్రతినిధుల బృందం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్– మియోషి సోదర నగర భాగస్వామ్యం 20వ వార్షికోత్సవం సందర్భంగా జపాన్ ప్రతినిధుల బృందం సోమవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, అదనపు కమిషనర్లు రాధికా గుప్తా, ఎన్. రవి కిరణ్ తదితర అధికారులు బృందానికి స్వాగతం పలికారు. 2006లో హైదరాబాద్, జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్‌కు చెందిన మియోషి నగరాల మధ్య సోదర నగర ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో హిరోషిమా ప్రిఫెక్చర్ ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో జిహెచ్‌ఎంసి అధికారులు నగర అభివృద్ధి ప్రణాళికలు, 'క్యూర్ రీజియన్', విజన్–2047, క్యూర్ చట్టం వంటి అంశాలపై జపాన్ ప్రతినిధులకు వివరించారు. పట్టణ సమస్యలు, పాలన విధానాలు, మున్సిపల్ సేవలపై ఇరుపక్షాలు అభిప్రాయాలను పంచుకున్నాయి. హైదరాబాద్– మియోషి సోదర నగర భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని, భవిష్యత్‌లో పరస్పర సహకారాన్ని కొనసాగించాలని సమావేశంలో నిర్ణయించారు. జపాన్ ప్రతినిధి బృందంలో పిఫెక్చురల్ ప్రభుత్వ ప్రతినిధులు వైస్ గవర్నర్ తోరు యోహిమాట్సు, కజువో ఇచికావా, హిరోయోషి ఫునైషి, యోషిహిరో హరాజోనో ఉన్నారు.

## ఎన్‌హెచ్ 65కు జనవరిలో శ్రీకారం

● నవంబర్ 11 వరకు టెండర్ల దాఖలుకు గడువు

● మంత్రి కోమటిరెడ్డికి ఎన్‌హెచ్‌ఎఐ చైర్మన్ హామీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 65) విస్తరణ పనులను 2027 జనవరిలో ప్రారంభిస్తామని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ) చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. ఈ రహదారిపై పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, తరచూ జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా విస్తరణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. సోమవారం న్యూఢిల్లీలో ఎన్‌హెచ్‌ఎఐ చైర్మన్, సభ్యుడు (ప్రాజెక్టులు) విప్నేష్ శర్మతో ఆయన సమావేశమై ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. ప్రస్తుతం నాలుగు లేన్లుగా ఉన్న రహదారిని ఆరు లేన్లుగా విస్తరించడంతోపాటు, ఇరువైపులా సర్వీస్ రోడ్లు, నియంత్రిత ప్రవేశ సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ పనులకు సంబంధించి టెండర్ల దాఖలుకు నవంబర్ 11 చివరి తేదీగా నిర్ణయించినట్లు ఎన్‌హెచ్‌ఎఐ చైర్మన్ తెలిపారు. వచ్చే ఏడాది జనవరి నాటికి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్–విజయవాడ మార్గంలో వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రహదారి విస్తరణ అత్యవసరమని కోమటిరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రవాణా అనుసంధానాన్ని బలోపేతం చేయడంతోపాటు, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమిచ్చే ఈ కీలక ప్రాజెక్టు పనులు ఆలస్యం కాకుండా కేంద్ర సంస్థలతో నిరంతరం సమన్వయం చేసుకుంటామని మంత్రి తెలిపారు.

## బతుకమ్మ పండుగ తెలంగాణ సొంతం

● టిఆర్‌ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచంలో ఎవరికీ లేని అత్యంత విశిష్టమైన బతుకమ్మ పండుగ తెలంగాణ సొంతమని తెలంగాణ రక్షణ సేన (టిఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రతి ఒక్కరూ బతుకమ్మ పాటలు నేర్చుకుని భవిష్యత్ తరాలకు అందజేయాలని సూచించారు. రిజర్వేషన్లు అమలు చేసినా, చేయపోయినా తమ పార్టీలో మాత్రం మహిళలకు 50 శాతం సీట్లను కేటాయిస్తామని ప్రకటించారు. బతుకమ్మ వేడుకలు హైదరాబాద్‌లోని టిఆర్‌ఎస్ కార్యాలయంలో సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నాయకులతో కలిసి కల్వకుంట్ల కవిత బతుకమ్మను పేర్చి, బతుకమ్మ ఆడారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి బతుకమ్మ ప్రతీకగా నిలిచిందన్నారు.

## జలాల సంరక్షణ కోసం కొన ఊపిరి వరకు కృషి

● శాశ్వత కరువు నివారణకు సమగ్ర వ్యూహం అవసరం

● ఎన్‌డిఎంఎ మాజీ ఉపాధ్యక్షుడు మర్రి శశిధర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జలాల సంరక్షణ కోసం చివరి ఊపిరి వరకు తన కృషి కొనసాగుతుందని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ మాజీ ఉపాధ్యక్షుడు, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో పెరుగుతున్న కరవును ఎదుర్కొనేందుకు తాత్కాలిక చర్యలకు బదులుగా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. సోమవారం నాడు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 'చతుర్విధ జల ప్రక్రియ' (ఫోర్ వాటర్స్ కాన్సెప్ట్)ను అమలు చేయడం ద్వారా కరవు నివారణ సాధ్యమని పేర్కొన్నారు. ఎల్నినో ప్రభావంతో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షపాతం లోటు, నీటి నిల్వల తగ్గుదలతో వ్యవసాయం దెబ్బతింటోందని తెలిపారు. గతంలోనూ వరుస కరువులు భూగర్భ జలాలను అడుగంటించి, గ్రామీణ ప్రజల జీవనోపాధిని దెబ్బతీశాయని పేర్కొన్నారు. నాలుగు నీటి విధానంతో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. దివంగత నీటిపారుదల నిపుణుడు టి.హనుమంతరావు రూపొందించిన ఈ విధానాన్ని 2001లో తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో అమలు చేయగా మంచి ఫలితాలు వచ్చాయని వివరించారు. సంగారెడ్డి జిల్లా గొట్టిగారిపల్లి గ్రామం వరుస కరవులను తట్టుకుని మూడు పంటలకు నీటిని అందించిందని తెలిపారు. రాజస్థాన్లోనూ ఈ విధానాన్ని అమలు చేసినట్లు పేర్కొన్నారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, నేలకోత నివారణ, కరవు కాలంలోనూ నీటి లభ్యత ఈ విధానం ప్రధాన ప్రయోజనాలని వివరించారు. ప్రస్తుత అంచనాల ప్రకారం ఎకరాకు సుమారు రూ.15 వేల వ్యయంతో అమలు చేయవచ్చని తెలిపారు. దేశంలోని వర్షాధార భూముల్లో ఈ విధానాన్ని విస్తరించడం ద్వారా రైతులకు నీటి భద్రత కల్పించడంతో పాటు, కరవు సహాయక చర్యలపై ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించవచ్చని మర్రి శశిధర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో తాను ప్రధాని నరేంద్రమోడీని కలిసి, దేశవ్యాప్తంగా దీని అమలుకు అభ్యర్థించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో జస్టిస్ సుభాషన్ రెడ్డి ట్రస్ట్ నిర్వాహకులు ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఒబి, ఆర్‌యుబి నిర్మాణ పనులు వేగవంతం

● దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైళ్ల సురక్షిత రాకపోకలకు భద్రతా నిబంధనలను ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సూచించారు. లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, పాయింట్స్‌మెన్, రైలు నిర్వాహకులు, గేట్‌మెన్ సహా రైళ్ల నిర్వహణలో పాల్గొనే సిబ్బందికి నిర్దేశిత భద్రతా విధానాలపై క్రమం తప్పకుండా అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి పర్యవేక్షకుల వరకు ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సోమవారం రైళ్ల నిర్వహణ భద్రతపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైళ్ల సురక్షిత, సజావైన రాకపోకలకు తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాశ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొనగా, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నిర్మాణంలో ఉన్న రోడ్ అండర్ బ్రిడ్జిలు, రోడ్ ఓవర్ బ్రిడ్జిల పనుల పురోగతిని జీఎం సమీక్షించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా వేగం పెంచాలని, క్షేత్రస్థాయిలో పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న ఆర్‌యుబీల వద్ద వర్షపు నీరు నిలిచిపోకుండా సరైన మురుగునీటి కాలువలు, నీరు బయటకు వెళ్లే మార్గాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భూసేకరణ, ఇతర సమస్యల కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. రైలు భద్రతతోపాటు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు.

## జంతర్ మంతర్ మూసివేతపై నేడు ఢిల్లీ హైకోర్టులో విచారణ



**న్యూఢిల్లీ:** ఢిల్లీలో ప్రజానిరసనలకు కేంద్రంగా భాసిల్లుతున్న జంతర్ మంతర్‌లోకి ప్రదర్శకులను ఇకమీదట ప్రవేశించకుండా బహిరంగ వేదిక జాబితా నుండి తొలగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై మంగళవారం(అక్టోబరు 13) విచారణ జరిపేందుకు ఢిల్లీ హైకోర్టు అంగీకరించింది. ప్రజాస్వామ్యబద్ధమైన నిరసన తెలియజేసే హక్కులో భాగంగాఒక ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించకుండా అర్ధాంతరంగా ఉన్న ప్రదేశాన్ని మూసివేసి అనుమతి నిరాకరించడాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాది ఒకరు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నితిన్ వాసుదేవ్ సంబ్రే,జస్టిస్ సంజయ్ శర్మలతో కూడిన ధర్మాసనం ఎదుట ఈ సమస్యను ఉంచారు. అదేవిధంగా వారాంతంలో బయటి వ్యక్తులు ఎవరో ఈ జంతర్ మంతర్ నిరసన ప్రదేశంలోకి చొరబడి ప్రదర్శకులను వేధింపులకు గురిచేశారంటూ దాఖలైన పిటిషన్‌ను కూడా దీంతోపాటే జతకలిపి విచారణ చేసేందుకు కూడా న్యాయస్థానం అంగీకరించింది.అక్టోబరు 10వ తేదీన సాధారణ నిరసన ప్రదర్శకులపై పట్టపగలు బయట వ్యక్తులు వచ్చి దాడి చేయడంపై ఒక నిర్ణీత కాల పరిధికి లోబడి ,అరమరికలు లేకుండా నిష్పక్షపాతంగా స్వతంత్ర విచారణ జరపాలని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వినోద్ జాఖర్ తన పిటిషన్‌లో న్యాయస్థానాన్ని కోరారు. జంతర్ మంతర్ మూసివేతపై తక్షణం సోమవారమే విచారణ జరపాలని న్యావాయవాది విజ్ఞప్తి చేయగా, ఈ విషయంపై సుప్రీంకోర్టు కూడా విచారణ చేస్తున్నదని గుర్తుంచుకోవాలని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ విషయం సుప్రీంకోర్టు పరిధిలోకి కూడా వెళ్ళింది, అంతే కాదు, కేంద్ర ప్రభుత్వాన్ని కూడా వివరణ కోరింది. దీనిపై అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. అందువల్ల ఈ విషయంలో ఎంతమేరకు పునఃపరిశీలించగలమో రేపు విచారణ చేద్దాం అని న్యాయమూర్తి పేర్కొన్నారు.ఇప్పటికే జంతర్ మంతర్‌ను ప్రజా నిరసనలకు అవకాశం లేకుండా మూసివేశారు, ప్రజవాణిని అణచివేశారు, కార్యనిర్వాహక వ్యవస్థ ప్రదర్శకులకోసం ఒక ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని కేటాయించలేదు, ఇది నిజంగా దుర్దినం, 1975లో కూడా ఇదే విధంగా ఎమర్జెనీ పరిస్థితులు తలెత్తియి, దీనిపై విచారణ జరపాలి అని సంబంధిత న్యాయవాది ధర్మాసనం ఎదుట వాదించారు. అక్టోబరు 10,11 తేదీలలో వేలాదిమంది కాక్రోచ్ జనతాపార్టీ కార్యకర్తలు, నాయకులు వీధుల్లోకి వచ్చారు, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ చేస్తున్న అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిపారు. సర్ ప్రక్రియను వ్యతిరేకించారు.ఈ విషయాలన్నీ ప్రస్తావిస్తూ జాఖర్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ ఉద్యమానికి సంబంధించిన వీడియోలు కూడా ఉన్నాయని, సంఘ వ్యతిరేకశక్తులు ప్రదర్శకులపై దాడులు చేసిన దృశ్యాలున్నాయని పేర్కొన్నారు. ఈ విధమైన విషయాను పరిశీలించకపోతే దేశంలో రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమికమైన వాక్‌స్వాతంత్ర్యం,భావప్రకటనాస్వేచ్ఛ వంటి హక్కులకు అర్థం లేకుండా పోతుందని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈనెల 10,11 తేదీలలో నమోదైన సిసిటీవీ ఫుటేజీలను భద్రపరచాలని, వాటిపై దర్యాప్తు చేయాలని,ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ కోరారు. ఇన్నర్, ఔటర్ కంటోన్మెంట్ సర్కిల్ ప్రదేశాలు, ఇండిరా చౌక్ ప్రాంతాలలో, ఖాదీ గ్రామోద్యోగ్ భవన్ వెలుపల, సంసద్ మార్గ్, జనపథ్, జంతర్ మంతర్ రోడ్,రాజీవ్ చౌక్, జనపథ్ పటేల్ 22 చౌక్, బబరఖంబ రోడ్ మెట్రో స్టేషన్స్ వద్ద సిసి ఫుటేజీలను భద్రపరచాలని కోరారు. కాగా ఢిల్లీ పోలీసులు ప్రత్యేకంగా ఒక ప్రకటన చేస్తూ, జంతర్ మంతర్‌ను నిరసన ప్రదర్శనలకు అర్హమైన ప్రదేశాల జాబితా నుండి తొలగించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు అక్టోబరు 11వ తేదీన ఉత్తర్వు జారీ చేశారు. ఇప్పుడు రామ్‌లీలా మైదాన్, బురారి గ్రౌండ్, సిబిడి గ్రౌండ్‌లను నిరసన ప్రదర్శనలకు కొత్త ప్రదేశాలుగా గుర్తించి అనుమతిస్తున్నట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.



## హౌసింగ్ సొసైటీ భూ సమస్యలపై పరిశీలన

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** గాయత్రి నగర్ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 1007లో ఉన్న భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ భూమికి సంబంధించిన సమస్యను టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులను అడిగి భూ సమస్యకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. సమస్యకు దారితీసిన పరిస్థితులు, ప్రస్తుతం నెలకొన్న పరిణామాలపై నాయకులతో చర్చించారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యకు సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, గాయత్రి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మస్తాన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేముల సత్యం, రాఘవేంద్రరావు, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఇసిఐఎల్‌లో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం సమీక్షా సమావేశం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఈసిఐఎల్‌లోని మెగా జూనియర్ కళాశాలలో మంగళవారం ఉదయం 11 గంటలకు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపిఎస్ఓ) ఆధ్వర్యంలో ప్రపంచంలో నెలకొని ఉన్న యుద్ధ వాతావరణం, అశాంతి అభద్రతాభావం, ఎస్ఐఆర్ పేర జరుగుతున్న అప్రజాస్వామిక దమనకాండలతో నెలకొన్న పరిస్థితులపై సమీక్షా సమావేశం జరుగుతుందని జిల్లా సహాయ కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొట్టిపాటి నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ సమతా రోషిణి, జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి ఉమామహేష్, జిల్లా నాయకులు శ్రీమన్నారాయణలు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. జిల్లా శాంతి సంఘీభావ సంఘ సభ్యులు, కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్, శాంతి ఉద్యమ ప్రేమికులు, నాయకులు, విద్యార్థులు, మేధావులు, కవులు, కళాకారులు, సమసమాజహిత ప్రముఖులు ఈ సభకు హాజరవ్వాలని కోరారు.

## ముదిరాజ్ సంఘం అధ్యక్షుడుగా మోర నర్సింహ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాప్రా జమ్మిగడ్డ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముదిరాజ్ సంఘల నూతన అధ్యక్షులుగా మోర నరసింహముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా పిట్టల గోపి, కోశాధికారి బక్కోని మహేందర్‌లు ఎన్నికయ్యారు. సభ్యులందరూ సంపూర్ణ మద్దతు, ఏకాభిప్రాయంతో జమ్మిగడ్డ ముదిరాజ్ సభ్యులు ఎన్నికయ్యారని సభ్యుల సహకారంతో ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు.



## మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి : కొత్త కిషోర్‌గౌడ్

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని జిల్లా కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్‌గౌడ్ అన్నారు. సోమవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మహాలక్ష్మి నగర్ కాలనీలో పర్యటించారు. కాలనీ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నూతన ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేసామని, కాలనీలో నూతన సిసి రోడ్లు, డ్రైనేజి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత షేక్ అక్బర్, కాలనీ అధ్యక్షుడు రూపని విష్ణు, ఉపాధ్యక్షుడు జయశంకర్, దయాకర్‌రెడ్డి, కోశాధికారులు సుదర్శన్‌రావు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి విక్రయ ఒప్పందం పేరుతో రూ.31.77లక్షల మోసం

### జగద్గిరిగుట్ట పరిధిలో ఘటన.. మహిళపై కేసు నమోదు

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మోసం వెలుగు చూసింది. ఇల్లు విక్రయిస్తానని నమ్మించి ఒక వ్యక్తి నుంచి లక్షలాది రూపాయలు అడ్వాన్స్‌గా తీసుకుని అదే ఇంటిని బ్యాంకులో తనఖా పెట్టిన ఘటన సంచలనం సృష్టించింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితురాలైన మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. గాజులరామారం మల్లారెడ్డి నగర్‌కు చెందిన గొలిపల్లి దయాకర్‌రెడ్డికి జగద్గిరిగుట్ట అంజయ్య నగర్‌కు చెందిన యెర్రోళ్ల రేణుకతో పరిచయం ఏర్పడింది. తన ఆర్థిక అవసరాల నిమిత్తం అరవై చదరపు గజాల స్థలంలో నిర్మించిన జీ ప్లస్ టూ భవనాన్ని విక్రయించనున్నట్లు రేణుక తెలిపారు. ఇంటి ధరను 80లక్షలుగా నిర్ణయించగా కొనుగోలు చేసేందుకు దయాకర్‌రెడ్డి అంగీకరించాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 25వ తేదీన ఇరువర్గాల మధ్య అధికారికంగా విక్రయ ఒప్పందం కుదిరింది. ఒప్పందంలో భాగంగా దయాకర్‌రెడ్డి తన ఎస్‌బిఐ ఖాతా నుంచి చెక్కుల రూపంలో రూ.27లక్షలు, నగదు రూపంలో రూ.4.77 లక్షలు చెల్లించారు. మొత్తంగా రూ.31.77 లక్షలను అడ్వాన్స్‌గా అందజేశారు. అయితే ఇంటి అసలు పత్రాలు చూపించాలని కోరినప్పుడు, ఆ భవనంపై ఇప్పటికే బ్యాంకులో రూ.18లక్షల రుణం ఉన్నట్లు రేణుక వెల్లడించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. అడ్వాన్స్‌గా తీసుకున్న డబ్బులతో ఆ రుణాన్ని తీర్చి, రెండు నెలల్లో ఇంటి రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తానని ఆమె హామీ ఇచ్చినట్లు తెలిపాడు. గడువు ముగిసిన రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో దయాకర్‌రెడ్డి తన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడినట్లు బాధితుడు ఆరోపించారు. మార్చి 6వ తేదీలోగా డబ్బులు తిరిగి చెల్లిస్తానని చెప్పి చెక్కులు ఇచ్చినప్పటికీ మరుసటి రోజే అంటే మార్చి 7వ తేదీ అదే ఇంటిని ఈక్విటాప్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో తనఖా పెట్టి మరో రూ.37లక్షల రుణం పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ సురేష్ ఆదేశాల మేరకు ఎస్ఐ జి.శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పేద కుటుంబీకులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్



**ప్రజాపక్షం/బోడుప్పల్:** బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్ కాలనీలో అనేక ఏళ్లుగా గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేద కుటుంబీకులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలని, 58 జిఓలను వెంటనే విడుదల చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్ బోస్ కోరారు. సోమవారం జి.నాగరాజు అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, మండల కార్యదర్శి రచ్చ కిషన్‌లతో పాటు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. 59 జిఓ ఏ విధంగా విడుదల చేసిందో 58 జిఓను సైతం విడుదల చేసి పేదలకు పట్టాలివ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఈ సమస్యను మానవీయతా దృక్పథంతో పరిశీలించి అర్హులైన వారందరికి న్యాయం చేకూర్చాలన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప సమస్య మాత్రం సమస్యగానే ఉంటోందని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తుది పరిష్కారమివ్వాలన్నారు. పేద ప్రజలకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జె.లక్ష్మి, విబి బాల్‌రాజ్, కావలి నరసింహ, సిహెచ్ మాధవి, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

## దేసింగ్ రాజు మృతి కార్మికవర్గాలకు తీరని లోటు

### సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడిగా దేసింగ్ రాజు అకాల మృతి కార్మికవర్గాలకు తీరని లోటని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ అన్నారు. ఆయన పార్థివ దేహానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్, జిల్లా కార్యదర్శి ఉమామహేష్‌లతో కల్సి ఆయన పార్టీ జెండా ఎగురవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ దేసింగ్ రాజు, తన జన్మస్థలం చిత్తూరు జిల్లా పుత్తూరు వద్ద గట్టు గ్రామమేనని,తమ ఇరువురి మధ్య పార్టీపరంగానే కాకుండా కుటుంబరీత్యా సాన్నిహిత్యం ఉందన్నారు. ఆయన కుటుంబాని కి సానుభూతి వ్యక్తం చేసారు. రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడిగా సుదీర్ఘ కాలం సేవలందించిన ఆయన జ్యోష్ట బాట్ల, రాజబహదూర్‌లతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకొని పలు ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. పార్టీ సిద్ధాంతాలతో చివరిశ్వాస వరకు ఆదర్శ కమ్యూనిస్టు మరణం ఉద్యమానికి తీరని లోటని చెప్పచ్చన్నారు.

# మున్సిపల్‌లో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యం

### అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపాలిటిలోని అన్ని వార్డుల్లో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తామని, ప్రజలకు మెరుగైన రహదారులు నాణ్యతతో నిర్మాణం చేపడుతామని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపాలిటిలోని 17, 20వ వార్డుల్లో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.4లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు తగిన ప్రాధాన్యత నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ముద్దం సుధాకర్‌రెడ్డి, మౌనిక దినేష్, తాళ్ల స్వప్న రాంప్రసాద్‌గౌడ్, తలారి మౌనిక బాబు, గాదె వెంకటేష్, యమునా శ్యామ్, జశ్వంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపల్ నిబంధనలకు లోబడి తై బజార్ వసూలు**



అలియాబాద్ మున్సిపల్ కార్యాలయ ఆవరణ లో చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తై బజార్ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో తుమ్మ రాకేష్ తై బజార్ వేళం పాటను తేది 31/03/2026 వరకు రూ. 3.41లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నా రు. అనంతరం చైర్మన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ నిబంధనలకు లోబడి తైబజార్ వసూళ్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు గాదె వెంకటేష్, గూదె వెంకటేష్, జశ్వంత్‌రెడ్డి, ముద్దం సుధాకర్ రెడ్డి, గుర్క కుమార్, పట్టణ ప్రజలు, రాకేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ ఎనర్జీ అండ్ సస్టైనబిలిటీ



**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ ఎనర్జీ అండ్ సస్టైనబిలిటీ అనే అంశంపై నిర్వహించిన మూడు రోజుల కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఇంధన రంగంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, పునరుత్పాదక ఇంధన వనరులు, పరిశోధన, ఆవిష్కరణలు మరియు పర్యావరణ పరిరక్షణలో సుస్థిర అభివృద్ధి ప్రాధాన్యతను ఈ కార్యక్రమం ప్రధానంగా చర్చించారు. ఎంఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ యాజమాన్యం మార్గదర్శకత్వం, ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం నిర్వహించారు చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఫౌండర్ సెక్రటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి ఎమ్మెల్యే, సెక్రటరీ మర్రి అనూ శ్రేయ రెడ్డి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ మర్రి ధీరన్ రెడ్డి, ట్రెజరర్ మర్రి మమతా రెడ్డి ఉన్నారు. డైరెక్టర్ డా.పి. శ్రీధర్, ప్రిన్సిపాల్ డా.ఆర్.మురళీ ప్రసాద్ విద్యా కార్యక్రమాలు, పరిశోధన కార్యకలాపాలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తమ మార్గదర్శకత్వం, సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమా న్ని ఫ్రెష్ మ్యాన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా॥ కె. అశోక్, డీన్‌రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డా॥ నర్సింగా రావు, నిర్వాహకురాలు డా॥ రేవతి సమన్వయంతో, అధ్యాపకులు, కోఆర్డినేటర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ విమానాశ్రయ టెర్మినల్‌కు పివి నర్సింహారావు పేరు పరిశీలించాలి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దేశ మాజీ ప్రధాని పివి నర్సింహారావు అందించిన సేవలను గుర్తించి, వరంగల్ విమానాశ్రమానికి ఆయన పేరు పెట్టే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని నైస్ కన్‌స్ట్రక్షన్స్ డైరెక్టర్ సామాజికవేత్త రాజారావు కోరారు. శుక్రవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని కాప్రా ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకుల సమావేశంలో మాట్లాడు తూ దేశ రాజకీయ, పరిపాలన చరిత్రలో పివి నర్సింహరావు కీలక స్థానాన్ని కలిగి ఉన్నారని, పివి నర్సింహరావు దేశానికి విశిష్ట సేవలు అందించారని ఆయన స్థాయికి, చేసిన సేవలను తగిన రీతిలో స్మరించుకుని ఆయన పేరును వరంగల్ విమానాశ్రయ టెర్మినల్‌కు ప్రతిపాదనను ప్రభుత్వ సానుకూలంగా పరిశీలించాలని రాజారావు అన్నారు.

## రూ 3,94 కోట్లతో అభివృద్ధి పనులు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజా మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా సర్కిల్ కుషాయిగూడ డివిజన్ పరిధిలోని వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో 36 లక్షలు,ఆ దర్శ్‌కాలనీలో 20 లక్షలు,చక్రీపురం 22 లక్షలు,నరసింహనగర్ కాలనీలో 26 లక్షలు,కుషాయిగూడలో 30 లక్షలు,భరత్ నగర్‌లో 29 లక్షలు,ధోబీఘాట్ 19లక్షలు,హనుమాన్ నగర్‌లో 17 లక్షలు,శివసాయి నగర్‌లో 42 లక్షలు,మారుతీ నగర్ 25 లక్షలు,నాగార్జున నగర్‌లో 35 లక్షలు,సోనియాగాంధీ నగర్‌లో 25 లక్షలు,శ్రీనివాస్‌నగర్ కాలనీలో 40 లక్షలు,ఇందిరానగర్ కాలనీలో 27లక్షలతో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నీటిని వృథా చేయొద్దు.. పొదుపుగా వాడుకోండి

### నీటిని వృథా చేస్తే రూ.వెయ్యి జరిమానా

### గ్రామ సర్పంచ్ కవిత శేఖర్, ఉప సర్పంచ్ మహేందర్



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** ఎల్‌నినో ప్రభావంతో నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున గ్రామ ప్రజలు నీటిని వృథా చేయకుండా అవసరాలకు మాత్రమే వినియోగించాలని గుల్లగూడ గ్రామ సర్పంచ్ కవిత శేఖర్, ఉప సర్పంచ్ మహేందర్ రెడ్డి సూచించారు. సోమవారం నవాబుపేట్ మండలం గుల్లగూడ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణతో కలిసి వారు గ్రామ ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించారు. మిషన్ భగీరథ నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వాడుకోవాలని, నల్లాల ద్వారా నీరు వృథా కాకుండా ట్యాప్‌లను సక్రమంగా మూసివేయాలని కోరారు. నీటిని వృథాచేస్తే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో నీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలు ఇప్పటి నుంచే నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలోని బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం పడవేసే వారిపై రూ.వెయ్యి జరిమానా విధిస్తామని గ్రామపంచాయతీ పాలకవర్గం హెచ్చరించింది. మిషన్ భగీరథ నీటిని వృథా చేసే విధంగా నల్లాలను తెరిచి ఉంచినా రూ.వెయ్యి జరిమానా విధిస్తామని సర్పంచ్ కవిత శేఖర్ స్పష్టం చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీటి వనరులను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సర్పంచ్, ఉప సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలక వర్గ సభ్యులు. గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

## రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీ

**ప్రజాపక్షం/ధారూర్:** ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలను ఉపయోగించుకొని అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ విజయ భాస్కరెడ్డి అన్నారు. సోమవారం ధారూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో గట్టెపల్లి, రాంపూర్ గ్రామాలకు చెందిన 266 మంది రైతులకు వెరుశనగ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్‌లు మాజీ ఎంపిటిసిలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 110 ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 110 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు నిర్ణీత గడువులోగా పరిష్కారించాలని, ఫిర్యాదుల పరిష్కార పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా



అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, వెంకటచారి, జెడ్పిసిఇఓ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.



## ఎఫ్ఐఆర్ నమోదయ్యాకే దహన సంస్కారాలు జరపాలి

### జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** జవహర్ నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డు విష వాయువుల వల్ల సంభవించే అనారోగ్య మరణాలపై పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదయ్యాకే దహన సంస్కారాలు జరిపేలా స్మశానవాటికలకు నోటీసులు జారీ చేయాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం తార్నాకలోని మల్కాజిగిరి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ ఆధ్వర్యంలో వివిధ భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... డంపింగ్ యార్డు దుర్వాసనలు, మీథేన్ వాయువులు, లిచేట్ ద్రవాల వల్ల గాలి, భూగర్భ జలాలు కలుషితమై ప్రజలు తీవ్ర అనారోగ్య పాలవుతున్నారని, వారానికి ఇద్దరు ముగ్గురు అకాల మరణం చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డును శాస్త్రీయ పద్ధతిలో వెంటనే శాశ్వతంగా మూసివేసి పర్యావరణాన్ని పునరుద్ధరించాలి. ప్రభావిత ప్రాంత ప్రజలకు ఉచితంగా శుద్ధమైన మంచినీరు, వైద్య సౌకర్యాలు అందించాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తీరును, అఖిలపక్ష సమావేశం నిర్ణయాలను ప్రజలకు లిఖితపూర్వకంగా వెల్లడించాలి. గ్రేటర్ హైదరాబాద్ చెత్తను ఇక్కడకు తరలించడం తక్షణమే నిలిపివేయాలి. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ప్రజా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు గడ్డం సదానందం, పి.శివబాబు, వై.మల్లేష్, వి.ప్రవీణ్, సునీత, తదితరులు పాల్గొన్నారు.



## భారత్,వెస్టిండీస్ మ్యాచ్-పటిష్ట భద్రతతో సిద్ధం

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఈ నెల 14న జరుగనున్న భారత్,వెస్టిండీస్ మ్యాచ్ సందర్భంగా ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, పరిసరాల్లో 2200 మంది పోలీసులు, 408 సిసి కెమెరాలు, రెండు డ్రోన్లతో పటిష్టమైన భద్రతా ఏర్పాటు చేసామని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి పేర్కొన్నారు. క్రికెట్ మ్యాచ్ సందర్భంగా సోమవారం క్రికెట్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కమిషనర్ భద్రతా వివరాలను వెల్లడించారు. తెలంగాణా నుండే కాకుండా వివిధ రాష్ట్రాల నుండి సుమారు 40వేల మంది వీక్షకులు హాజరయ్యే అవకాశం ఉందని, మ్యాచ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఏ)తో సమన్వయం చేసుకొంటూ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నామన్నారు. భద్రతా ఏర్పాట్లను ఉప్పల్ డిసిపి నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ పోలీసు బలగాల మోహరింపు తదితర అంశాలను పర్యవేక్షిస్తారన్నారు. ఐదుగురు డిసిపిలు, ఐదుగురు అదనపు డిసిపిలు, 15 మంది ఎసిపిలు ఉంటరన్నారు. శాంతి భద్రతల విభాగం, ట్రాఫిక్ విభాగం బాంబు డిటెక్షన్, స్పెషల్ బ్రాంచ్, సిఐ సెల్, ఇంటిలిజెన్స్, ఎస్ఓటి, ఐటి సెల్, షీ టీమ్స్, కమ్యూనికేషన్, అక్టోపస్, ప్లేయర్ల ఎస్కార్ట్ బృందాలు విధుల్లో ఉంటాయన్నారు. వీరికి అదనంగా ఆర్మ్, రిజర్వ్‌డ్ బెటాలియన్లు, స్పెషల్ పోలీసు ప్లాటూన్లను మోహరిస్తున్నామన్నారు. సిసి కెమెరాలు, డ్రోన్లతో నిరంతర నిఘా స్టేడియం పరిసరాల్లో పర్యవేక్షణ ఉంటుందని కమిషనర్ తెలిపారు. కంట్రోల్ రూం ద్వారా భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షిస్తుంటారన్నారు. వీటన్నింటికి అదనంగా మరో రెండు అత్యాధునిక డ్రోన్ల ద్వారా స్టేడియం పరిసరాలను రేయింబవళ్లు పరిశీలిస్తుంటామన్నారు. అనధికారికంగా ఎవరూ స్టేడియంలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన తనిఖీలుంటాయని, ప్రేక్షకులకు తమకు కేటాయించిన గేట్ల ద్వారానే ప్రవేశించాలని, టికెట్ పై పేర్కొన్న వివరాలను ముందుగానే చూసుకోవాలన్నారు. నకిలీ టికెట్లు, మోసపూరిత వెబ్‌సైట్లపై నిఘా ఉందన్నారు. టికెట్లు కొనుగోలు చేసే విషయంలో అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే వినియోగించాలే తప్ప ఎలాంటి లింకులను నమ్మవద్దని సూచించారు. పోలీసుల సూచనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుండే ట్రాఫిక్ ఆంక్షలు అమలులోకి వస్తాయన్నారు. మ్యాచ్‌కు వచ్చే ప్రేక్షకుల వాహనాల కోసం హెచ్‌సిఏ సహకారంతో 8 వేల వాహనాలకు పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటైందన్నారు. క్రికెట్ అభిమానులు పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలు, వాహనాల మళ్లింపులు, పార్కింగ్ తదితర విషయాల్లో మార్గదర్శకాలను పాటిస్తూ మ్యాచ్‌ను ప్రశాంతంగా ఆస్వాదించాలని కమిషనర్ సుమతి విజ్ఞప్తి చేసింది.



## దుకాణాల, సిబ్బంది వసతి గృహం ఆరంభం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలు, సిబ్బంది వసతి గృహాన్ని సోమవారం పిఏసి చైర్మన్ ఆరికెపూడి గాంధీ తాజా మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, దొడ్ల వెంకటేష్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన ఈ వసతి గృహం నేటి నుంచే అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇలాంటి సదుపాయాల కల్పనతో సిబ్బందికి ప్రయోజనం చేకూరడంతో పాటు స్థానిక అవసరాలకు కూడా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంటి శాతవాహన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రత్న ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం.బాబురావు, ప్రధాన కార్యదర్శి ఎం.యాదిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు వి.వెంకటరావు, ఎస్.రామనాథం, హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, శ్రీ ఉమా మహేశ్వర ఆలయ కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్‌ఓతో కల్సి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి 88 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి ధరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలించి ఈ విషయాన్ని ధరఖాస్తుదారులకు తెలియచేయాలని, ఒక వేళ పరిష్కరించ లేని పక్షంలో దానికి సంబంధించిన కారణాలతో సహా తెలపాలన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
మంగళవారం
13-10-2026
www.prajapaksham.in

“విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ ‘రణబాలి‘. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. రశ్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తోంది. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ‘రణబాలి‘ సినిమాను ప్రొడ్యూసర్స్ వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.”

రీల్



## ‘కాస్ట్’ టీజర్ లాంచ్

వరుణ్ సందేశ్, గగన్ బాబు , సత్యం రాజేశ్, రవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సోషల్ డ్రామా ‘కాస్ట్’. ఏకే జంపన్న రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. కశిక కపూర్, దివి వద్యా కథానాయికలుగా నటిస్తున్నారు. తాజాగా ఇంటెన్స్ అండ్ గ్రిప్పింగ్ టీజర్ను లాంచ్ చేసింది. కుల వివక్ష అనే ప్రధాన ఇతివృత్తాన్ని పరిచయం చేస్తూ టీజర్ ప్రారంభమవుతుంది. అగ్రకులానికి చెందిన వారి ఇంట్‌లోకి తమకు ప్రవేశం లేదని ఓ తండ్రి తన కొడుకుకు చెప్పే సన్నివేశంతో కథలోని సామాజిక అంశాన్ని పరిచయం చేశారు. ఆ తర్వాత కుల వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించే ఓ పోలీస్ అధికారి పాత్రను చూపించారు. ఈ సందర్భంగా హీరో గగన్ బాబు మాట్లాడుతూ గంటా శ్రీనివాసరావు మా సినిమాకు అతిథిగా రావడం చాలా ఆనందంగా ఉంది. నేను ‘పుష్ప’ సినిమాకు పనిచేశాను. అక్కడ టికెట్ కొనుక్కుని లోపలికి వెళ్తే ప్రతి ఒక్కరూ సమానంగా కూర్చోవచ్చు. అలాంటి థియేటర్ను, అలాంటి కల్చర్ను మనం ఎప్పుడూ కాపాడుకోవాలి. గంటా శ్రీనివాసరావుకి, నవీన్ కి, శివకి, ఈ వేడుకకు విచ్చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమాలో వరుణ్ సందేశ్, రాజేశ్, రవి , గగన్ అందరూ అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. ఈ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాత నవీన్ యెర్నేని, డైరెక్టర్ శివ నిర్వాణ,ప్రొడ్యూసర్ కోటేశ్వరరావు, అనూప్ రూబెన్స్ , రవి , సత్యం రాజేశ్ , దివి వద్యా పాల్గొన్నారు.

## ‘పరిచయమే..’అంటున్న ప్రేమ జంట



రాయ్‌డిక్స్ సినిమాస్ బ్యానర్ నిర్మిస్తున్న కొత్త మూవీ ‘గోల్ స్పాట్’. ఈ చిత్రాన్ని విజయకృష్ణ లింగమనేని ప్రెజెంట్ చేస్తున్నారు. ప్రొడ్యూసర్ రవితేజ పచ్చిపాల నిర్మిస్తున్న ఈ చిత్రంలో అభిషేక్, కాజల్ చౌదరి హీరో హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ‘అంబాజీపేట మ్యారేజి బ్యాండు’ చిత్రంతో దర్శకుడిగా మంచి గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు దుష్యంత్ కటికనేని ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు అందిస్తున్నారు. శ్రీ చౌదరి ఇనగంటి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. దుష్యంత్ దగ్గర వర్క్ చేసిన వేణు కార్తికేయన్ ‘గోల్ స్పాట్’ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ‘గోల్ స్పాట్’ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ ’పరిచయమే..’ రిలీజ్ చేశారు. ఈ బ్యూటిఫుల్ మెలోడీని మ్యూజిక్ డైరెక్టర్ నరేన్ రెడ్డి కంపోజ్ చేసి సింగర్ తుషార నిలయతో కలిసి పాడారు. భార్గవ కార్తీక్ క్యాచీ లిరిక్స్ అందించారు. ’పరిచయమే..’ సాంగ్ ఎలా ఉందో చూస్తే ’ఓ మనసా అలుపే రాదు తలపున నీవుంటే, ఓ మనసా అదుపే లేదు ఎదురుగ నీవుంటే, వేల వర్ణాల ఆమనిగా పూల గంధాల పుష్పమిగా, పరిచయమే చిరు కథగా మొదలవగా, పరిణయమే తదుపరిగా మిగిలెనుగా, పరిచయమే చిరు కథగా మొదలవగా, పరిణయమే తదుపరిగా మిగిలెనుగా....’ అంటూ ప్రేమికులవుతున్న చిన్ననాటి స్నేహితులు రామ్, శాంత మధ్య స్వీట్ మెలోడీగా చిత్రీకరించిన ఈ పాట ఆద్యంతం ఆకట్టుకుంటోంది.



ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ‘దిల్ రాజు’

## ‘క్రేజీ కల్యాణం’ గన్ షాట్ హిట్

నరేష్ విజయ కృష్ణ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా ‘క్రేజీ కల్యాణం’. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. ఈ నెల 16న ‘క్రేజీ కల్యాణం’ సినిమా వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, బన్నీ వాస్, డైరెక్టర్ నందినీరెడ్డి ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ దిల్ రాజు మాట్లాడుతూ ఈ ఈవెంట్ కోసం చెన్నై నుంచి వచ్చాను. ప్రొడ్యూసర్ జగన్ మోహన్ ఈ సినిమా చేస్తున్నప్పటి నుంచి ఈ మూవీ గురించి చెప్పాడు. పెద్ద వాటితో పాటు చిన్న చిత్రాలు ఆదరణ పొందినప్పుడే ఇండస్ట్రీ కళకళలాడుతుంది. అనుపమ తెలుగు నేర్చుకుని మా శతమానం భవతి సినిమాలోనే డబ్బింగ్ చెప్పుకుంది. ఆమె ఇప్పుడు తెలంగాణ యాసలో ఆకట్టుకునేలా నటించింది. రాజ్ వెడ్స్ రాంబాయి రిలీజ్ తర్వాత అఖిల్ రాజ్‌ను పిలిచి మాట్లాడాను. అతనికి మంచి ఫ్యూచర్ ఉంది. తరుణ్ భాస్కర్ నటుడిగా, దర్శకుడిగా ఆకట్టుకుంటున్నారు. నరేష్ ఎవర్ గ్రీన్ యాక్టర్. ఆయన తన నటనతో ఏడిపించగలడు, నవ్వించగలడు. సురేష్ బొబ్బిలి మా బలగం సినిమాకు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చేశాడు. మా దేత్తడి సినిమాను కూడా మ్యూజికల్ గా హిట్ చేయబోతున్నాడు. ఈ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా అన్నారు. ప్రొడ్యూసర్ బన్నీ వాస్, డైరెక్టర్ నందినీరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అఖిల్ సాయి, మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి, డైరెక్టర్ బద్రప్ప గాజుల , ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి , హీరో అఖిల్ రాజ్ , యాక్టర్ తరుణ్ భాస్కర్ , హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

## ‘కోబలి’ పాట రిలీజ్



విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ ‘రణబాలి‘. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. రశ్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తోంది. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ‘రణబాలి‘ సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ నెల 16న విజయదశమి పర్వదినం సందర్భంగా ‘రణబాలి‘ సినిమా వరల్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ‘రణబాలి‘ సినిమా నుంచి మేకర్స్ ‘కోబలి..’ లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ సాంగ్ కు అజయ్ అతుల్ గూస్ బంప్స్ తెప్పించేలా ట్యూన్ కంపోజ్ చేయగా, కేశవాదిత్య పవర్ ఫుల్ లిరిక్స్ రాశారు. వి.ఎం. మహాలింగం మెస్మరైజ్ చేసేలా పాడారు. ‘కోబలి..’ సాంగ్ ఎలా ఉందో చూస్తే ’ రేగే ఉరుము దరువు మిన్ను ముట్టగా, అష్టదిక్కులే పిక్కటిల్లవా, రేగే ఉరుము దరువు నిన్ను ముట్టగా, అష్టదిక్కులే పిక్కటిల్లవా, జోగే రెయ్యిలోన పగల సెగలిలా పొగులుతుండగా పగలు పుట్టదా, మూగే సావునైన సంపడానికి సత్తువియ్యరా కాల కాలుడా, పెన్నేరల్లె తేరు ఉరకలెత్తగా సింధు తొక్కమా భద్రమల్లడా...’ అంటూ సాగుతుందీ పాట. ఈ పాటలో విజయ్ దేవరకొండ ఫెరోషియస్ గా కనిపించి ఆకట్టుకుంటున్నారు.

### నార్వే ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో

## జెడి చక్రవర్తికి ఉత్తమ నటుడు పురస్కారం



విలక్షణ నటుడు జేడీ చక్రవర్తి నటించిన ‘దహిణి ది విచ్’ చిత్రానికి మరో అంతర్జాతీయ పురస్కారం లభించింది. కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌కు ధీటుగా నిర్వహించే నార్వే ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్లో ‘దహిణి ది విచ్’ చిత్రానికి గాను జేడీ చక్రవర్తికి ఉత్తమ నటుడు పురస్కారం లభించింది. ప్రపంచవ్యాప్తంగా 150 నామినేషన్స్ రాగా బెస్ట్ లీడ్ యాక్టర్ కేటగిరీలో జేడీ చక్రవర్తికి ఈ అవార్డ్ రావడం గొప్ప విషయం. ఇప్పటికే ఎన్నో ఫిలిం ఫెస్టివల్స్‌లో ఈ చిత్రం అనేక అవార్డ్సను కైవసం చేసుకుంది. తాజాగా నార్వే ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్లో ‘దహిణి’ ఉత్తమ చిత్రం అవార్డ్‌ను సైతం దక్కించుకుంది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ప్రముఖ నటులు ఈ నామినేషన్ లో ఉండగ భారతీయ నటుడు జేడీ చక్రవర్తి కి ఈ అవార్డ్ దక్కడం గర్వించదగ్గ విషయం. ఈ సందర్భంగా జేడి చక్రవర్తి మాట్లాడుతూ ‘ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన హేమాహేమీలు రూపొందించిన చిత్రాలతో పోటీపడి ‘దహిణి’ ఉత్తమ చిత్రం అవార్డ్ దక్కించుకోవడం భారతీయ చలనచిత్ర పరిశ్రమ కి గర్వ కారణం , అలానే దాదాపు 150 నామినేషన్లలో వరల్ వైడ్ నటులు ఉండగా , బెస్ట్ లీడ్ యాక్టర్ అవార్డ్ నన్ను వరించడం నన్నెంతో ఆనందానికి గురి చేసింది. ఇలాంటి చిత్రాలు చాలా అరుదుగా వస్తుంటాయి, నన్ను నమ్మి ఈ క్యారెక్టర్‌ను నాకిచ్చిన దర్శకుడు రాజేష్ టచ్ రివర్ కి, అలానే నార్వే ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ నిర్వాహకులకు నా కృతజ్ఞతలు తెలుపుతున్నా’ అని అన్నారు. రాజేష్ టచ్ రివర్ దర్శకత్వం వహించిన ’దహిణి ది విచ్’ సినిమాలో జేడీ చక్రవర్తితోపాటు.. తనిష్ఠ ఛటర్జీ, శ్రుతి జయన్ కీలకపాత్రలలో నటించారు. సునీతా కృష్ణన్, ప్రదీప్ నారాయణన్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించారు.

## ‘ట్రయల్ అండ్ ఎర్రర్’ సిరీస్ షూటింగ్ షురూ



సత్యదేవ్, ఫరియా అబ్దుల్లా, రమ్యకృష్ణ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సిరీస్ ‘ట్రయల్ అండ్ ఎర్రర్’ సంప్రదాయబద్ధంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమల్ హాసన్ నటించిన స్టైలిష్ థ్రిల్లర్ ‘చీకటి రాజ్యం’కు దర్శకత్వం వహించిన రాజేష్ సెల్వ ఈ సిరీస్ను తెరకెక్కిస్తున్నారు. విభిన్నమైన పాత్రల్లో తనదైన నటనతో ఆకట్టుకునే సత్యదేవ్.. ఈ సిరీస్ లో ఛాలెంజింగ్ క్యారెక్టర్ చేస్తున్నారు. ఇందులో రమ్యకృష్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. తనదైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో కథకు మరింత ఇంటెన్సిటీ తీసుకురానున్నారు. ఫరియా అబ్దుల్లా కూడా ఈ ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. ఈ సిరీస్లో విరాజ్ అశ్విన్, చైతన్య కృష్ణ, వర్ష బొల్లమ్మ, యష్ పూరి, సంపత్ రాజ్, సుబ్బరాజు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఎంటర్‌టైనెమెంట్ నిర్మాణంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు శరత్ మరార్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

## తీర్మానం ఆమోదం (మొదటి పేజీ తరువాయి)

విస్మరించలేమని ఆ తీర్మానం పేర్కొంది. ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో జరిగినట్లు ఆరోపించబడిన అవకతవకలను పరిష్కరించాలని, అన్యాయంగా మినహాయించబడిన అర్హులైన ఓటర్లందరి ఓటు హక్కులను తక్షణమే పునరుద్ధరించాలని ఈ తీర్మానం కోరింది. అదే విధంగా ‘సంస్థ స్వాతంత్ర్యం, విశ్వసనీయతను నిర్ధారించడానికి, ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీని పునర్నిర్మించి, అందులో ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తిని సభ్యులుగా చేర్చాలని కూడా కోరింది. ‘ఓటు హక్కు మన ప్రజాస్వామ్యానికి పునాది. మన పౌరుల రాజ్యాంగ హక్కులను ఏ సంస్థ కూడా బలహీనపరచడానికి అనుమతించరాదు. మా వైఖరి నిస్సందేహమైనది. ఓటు హక్కును తప్పక కాపాడాలి. రాజ్యాంగాన్ని నిలబెట్టాలి. ప్రజాస్వామ్యం తప్పక గెలవాలి. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల కోసం కేరళం గట్టిగా నిలబడుతుంది’ అని సతీసన్ తర్వాత ఒక ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

## ఇద్దరికి నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక శాస్త్రంలో నోబెల్ స్మారక బహుమతిని గెలుచుకున్నారు. హోల్ కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయానికి, వుడ్‌ఫోర్డ్ న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్నారు. ఈ అవార్డును స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. ‘ఈ బహుమతి గ్రహీతల కృషి, ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు, ప్రభుత్వాలు ఇప్పుడు ఉపయోగిస్తున్న నమూనాలకు ఒక స్థిరమైన సైద్ధాంతిక పునాదిని అందించింది’ అని ఆర్థిక శాస్త్రాల బహుమతి కమిటీ చైర్మన్ జాన్ హాస్లర్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. వాటితో, ఇంధన సంక్షోభాలు లేదా గృహాలు వినియోగించే పరిమాణంలో ఆకస్మిక మార్పులు వంటి ఆర్థిక వ్యవస్థలోని ఒడిదుడుకులను ఎదుర్కోవడానికి మనం మరింత మెరుగ్గా సన్నద్ధమయ్యాము. ఈ ఆర్థిక శాస్త్ర బహుమతిని అధికారికంగా ‘బ్యాంక్ ఆఫ్ స్వీడన్ ప్రైజ్ ఇన్ ఎకనామిక్ సైన్సెస్ ఇన్ మెమరీ ఆఫ్ ఆల్ఫ్రెడ నోబెల్’ అని పిలుస్తారు. గత సంవత్సరం, వ్యాపార ఆవిష్కరణలను అధ్యయనం చేసే ముగ్గురు పరిశోధకులు, కొత్త ఉత్పత్తులు, ఆవిష్కరణలు పాత కంపెనీలను వెనక్కి నెట్టివేస్తూనే, ఆర్థిక వృద్ధిని, మానవ సంక్షేమాన్ని ఎలా ప్రోత్సహిస్తాయో వివరించినందుకు ఈ బహుమతిని గెలుచుకున్నారు. అర్థశాస్త్ర బహుమతిని అధికారికంగా ‘ఆల్ఫ్రెడ నోబెల్ జ్ఞాపకార్థం బ్యాంక్ ఆఫ్ స్వీడన్ ఆర్థిక శాస్త్ర బహుమతి’ అని పిలుస్తారు. డైనమైట్‌ను కనుగొని, ఐదు నోబెల్ బహుమతులను స్థాపించిన 19వ శతాబ్దపు స్వీడిష్ వ్యాపారవేత్త, రసాయన శాస్త్రవేత్త అయిన నోబెల్ జ్ఞాపకార్థం, ఈ కేంద్ర బ్యాంకు 1968లో దీనిని స్థాపించింది. అర్థశాస్త్ర బహుమతి సాంకేతికంగా నోబెల్ బహుమతి కాదని, కానీ 1896లో నోబెల్ మరణించిన వార్షికోత్సవం అయిన డిసెంబర్ 10న దీనిని ఎల్లప్పుడూ ఇతర బహుమతులతో కలిపి అందజేస్తారని నోబెల్ సంప్రదాయవాదులు నొక్కి చెబుతారు. గత వారం వైద్యం, భౌతిక శాస్త్రం, రసాయనశాస్త్రం, సాహిత్యం, శాంతి రంగాలలో నోబెల్ పురస్కారాలను ప్రకటించారు. ఈ సంవత్సరం బహుమతి సొమ్ము 12 మిలియన్ల స్వీడిష్ క్రోనార్లు (సుమారు 1.2 మిలియన్ల అమెరికన్ డాలర్లు). ఇది ఒక వ్యక్తికి, విజేతల చిన్న సమూహానికి లేదా సంస్థకు అయినా వర్తిస్తుంది.

## సిఇసిని తొలగించే వరకు ఉద్యమం ఆగదు: మహేశ్‌కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఓట్ల చోరీకి బిజెపికి ఎన్నికల కమిషన్ సహకరిస్తోందని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. సోమవారం ఓటు బచ్చావో.. దేశ్ బచ్చావో.. పేరుతో ఢిల్లీలో నిర్వహించిన నిరసన ర్యాలీలో పాల్గొన్న మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఓట్ల అక్రమాలపై దేశవ్యాప్తంగా ప్రజలు, ముఖ్యంగా యువత తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. ఎస్ఐఆర్ అక్రమాలపై తమ వద్ద ఆధారాలున్నాయని, సుప్రీంకోర్టు తమ వాదనలు వినాలని కోరారు. సిఇసి రాజీనామా చేయాలని, లేదంటే కేంద్ర ప్రభుత్వం ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## దుర్భర దారిద్ర్యం (మొదటి పేజీ తరువాయి)

తగ్గిందని కూడా నివేదిక పేర్కొంది. యుఎన్‌డిపి–ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ రెండూ కలిసి రూపొందించిన ప్రపంచ బహుముఖ పేదరిక నివేదిక–2026 సోమవారం విడుదల చేశాయి.ఈ నివేదిక ప్రకారం 2010 తర్వాత మొదటిసారి దుర్భర దారిద్ర్యంలో మగ్గే ప్రజలసంఖ్య మళ్ళీ పెరిగిపోయింది.కడు పేదరికంలో బ్రతికేవారిసంఖ్య భారీగా పెరగడం ప్రపంచదేశాలకు ఒక మేలుకొలుపు,పెద్ద హెచ్చరిక అని యుఎన్‌డిపి నిర్వాహకుడు అలెగ్జాండర్ డి క్రూ చెప్పారు.ఆకలి,అవిద్య,విద్యుత్ సదుపాయం లేకపోవడం,స్వచ్ఛమైన నీటి లభ్యత కొరత వంటి సమస్యలను మెజార్టీ ప్రజలు ఎదుర్కొంటున్నారని ఆయన చెప్పారు.అభివృద్ధి చెందుతున్న 108 దేశాలలో 13 దేశాలకు మాత్రమే ప్రపంచంలో వస్తున్నకొత్త సమాచారం అందుబాటులోకి వస్తోందని,ప్రపంచంలో పెరుగుతున్న జనాభా కూడా ఈ పేదరికం పెరుగుదలకు కారణం కావచ్చునని అన్నారు.కాగా ఈజిప్టు,తజికిస్థాన్ తోపాటు నేపాల్‌లో కూడా దుర్భర దారిద్ర్యం,బహుముఖ దారిద్ర్యం తగ్గుముఖం పట్టిన దేశాల జాబితాలో ప్రముఖంగా ఉన్నాయని చెప్పారు. అంగోలా,జాంబియా దేశాలలో కూడా పేదరికంరేటు తగ్గిందని,కానీ జనాభా పెరుగుదలవల్ల ఇది మళ్ళీ తిరోగమనంలో ఉందని నివేదిక ప్రకటించింది.గృహవసతి,వంట ఇంధనం, విద్యుత్, పారిశుద్ధ్యం,ఆహారం,విద్యావసతి వంటి అంశాలను ఈ నివేదిక కొలమానాలుగా తీసుకుంది. ప్రజలు తమ దైనందిన జీవితంలో ఎదుర్కొనే బహుముఖ ప్రతికూలతలను ఈ నివేదిక ప్రతిబింబించింది.

## రిటైల్ ద్రవ్యోల్బణం పైపైకి

(మొదటి పేజీ తరువాయి)

చేర్చింది. దాదాపు నాలుగేళ్లలో ఇదే తొలి వడ్డీ రేటు పెంపు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, రూపాయి బలహీనపడటం, ముడి చమురు ధరలు అధికంగా ఉండటం వంటి పరిస్థితుల నేపథ్యంలో సమీప భవిష్యత్తులో వడ్డీ రేట్ల తగ్గింపునకు అవకాశం లేదని, అవసరమైతే మరిన్ని పెంపులు ఉండవచ్చని ఆర్‌బిఐ సంకేతాలిచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాను కూడా ఆర్‌బిఐ స్వల్పంగా పెంచింది. గతంలో 5 శాతంగా అంచనా వేయగా, ఇప్పుడు దానిని 5.2 శాతానికి పెంచింది. వివిధ వస్తువుల ధరల్లో పెరుగుదల ఒత్తిళ్లు క్రమంగా స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొంది. ద్రవ్యోల్బణాన్ని 4 శాతం వద్ద కొనసాగించేలా చూడాలని ఆర్‌బిఐని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినప్పటికీ, అది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. కాగా, ధరల పెరుగుదలకు ఎల్‌నినో పరిస్థితులే కారణమని నిపుణులు అంటున్నారు. దీనికి తోడు చమురు సంబంధిత ముడి సరుకులు కూడా ఒత్తిడి పెంచుతున్నాయి. ఎల్‌నినో ప్రభావం 2027 వరకూ కొనసాగవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో, పంటల ఉత్పత్తిలో కాలానుగుణ మార్పులు, జీవ ఇంధనాల తయారీ కోసం పంటలను మళ్లించడం వంటివి సరఫరా పరంగా మరిన్ని ప్రమాదాలను సృష్టిస్తున్నాయి.

ప్రజాపక్షం దినపత్రికకు వార్షికోత్సవ శుభాకాంక్షలు










Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com